ఆంధ్రజ్యోతి

16 చిత్తూరు

శుక్రవారం, 25 ఆగస్టు 2017

బ్రహ్మోత్సవాలకు కాణిపాకం సిద్ధం

వరసిద్ధుడి బ్రహ్మోత్సవాలకు కాణిపాకం సుందరంగా ముస్తాబైంది. శుక్రవారంనాటి వినాయకచవితి పర్వదినం నుంచి వచ్చేనెల 14వతేదీ వరకు నిర్వహించనున్న ఉత్సవాలకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. చవితినాడు దర్శనానికి లక్షమంది భక్తులు తరలివస్తారన్న అంచనాతో ఒకటిన్నర లక్షల లడ్డూలు, 10వేల వడలను సిద్ధం చేశారు. తెల్లవారుజామున 3 గంటల నుంచే భక్తులను స్వామి దర్శనానికి అనుమతించనున్నారు.

9



విద్యుద్దీపాలంకరణలో కాణిపాక ఆలయం

పండుగ సందడి

వినాయక చవితి కొనుగోలుదారులతో బజార్లన్నీ కిటకిటలాడాయి. వినాయక విగ్రహాలు, పూజా సామగ్రిని విక్రయించే వారితో రద్దీ నెలకొంది.వీధివీధినా విగ్రహ మండపాలు, ప్రతిమల ప్రతిష్ఠ ఏర్పాట్లలో నిమగ్నమైన యువతతో అంతటా చవితి శోభ సంతరించుకుంది.

- వివరాలు లోపలి పేజీల్లో -



చిత్తూరులో చవితి కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న చర్చివీధి

'రెడ్' లేడీ సంగీత ఆత్మహత్యాయత్నం



సంగీతా చటర్జీ

ఐదు నెలలుగా రిమాండుపై చిత్తూరు సబ్ జైలులో

బెయిల్ రాకపోవడం, ఆహారం పడకపోవడంతో నిస్పృహ

వివరాలు 3లో..

బదిలీ ఉత్తర్వులొచ్చాయ్

- రేపు రిలీవై ఎల్లుండి కొత్త పాఠశాలలకు టీచర్లు
- విద్యాశాఖ కమిషనర్ వెబ్‌సైట్‌లో ఉత్తర్వులు

2

ఒకే పని.. రెండు సార్లు!

ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయ లోపం

లక్షలాది రూపాయల ప్రజాధనం వృథా

15

తిరుపతి-రేణిగుంట రోడ్డుపై డివైడరు తొలగింపు పనులు



రూ.60 కోట్ల ఉపాధి బకాయిల విడుదల

చిత్తూరు కలెక్టరేట్: ఉపాధి పథకం కింద పనులు చేసిన కూలీలకు చెల్లించాల్సిన బకాయిల్లో రూ.60 కోట్లు గురువారం విడుదలయ్యాయి. వారం రోజుల్లోగా కూలీలకు వేతనాలు చెల్లించాలని ప్రభుత్వం ఆదేశించింది. అయితే నిధులున్నంత మేర సర్దుబాటు చేస్తూ వచ్చిన అధికారులు చేతులెత్తేశారు. దీంతో చేసిన పనులకు నెలరోజులుగా సొమ్ము అందక కూలీలు ఎదురుచూస్తున్నారు. మరోవైపు మెటీరియల్ కాంపొనెంట్ పద్దు కింద చేసిన పనులకూ బిల్లులు అందాల్సి ఉంది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వ అభ్యర్థనతో కేంద్ర రూ.60 కోట్ల నిధులను విడుదల చేసింది. ఈ విషయమై డ్వామా పీడీ కూర్మనాథ్ మాట్లాడుతూ రెండ్రోజుల్లో బిల్లుల పంపిణీ చేపడతామని చెప్పారు.

ఇసుక కొరత లేకుండా

నూతన రీచ్‌ల ఏర్పాటు: కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్: జిల్లాలో ఇసుక కొరత లేకుండా నూతన రీచ్‌లను ఏర్పాటు చేయాలని కలెక్టర్ పీఎస్ ప్రద్యుమ్న ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో ఆయన అధికారులతో మాట్లాడుతూ.. జిల్లాలో 114 ఇసుకరీచ్‌లు ఉండగా, 75 రీచ్‌ల నుంచే సరఫరా జరుగుతోందని గుర్తుచేశారు. ఇసుక రవాణాదారులు జిల్లాస్థాయి కమిటీ నిర్ణయించిన ధరలకే ఇసుక సరఫరా చేయాలని ఆదేశించారు. ధరల పర్యవేక్షణకు డివిజన్, మండలస్థాయి పోలీసు, మున్సిపల్, రవాణా, పీఆర్, భూగర్భగనుల శాఖ అధికారులతో కమిటీలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. దూరం, రవాణా ఛార్జీల వివరాలు తెలిసేలా మండల, మున్సిపల్ కార్యాలయాలు, రద్దీ ప్రాంతాల్లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఇసుక రీచ్‌ల్లో తవ్వకాలు, సరఫరా, ధరల అమలు బాధ్యత కార్యదర్శులు, రెవిన్యూ అధికారులదే అన్నారు. దీనిపై ప్రజలకు సందేహాలుంటే నెం.1100కు ఫోన్ చేయాలని సూచించారు. కాగా, మూడు క్యూబిక్ మీటర్ల ఇసుక ట్రాక్టర్ లోడింగ్‌కు రూ.350, 30 కి.మీ. వరకు రవాణా ఛార్జీ రూ.900, ఆపై ప్రతి కి.మీ. రూ.30 అదనంగా చెల్లించాల్సి ఉందని చెప్పారు. అన్ని రకాల ఛార్జీలతో లోడ్ ట్రాక్టర్ ఇసుక ధర పట్టణాల వారీగా... చిత్తూరు, నగరిలో రూ.1200, తిరుపతి, శ్రీకాళహస్తిలో రూ.1300, పుత్తూరులో రూ.1500, పలమనేరులో రూ.1000-1250, పుంగనూరులో రూ.1250, పీలేరులో రూ.1250-1400, కుప్పంలో రూ.1200-1500, మదనపల్లెలో రూ.1850గా నిర్ణయించినట్లు కలెక్టర్ పేర్కొన్నారు.

హంద్రీ-నీవా కాలువ పనులకు

బాహుదాలో ఇసుక లభ్యతపై పరిశీలన

కలికిరి: హంద్రీ-నీవా కాలువ పనులకు బాహుదా నదిలో ఇసుక లభ్యత విషయమై మైన్స్ అండ్ జియాలజీ అధికారులు ఇటీవల పరిశీలించినట్లు తెలిసింది. గతంలో రీచ్‌లు ఉన్నప్పుడు ప్రభుత్వం ద్వారా ఇసుక విక్రయించేవారు. మండలంలోని మేడికుర్తి, చీకటిపల్లె, పారపట్ల, అద్దవారిపల్లె, చీకటిపల్లె రీచ్‌ల ద్వారా ఇసుక అమ్మేవారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చి మీ-సేవలో డబ్బు చెల్లించి వేలాది ట్రాక్టర్లతో ఇసుకను తీసుకెళ్లడంతో నిల్వలు బాగా తగ్గిపోయాయి. అయితే 2015లో కురిసిన భారీవర్షాలకు బాహుదాలో ఇసుక బాగా చేరింది. అధికారులు జారీ చేసిన పర్మిట్లతో ప్రభుత్వ, ప్రభుత్వేర పనులకు పలువురు ఇసుక తీసుకెళుతున్నారు. హంద్రీ-నీవా కాలువ పనులకు కుప్పం తదితర ప్రాంతాలకు కూడా అధికారులు ఇసుకను తరలించే యోచనలో ఉన్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ పనులకు వేలాది క్యూబిక్ మీటర్ల ఇసుక అవసరమవుతుంది. పెద్ద ఎత్తున ఇసుకను తరలిస్తే భూగర్భజలాలు అడుగంటే పరిస్థితులు నెలకొని వ్యవసాయ బోర్లలో నీటిమట్టం తగ్గిపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఆన్‌లైన్‌లో టీచర్ల బదిలీ ఉత్తర్వులు

26న రిలీవై 27న కొత్త పాఠశాలల్లో చేరిక

విద్యాశాఖ కమిషనర్ వెబ్‌సైట్‌లో ఉత్తర్వులు

చిత్తూరు సిటీ: కౌన్సెలింగ్ ద్వారా బదిలీ అయిన టీచర్లకు గురువారం సాయంత్రం నుంచి బదిలీ ఉత్తర్వులు వెలువడ్డాయి. విద్యాశాఖ కమిషనర్ వెబ్‌సైట్ ద్వారా ఈ బదిలీ ఆదేశాలను ప్రభుత్వం విడుదల చేసింది.కౌన్సెలింగ్ జరిగి దాదాపు 10 నుంచి 15 రోజులు గడుస్తుండడంతో బదిలీ ఆదేశాల కోసం జిల్లాలోని 10,264 మంది టీచర్లు ఎదురుచూశారు. అయితే జిల్లా విద్యాశాఖ కార్యాలయం నుంచి కమిషనర్ కార్యాలయానికి అందిన బదిలీల జాబితాను పూర్తిస్థాయిలో పరిశీలించిన తర్వాత గురువారం ఉత్తర్వులను జారీచేశారు.బదిలీ అయిన టీచర్లంతా కమిషనర్ వెబ్‌సైట్‌లో వుంచిన ఉత్తర్వులను డౌన్‌లోడ్ చేసుకుని 26న రిలీవ్ కావాలని, 27న కొత్త పాఠశాలల్లో జాయిన్ కావాలని ప్రభుత్వం ఆదేశించింది. కొన్ని సబ్జెక్టులకు సంబంధించి టీచర్లను రిలీవ్ చేయడంలో పాఠశాలల హెచ్‌ఎంలు జాగ్రత్తలు పాటించాలని విద్యాశాఖ అధికారులు సూచించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం సబ్జెక్టు టీచర్లను రిలీవ్ చేయాలని ఆదేశించారు.దీంతో చాలామంది సబ్జెక్టు టీచర్లకు రిలీవర్ వచ్చేంత వరకు రిలీవ్ చేసే పరిస్థితి లేదు.

1, 2 తేదీల్లో రాష్ట్రపతి పర్యటన?

ముందస్తు ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, అధికారులు - ఇంకా అధికారిక సమాచారం రాలేదన్న ప్రద్యుమ్న

తిరుపతి (జీవకోన): తిరుపతి, తిరుమలలో సెప్టెంబరు ఒకటి, రెండో తేదీల్లో రాష్ట్రపతి రామ్‌నాథ్‌కోవింద్ పర్యటించే అవకాశం ఉందని కలెక్టర్ ప్రద్యుమ్న తెలిపారు. ఈ పర్యటనకు సంబంధించిన ముందస్తు ఏర్పాట్లను గురువారం అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. తిరుపతి స్విమ్స్ సమీపంలో శ్రీపద్మావతీ మహిళా వైద్యకళాశాల ఆస్పత్రిని రాష్ట్రపతి చేతులమీదుగా ప్రారంభించనున్నారు. దీంతో ఆస్పత్రిలోని వార్డులను అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రద్యుమ్న మీడియాతో మాట్లాడుతూ.. వచ్చే నెల ఒకటి, రెండో తేదీల్లో తిరుపతి, తిరుమలలో రాష్ట్రపతి పర్యటించే అవకాశం ఉందని.. అధికారికంగా సమాచారం రావాలన్నారు. ముందస్తు ఏర్పాట్లపై సంబంధిత శాఖాధికారులకు సూచనలు ఇస్తున్నామన్నారు. పర్యటన పూర్తి వివరాలు త్వరలో అధికారికంగా తెలియజేస్తామన్నారు. ఇప్పటి వరకు అందించిన సమాచారం మేరకు ఒకటో తేదీన సాయంత్రానికి తిరుపతి విమానాశ్రయానికి రాష్ట్రపతి చేరుకుంటారన్నారు. తిరుమలకు రోడ్డుమార్గాన బయల్దేరి వెళ్తారన్నారు. ఆ రోజు రాత్రి తిరుమలలో బస చేస్తారన్నారు. రెండో తేదీన రూ.139.42 కోట్లతో నిర్మించిన తిరుపతిలోని శ్రీపద్మావతీ మహిళా వైద్యకళాశాల ఆస్పత్రి భవనాన్ని ప్రారంభిస్తారన్నారు. అలాగే మెడికల్ కళాశాల



ఆస్పత్రి వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

విద్యార్థినులతో రాష్ట్రపతి ఇష్టాగోష్ఠి కార్యక్రమం నిర్వహించడానికి అవసరమైన స్థలాల కోసం శ్రీనివాస ఆడిటోరియం, శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని లైబ్రరీలోని క్విక్ రెఫరెన్స్‌హాల్‌ను పరిశీలించామన్నారు. రాష్ట్రపతి పర్యటనలో భాగంగా గవర్నర్ ఈఎస్‌ఎల్ నరసింహన్, ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరవుతారన్నారు. ఏర్పాట్ల పరిశీలన కార్యక్రమంలో తిరుపతి అర్బన్ ఎస్పీ అభిషేక్ మహంతి, సబ్‌కలెక్టర్ నిషాంత్‌కుమార్, స్విమ్స్ డైరెక్టర్ టీఎస్ రవికుమార్, జాయింట్ కలెక్టర్ -2 వీఆర్ చంద్రమౌళి, ఎస్వీయూనివర్సిటీ ఉపకులపతి ఆవుల దామోదరం, రిజిస్ట్రార్ దేవరాజులునాయుడు, ఈఈ నగేష్, డిప్యూటీ డీఈ మునికృష్ణ, అర్బన్ తహసీల్దారు చంద్రమోహన్, ఇన్‌చార్జ్ మున్సిపల్ కమిషనర్ శ్రీదేవి, సంబంధిత శాఖాధికారులు తదితరులు పాల్గొన్నారు.

దేశాన్ని, సమాజాన్ని ప్రేమించండి

సంకల్పసిద్ధి ప్రతిజ్ఞ సభలో కలెక్టర్ పిలుపు

చిత్తూరు కలెక్టరేట్: దేశాన్ని, సమాజాన్ని ప్రేమించాలనీ, దేశ వారసత్వ సంపద కాపాడుకోవాలని కలెక్టర్ పీఎస్ ప్రద్యుమ్న పిలుపునిచ్చారు. గురువారం సాయంత్రం జడ్పీ మీటింగ్‌హాలులో జిల్లాస్థాయి సంకల్పసిద్ధి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా హాజరైన వారితో ప్రతిజ్ఞ చేయించిన కలెక్టర్ మాట్లాడుతూ.. 1942, ఆగస్టు 9న క్విట్‌ఇండియా ఉద్యమాన్ని ప్రారంభించిన ఐదేళ్లలో స్వాతంత్ర్యం సాధించామన్నారు. ఇదే స్ఫూర్తితో 2022 నాటికి సమాజాభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం 'సంకల్పసిద్ధి' చేపట్టినట్లు గుర్తుచేశారు. ఇందులో భాగంగానే ఈనెల 19 నుంచి గ్రామసభలు నిర్వహించగా, 3.84 లక్షల మంది సంకల్పం చేసుకున్నారని చెప్పారు. డీఆర్‌డీఏ, రెవిన్యూ, పీఆర్ యంత్రాంగం నెలలో ఒక గ్రామ పంచాయతీని దత్తత తీసుకొని చెత్తరహితంగా తీర్చిదిద్దాలన్నారు. ఈ మేరకు అక్టోబర్ 2న జిల్లావ్యాప్తంగా గ్రామాలను బృందావనాలుగా ప్రకటించనున్నట్లు పేర్కొన్నారు. జేసీ-2 చంద్రమౌళి మాట్లాడుతూ



సభలో ప్రసంగిస్తున్న కలెక్టర్ ప్రద్యుమ్న

జిల్లాను మరింత అభివృద్ధి పథంలో తీసుకెళ్ళేందుకు కృషి చేస్తామన్నారు. సమావేశంలో జడ్పీ ఇన్‌చార్జి సీఈవో రవికుమార్ నాయుడు, వైస్ చైర్మన్ సుందరరామిరెడ్డి, జడ్పీటీసీలు, ఎంపీపీలు, అధికారులు పాల్గొన్నారు.

కొండంత నిధులు ఇస్తున్నా..

గ్రామీణప్రాంతాల అభివృద్ధి కోసం అడిగినా, అడక్కున్నా కొండంత నిధులు ఇస్తున్నామని కలెక్టర్ పేర్కొన్నారు. అయితే అంగన్‌వాడీల అభివృద్ధి గోరంత పంచాయతీ నిధులివ్వమంటే కొందరు(సర్పంచ్‌లు) వెనుకడుగు వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణం తదితర వాటికి స్పెషల్‌ఫండ్ నుంచి కోరినన్ని నిధులు విడుదల చేస్తున్నామని చెప్పారు. 'నీరు-చెట్టు', ఇతర అభివృద్ధి పనులకు నిధుల వర్షం కురిపిస్తున్నామని గుర్తుచేశారు. కాగా, జిల్లాలోని అన్ని పంచాయతీల పరిధిలో 4600కు పైగా అంగన్‌వాడీకేంద్రాలున్నాయన్నారు. వీటిని ఆశ్రయించే పిల్లల కోసం బెంచీల ఏర్పాటుకు రూ.50వేల వంతున సర్పంచ్‌లు పంచాయతీ నిధులు ఇవ్వాలని ప్రాధేయపడుతున్నట్లు చెప్పారు. తన మొర ఆలకించి పలువురు నిధులిచ్చినా, అధికశాతం సర్పంచ్‌లు వెనకడుగు వేస్తున్నారని పేర్కొన్నారు. మనుషుల ప్రవర్తన ఇలాగే ఉంటుందనీ, సంకల్పసిద్ధి ద్వారా వచ్చే ఐదేళ్లలో ప్రజల మనస్సుల్లో మార్పు తెచ్చేందుకు కృషి చేస్తున్నామని వివరించారు.

ప్రైవేటు పాఠశాలలకు రక్షణ కల్పించాలి

కర్నూలు ఘటనపై చిత్తూరులో అపుస్మా భారీ ర్యాలీ

చిత్తూరు సిటీ: జిల్లాలోని ప్రైవేటు పాఠశాలలు, వాటి యజమాన్యాలకు ప్రభుత్వం రక్షణ కల్పించాలని జిల్లా అపుస్మా(ఏపీ స్టేట్ అన్‌ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్) ప్రతినిధులు డిమాండ్ చేశారు. కర్నూలు జిల్లాకు చెందిన ప్రైవేటు పాఠశాలల యజమానులు శ్రీనివాసులు రెడ్డి, పుల్లయ్యపై ఇటీవల విద్యార్థి సంఘాల నాయకులు దాడి చేసిన విషయం విదితమే. ఈ ఘటనను నిరసిస్తూ అపుస్మా రాష్ట్ర కమిటీ పిలుపు తో గురువారం నగరంలో జిల్లా సంఘ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ, ఆందోళన జరిగింది. తొలుత జిల్లాలోని ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల యజమానులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు స్థానిక గురునగర్ కాలనీలోని ఆర్కే మోడల్‌స్కూల్‌లో సమావేశమయ్యారు. అనంతరం ర్యాలీగా బయలుదేరి ఓవర్ బ్రిడ్జి మీదుగా ఎంఎస్సార్ సర్కిల్ చేరుకున్నారు. అక్కడ గాంధీ విగ్రహానికి పూలమాల వేసి మానవహారం నిర్వహించారు. అపుస్మా జిందాబాద్, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల ఐక్యత వర్ధిల్లాలి, ప్రైవేటు పాఠశాలల యజమానులకు రక్షణ కల్పించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అపుస్మా జిల్లా గౌరవాధ్యక్షుడు ఎస్‌ఎస్‌కె రాజా మాట్లాడుతూ .. తక్కువ ఫీజులతో విద్యార్థులకు అత్యుత్తమ బోధన సాగిస్తున్నట్లు చెప్పారు. పలువురు విద్యార్థి సంఘాల పేరిట తమ పట్ల అమర్యాదగా ప్రవర్తిస్తూ అనుచితంగా వ్యవహరిస్తున్నారని వాపోయారు. దీంతో తమకు పూర్తిగా రక్షణ కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. అపుస్మా జిల్లా అధ్యక్షుడు మహేష్ మాట్లాడుతూ.. కర్నూలు జిల్లా ఘటనలో ఇప్పటికీ ప్రభుత్వం దోషులపై చర్యలు తీసుకోక పోవడం శోచనీయమన్నారు. ఇకపై ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు. అపుస్మా జిల్లా ఉపాధ్యక్షుడు తేజోమూర్తి మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల యజమానులపై విద్యార్థి సంఘాల దాడులు తగవని స్పష్టం చేశారు. కర్నూలు సంఘటనలో నిందితులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ర్యాలీలో అపుస్మా కోశాధికారి నాగరాజు, ఈసీ మెంబర్లు ప్రసాద్, చక్రి, కో-ఆర్డినేటర్లు రవి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



చిత్తూరులో అపుస్మా సభ్యుల ర్యాలీ

'రెడ్' లేడీ ఆత్మహత్యాయత్నం

● 5 నెలలుగా రిమాండుపై చిత్తూరు సబ్ జైలులో సంగీతా ఛటర్జీ

చిత్తూరు క్రైం: చిత్తూరు సబ్ జైలులో రిమాండు ఖైదీగా వున్న ఎర్రచందనం స్మగ్లర్, మాజీ ఎయిర్ హోస్టెస్ సంగీతా ఛటర్జీ గురువారం మధ్యాహ్నం ఆత్మహత్యకు యత్నించారు. ఐదు నెలలుగా రిమాండులో వుంటున్న ఆమె బెయిలు రాకపోవడం, దక్షిణాది ఆహారం సరిపడకపోవడం వంటి కారణాలతో నిస్పృహకు గురై సబ్ జైలులోని టాయిలెట్ క్లీనర్ తాగేశారు. జైలు సిబ్బంది చిత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాసుపత్రికి తరలించారు. పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతా నగరానికి చెందిన సంగీతా ఛటర్జీ గతంలో ఎయిర్ హోస్టెస్‌గా పనిచేసేవారు. చెన్నైకి చెందిన ఎర్రచందనం అంతర్జాతీయ స్మగ్లర్ మార్కొండన్ లక్ష్మణ్ విమాన ప్రయాణ సందర్భాల్లో ఆమెతో పరిచయం పెంచుకున్నాడు. అప్పటికే వీరిద్దరూ వివాహితులు. ఈ పరిచయం పెరిగి ప్రేమకు దారితీయడంతో సంగీతా ఛటర్జీ తన భర్తకు విడాకులిచ్చి 2013లో లక్ష్మణ్‌ను వివాహం చేసుకున్నారు. 2015లో చిత్తూరు పోలీసులు లక్ష్మణ్‌ను అరెస్టు చేసి అతనిపై పీడీ యాక్టు కింద కేసు నమోదు చేశారు. అప్పటి నుంచీ అతను కడప సెంట్రల్ జైలులో రిమాండులో వుంటున్నారు. లక్ష్మణ్ అరెస్టయ్యాక అతని తరపున ఎర్రచందనం అక్రమ రవాణా, నగదు లావాదేవీలన్నీ సంగీతా ఛటర్జీయే నిర్వహించారు.చిత్తూరు జిల్లాలోని కల్లూరు పోలీసు స్టేషన్‌లో ఎర్రచందనం అక్రమ రవాణాకు సంబంధించి నమోదైన ఓ కేసులో అరెస్టయిన నిందితులు ఇచ్చిన సమాచారంతో అప్రమత్తమైన పోలీసులు ఆమెపై యాదమరి, కల్లూరు, నిండ్ర పోలీసు స్టేషన్లలో కేసులు నమోదు చేశారు. గతేడాది కోల్‌కతా వెళ్ళి ఆమెను అరెస్టు చేశారు. స్థానిక కోర్టులో ప్రవేశపెట్టడంతో అనారోగ్యం సాకు చూపి ఆమె బెయిల్ తీసుకున్నారు. తర్వాత జిల్లాలోని కేసులకు సంబంధించి జరిగే కోర్టు విచారణలకు హాజరు కాలేదు. దాంతో పాకాల కోర్టు రెండు పర్యాయాలు అరెస్టు వారెంట్లు కూడా జారీ చేసింది. ఈ వారెంట్ల అమలు కోసం ఆమె కదలికలను ఆరా తీసిన జిల్లా పోలీసులు తమకందిన క్లూ మేరకు ఈ ఏడాది మార్చి మూడవ వారంలో కోల్‌కతా బయల్దేరి వెళ్ళారు. సుమారు వారం రోజుల పాటు నిఘా వుంచి అదే నెల 28వ తేదీ మంగళవారం ఓ పబ్‌లో వుండగా అదుపులోకి తీసుకున్నారు. అక్కడి కోర్టులో హాజరుపరిచిన అనంతరం అదే రోజు అర్ధరాత్రి బెంగుళూరుకు, అక్కడ నుంచీ 29వ తేదీ బుధవారం తెల్లవారు ఝామున చిత్తూరుకు తీసుకొచ్చారు. అదే రోజు పాకాల కోర్టు మెజిస్ట్రేట్ నివాసం వద్ద హాజరుపరచగా మెజిస్ట్రేట్ 14 రోజుల పాటు రిమాండు విధించారు. దానిపై సంగీతా ఛటర్జీని చిత్తూరు సబ్ జైలుకు తరలించారు. రిమాండు ఖైదీ (నంబరు 3636)గా ఆమె సబ్ జైలులోని మహిళా బ్యారక్‌లో గత ఐదు నెలలుగా వుంటున్నారు. ఈ నేపథ్యంలో గురువారం మధ్యాహ్నం సుమారు 1.25 గంటల సమయంలో మహిళా సిబ్బందికి సంబంధించిన టాయిలెట్‌కు వెళ్ళారు. అందులో వున్న టాయిలెట్ క్లీన్ చేసే కెమికల్‌ను తాగేశారు. టాయిలెట్ల వద్దే వాంతులు చేసుకోవడంతో గుర్తించిన సబ్‌జైలు మహిళా సిబ్బంది అధికారులకు సమాచారమిచ్చారు. దాంతో అధికారులు హుటాహుటిన ఆమెను చిత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆమెతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. జైలులో సిబ్బంది స్వయంగా తయారు చేసిన టాయిలెట్ క్లీనర్ ద్రావణాన్ని (సుమారు వంద మిల్లీలీటర్లు) తీసుకున్నట్లు తెలిసింది. ప్రాథమిక చికిత్స అందించిన అనంతరం వైద్యుల సూచన మేరకు ఎండోస్కోపీ చేయించడం కోసం ఆమెను తిరుపతి రుయాస్పత్రికి తరలించారు.రుయాలో చికిత్స అనంతరం స్విమ్సులోని గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగానికి తరలించి చికిత్సలందిస్తున్నారు.


చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న సంగీతా ఛటర్జీ

నిస్పృహతోనే ఆత్మహత్యా యత్నం

నిరాశా నిస్పృహలతోనే సంగీతా ఛటర్జీ ఆత్మహత్యకు యత్నించినట్టు తెలిసింది. ఆ మేరకు ఆమె నుంచీ పోలీసులు స్టేట్‌మెంట్ నమోదు చేశారు. తొలుత బెయిలు త్వరగానే వస్తుందని భావించానని, అయితే ఐదునెలలు గడుస్తున్నా బెయిలు రాకపోవడంతో తాను మానసికంగా కృంగిపోయానని పోలీసులతో చెప్పారు. దానికి తోడు ఉత్తరాది వంటకాలకు అలవాటు పడిన తనకు దక్షిణాది ఆహార పదార్థాలు సరిపడలేదని చెప్పారు. ఇక్కడి ఆహారం తీసుకుంటే కడుపు నొప్పి వస్తోందని చెప్పినట్టు తెలిసింది. కుటుంబం నుంచీ తల్లి మినహా మిగిలిన వారెవరూ తన కోసం రాకపోవడం బాధించిందని చెప్పినట్లు సమాచారం. ఈ కారణాలతోనే తీవ్ర నిస్పృహకులోనై ఆత్మహత్యకు యత్నించానని చెప్పినట్టు తెలిసింది.

భక్తుల ముసుగులో 'ఎర్ర' స్మగ్లర్ల చొరబాటు

● వెంటాడిన టాస్క్‌ఫోర్స్ సిబ్బంది

● ఒకరి అరెస్టు, 20 మంది పరారీ

తిరుపతి (అటవీశాఖ): తిరుపతి హరితకాలనీ సమీపంలోని మట్టిరోడ్డులో భక్తుల ముసుగులో ఎర్రచందనం స్మగ్లర్లు అటవీ ప్రాంతంలోకి చొరబడడాన్ని టాస్క్‌ఫోర్స్ సిబ్బంది గుర్తించి, వెంటాడారు. ఈ సంఘటన గురువారం వేకువజామున జరిగింది. అటవీశాఖ అధికారుల కథనం మేరకు.. వర్షం కురుస్తున్న సమయంలో కొందరు భక్తుల ముసుగులో నెమ్మదిగా అటవీ ప్రాంతంవైపు వెళుతున్నట్లు టాస్క్‌ఫోర్స్ సిబ్బంది గమనించారు. వారిని వెంబడించే ప్రయత్నం చేశారు. గమనించిన ఎర్రచందనం స్మగ్లర్లు చీకటిలో పరుగులు తీశారు. తమవెంట తెచ్చుకున్న ఆహార ప్యాకెట్లు, మద్యం సీసాలు, గొడ్డళ్లను కూడా వదిలేశారు. వెంటాడగా ఓ స్మగ్లర్ మాత్రం పట్టుబడ్డాడు. అతడిని తమిళనాడుకు చెందిన సి.కుమార్‌గా గుర్తించారు. దాదాపు 20 మంది పరారయ్యారు. అనంతరం సంఘటనా స్థలం నుంచి ఆహార పదార్థాలు, గొడ్డళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ బృందంలో ఆర్‌ఎస్‌ఐ విజయనరసింహ, ఎఫ్‌ఎస్‌వో నాగరాజ తదితరులు ఉన్నారు. వీరిని టాస్క్‌ఫోర్స్ ఐజీ కాంతారావు అభినందించారు.

దోపిడీ ముఠా సభ్యులకు జైలు శిక్ష, జరిమానా

బంగారుపాళ్యం : వివిధ ప్రాంతాల్లో దోపిడీలు, మోసాలకు పాల్పడుతున్న కర్ణాటక రాష్ట్రానికి చెందిన ముఠా సభ్యులకు ఒక్కొక్కరికి మూడు సంవత్సరాల జైలు శిక్ష, రూ.2 వేలు జరిమానా విధిస్తూ పీఎఎస్‌జే న్యాయమూర్తి మురళీకృష్ణ తీర్పు చెప్పారు. బంగారుపాళ్యం పోలీసుల వివరాల మేరకు... కర్ణాటక రాష్ట్రానికి చెందిన చంద్ర (35), రమణారెడ్డి(35), నరసింహులు(50), ఉమాపతి (37), గుర్రప్పనాయుడు (60), సుబ్రహ్మణ్యం (33), మంజునాథ్(38), సురేష్ (36), నారాయణస్వామి (33), వీరప్ప నాయుడు (28) ముఠాగా ఏర్పడి నేరాలు దోపిడీలకు పాల్పడుతుండేవారు. 2015 జనవరి నెల 12వ తేది ఉదయం బలిజపల్లె చెక్‌పోస్టు వద్ద అప్పటి గంగవరం రూరల్ సీఐ రవికుమార్, బంగారుపాళ్యం ఎస్‌ఐ ఉమామహేశ్వరరావు సిబ్బందితో కలసి వాహనాలు తనిఖీ చేస్తుండగా టవేరా, సుమో వాహనాల్లో చిత్తూరు వైపు వస్తూ పోలీసు తనిఖీలకు భయపడి పారిపోవడానికి ప్రయత్నించారు. పోలీసులు వారిని పట్టుకొని తనిఖీ చేయగా వాహనాల్లో ఇనుపరాడ్లు, కత్తులు, మిరప్పొడి 2005వ సంవత్సరానికి ముందు ముద్రించబడిన రూ.500 నోట్లు రూ.50 వేలు లభించాయి. వారిని విచారించగా బెంగుళూరులో గల సుద్దగంగ మఠంలో రమణారెడ్డి పని చేస్తూ సదరు మఠంలో 2005కు ముందు ముద్రించబడిన రూ.500 నోట్లు బ్లాక్‌మనీగా ఉన్నట్లు పేర్కొన్నారు. వీటిని మార్చుకోవడానికి 2005 తరువాత ముద్రించబడిన నోట్లు ఇస్తే దానికి రెట్టింపు నోట్లను ఇచ్చే విధంగా ప్రజలను నమ్మించి వారిని డబ్బులు తీసుకొని రమ్మని చెప్పేవారు. వారు డబ్బులు తెచ్చిన వెంటనే ముఠాలోని ఇరువురు పోలీసు దుస్తుల్లో ఉండి డబ్బులను లాక్కొంటుంటారని, తిరగబడితే వారిని కొట్టి గాయపరిచే వారని, ఇదే క్రమంలో కాణిపాకం బైపాస్ రోడ్డుకు వెళ్తుండగా పట్టుబడినట్లు తెలిపారు. ముఠా సభ్యులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచి చార్జ్‌షీటు దాఖలు చేయగా ప్రభుత్వ న్యాయవాది శైలజరెడ్డి ప్రాసిక్యూషన్ తరపున తమ వాదనలు వినిపించారు.

నిందితులపై నేరం రుజువుకావడంతో పీఏ ఎస్‌జే న్యాయమూరి మురళీకృష్ణ పది మంది ముద్దాయిలకు ఒక్కొక్కరికి మూడు సంవత్సరాల జైలు శిక్ష, రూ.2 వేలు జరిమానా విధించినట్లు బంగారుపాళ్యం పోలీసులు తెలిపారు.

మారణాయుధాల తరలింపు కేసులో

10 మందికి మూడేళ్ల జైలు

చిత్తూరు లీగల్: మారణాయుధాల తరలింపు కేసులో పీఎస్‌జే కోర్టు జడ్జి మురళీకృష్ణ పదిమంది నిందితులకు మూడేళ్ల జైలుశిక్ష విధిస్తూ గురువారం తీర్పుచెప్పారు. వివరాలివీ.. 2015, డిసెంబర్ 1న బంగారుపాళ్యం మండలం బలిజపల్లె వ్యవసాయ మార్కెట్ కార్యాలయం వద్ద గంగవరం సీఐ రవికుమార్ వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌కు చెందిన రమణారెడ్డి, తిరుపతికి చెందిన నరసింహులు, ఉమాపతి, గురవప్ప నాయుడు, బెంగళూరుకు చెందిన సుబ్రహ్మణ్యం, సురేష్, నారాయణస్వామి వీరప్పనాయుడు, గుర్రంకొండకు చెందిన చంద్ర, నరేష్ మారణాయుధాలు తీసుకెళుతున్నట్లు పోలీసులు గుర్తించారు. దీంతో పది మందిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు వాయిదా గురువారం పీఎస్‌జే కోర్టుకు రాగా, జడ్జి మురళీకృష్ణ నిందితులకు మూడేళ్ల జైలుశిక్ష, రూ.రెండు వేల వంతున జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. కాగా, ఈ కేసును ఏపీపీ శైలజ వాదించారు.

పంజాబ్‌లో ఆర్మీ ఉద్యోగి మృతి


మురుగన్ (పాతచిత్రం)

పూతలపట్టు: పంజాబ్‌లో పనిచేస్తూ అనారోగ్యం బారినపడి మండలంలోని చిన్నబండపల్లెకు చెందిన ఓ ఆర్మీ ఉద్యోగి మృతిచెందారు. చిన్నబండపల్లెకు చెందిన మురుగన్(29) 2010లో ఆర్మీలో ఉద్యోగిగా చేరారు. ప్రస్తుతం పంజాబ్ రాష్ట్రం మోగాలో పనిచేస్తున్న యువకుడు వారంరోజులుగా తీవ్ర తలనొప్పితో బాధపడుతున్నారు. స్థానిక ఆర్మీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన గురువారం మృతిచెందినట్లు మురుగన్ కుటుంబ సభ్యులు తెలిపారు. కాగా, మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు.

వాహనం ఢీకొని వ్యక్తి దుర్మరణం



రేణిగుంట: రేణిగుంట - తిరుపతి ప్రధాన రహదారి పారిశ్రామికవాడ వద్ద గురువారం రాత్రి 9.30 గంటలకు వాహనం ఢీకొని ఓ వ్యక్తి (45) దుర్మరణం చెందాడు. పోలీసుల కథనం మేరకు.. ఓ వ్యక్తి రోడ్డు దాటుతుండగా వాహనం ఢీకొని వేగంగా వెళ్లిపోయింది. స్థానికులు వచ్చి చూసేసరికి ఆ వ్యక్తి అప్పటికే మృతి చెందాడు. వారు వెంటనే రేణిగుంట పోలీసులకు సమాచారమిచ్చారు. నల్లప్యాంటు, పచ్చ టీషర్టు ధరించి ఉన్న ఆ వ్యక్తి ఎటువంటి ఆధారాలు లభించలేదని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉంటే.. ఈ ప్రాంతంలో పది రోజుల్లో ఇది రెండో ప్రమాదమని స్థానికులు తెలిపారు.

అవరోధాలను అవకాశాలుగా మార్చుకోండి: అనుపమానంద



అనుపమానంద

పాకాల: లక్ష్య సాధనలో ఎదురయ్యే అవరోధాలను అవకాశాలుగా మార్చుకోవాలని తిరుపతి రామకృష్ణ సేవాసమితి ప్రతినిధి స్వామి అనుపమానంద అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ప్రెషర్సడే జరిగింది. ఈ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. నిర్దిష్ట లక్ష్యాలను విద్యార్థులు క్రమశిక్షణతో సాధించాల్సి ఉందన్నారు. బలహీనతలను జయించడంలో ధ్యానం సహకరిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కొండలరాయుడు, కళాశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, కార్యదర్శి ఆర్వీప్రసాద్, అధ్యాపకులు భారతి, ఏకాంబరాచారి, సుబ్బరాయుడు, బోసు పాల్గొన్నారు.

కట్టమంచి చెరువులోనే నిమజ్జనం: మేయర్



కట్టమంచి చెరువు పనులను పరిశీలిస్తున్న మేయర్ హేమలత తదితరులు

చిత్తూరు రూరల్: వినాయక విగ్రహాలను నిమజ్జనం చేయనున్న కట్టమంచి చెరువును గురువారం మేయర్ కఠారి హేమలత, అధికారులు పరిశీలించారు. గతంలో ఎక్కడబడితే అక్కడ విగ్రహాలను నిమజ్జనం చేయడం తో వాతావరణ కాలుష్యం పెరగడాన్ని అధికారులు గుర్తించారు. దీనికితోడు పారిశుధ్యలోపం ఏర్పడడంపై పర్యావరణ ప్రేమికులు, వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు ఫిర్యాదు చేశారు. దీంతో మేయర్ కఠారి హేమలత, కమిషనర్ బాలసుబ్రహ్మణ్యం కట్టమంచి చెరువులోనే విగ్రహాలను నిమజ్జనం చేయాలని నగర ప్రజలకు పిలుపునిచ్చారు. గురువారం చెరువును పరిశీలించిన మేయర్.. చెరువును మరింత లోతుచేసి నీటిని నింపాలని సూచించారు. నిమజ్జానికి అవసరమైన యంత్రాలను అందుబాటులో ఉంచుతామని చెప్పారు. కార్యక్రమంలో ఎంఈ సుబ్బరాయులు, డీఈ విజయ్‌కుమార్‌రెడ్డి, ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఎంజీ రామభద్ర, అట్లూరి శ్రీనివాసులు, టీడీపీ నేత నౌషాద్‌బాషా పాల్గొన్నారు.

కాణిపాక బ్రహ్మోత్సవాలకు 300 మందితో బందోబస్తు



పోలీసు సిబ్బందికి సూచనలిస్తున్న డీఎస్పీ సుబ్బారావు

ఐరాల(కాణిపాకం): కాణిపాక ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో అవాంఛనీయ ఘటనలు జరగకుండా అన్ని చర్యలు చేపట్టినట్లు డీఎస్పీ సుబ్బారావు, చిత్తూరు వెస్ట్ సీఐ ఆదినారాయణ తెలిపారు. గురువారం సాయంత్రం కాణిపాకం చేరుకున్న పోలీసు బలగాలకు అధికారులు పలు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల బందోబస్తుకు నలుగురు సీఐలు, 17 మంది ఎస్ఐలు, 150 మంది కానిస్టేబుళ్లు, 75 మంది హెడ్‌కానిస్టేబుళ్లు, 25 మంది హోంగార్డులు, 15 మంది మహిళా పోలీసులు, రెండు ప్రత్యేక బలగాలు మొత్తం మూడు వందల మంది సిబ్బందిని కేటాయించినట్లు పేర్కొన్నారు. దీంతోపాటు ఆలయ పరిసరాలలో 52 సీసీ, నాలుగు డ్రోన్ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. అవసరమైతే అదనపు బలగాలను రప్పించేందుకు పోలీసుశాఖ సిద్ధంగా ఉన్నట్లు వివరించారు. ఉత్సవాలకు విచ్చేసే భక్తులు పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు.

నేడు ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు

వినాయక చవితి పురస్కరించుకుని శుక్రవారం కాణిపాకం వరసిద్ధుడి ఆలయ ఆస్థాన మండపంలో ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఉదయం 10 నుంచి 12 గంటల వరకు చిత్తూరుకు చెందిన ఆనందనాయుడు ధార్మికోపన్యాసం, 12 నుంచి 2 గంటల వరకు తిరుపతికి చెందిన భాగవతారిణి ప్రమీలమ్మ హరికథ, మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు హైదరాబాద్‌కు చెందిన శేషాద్రి బృందం భక్తి గీతాలాపన, సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు కడపకు చెందిన సబియాబన్ను భరతనాట్య ప్రదర్శన, సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు శ్రీకాళహస్తికి చెందిన లావణ్య భరతనాట్యం, రాత్రి 8 నుంచి 11 గంటల వరకు నెల్లూరుకు చెందిన భాస్కరయ్య బృంద నాటకం, రాత్రి 11 నుంచి 2 గంటల వరకు అడపరెడ్డిపల్లెకు చెందిన నాదమునిరెడ్డి బృందం ఆధ్వర్యంలో పౌరాణిక నాటక ప్రదర్శన జరగనుంది.

సర్వేలను మేనేజ్ చేసే శక్తి చంద్రబాబుకుంది

ఎమ్మెల్యే నారాయణస్వామి

చిత్తూరు రూరల్: ఎవరినైనా మేనేజ్ చేసే శక్తి చంద్రబాబుకుందని, ఇందులో భాగంగానే నిక్కచ్చిగా సర్వేలు చేసే లగడపాటితో నంద్యాల ఫలితాన్ని తన పార్టీకి అనుకూలంగా ప్రకటన చేయించుకున్నారని ఎమ్మెల్యే నారాయణస్వామి విమర్శించారు. గురువారం ఆయన స్థానిక మీడియాతో మాట్లాడుతూ.. సర్వేలో తేలిన నిజాలను చెబితే తన ఆస్తులపై దాడులు చేస్తారనే భయంతోనే లగడపాటి ఫలితాలను చంద్రబాబు టీడీపీకి అనుకూలంగా చెప్పించారన్నారు. అయితే ఈనెల 28వతేదీ సీఎం దిమ్మతిరిగే తీర్పువస్తుందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే సునీల్‌కుమార్ మాట్లాడుతూ చంద్రబాబుపై నమ్మకం లేకనే నంద్యాలలో పవన్‌కళ్యాణ్ మద్దతుదారులు వైసీపీకి ఓట్లేశారన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ గుణశేఖర్ మొదలి, ఎంపీపీ ప్రగతి, సింగిల్‌విండో ఉపాధ్యక్షుడు బాబు నాయుడు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌ భర్తపై దాడి కేసులో ఇద్దరి లొంగుబాటు

చిత్తూరు లీగల్: సర్పంచ్ భర్తపై దాడి కేసులో గురువారం వైసీపీ నేతతోపాటు మరోవ్యక్తి మూడవ కోర్టులో లొంగిపోయారు. వివరాలివీ.. ఈనెల 22న పూతలపట్టు మండలం పోటుకనుమ పంచాయతీ కార్యాలయంలో రెవిన్యూ గ్రామసభలు నిర్వహించారు. కాగా, తమ బియ్యం కార్డును సర్పంచ్ భర్త తొలగించారని వైసీపీ నేత కొట్లపల్లె బాబు నాయుడు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అర్హుడైన తనకు తెల్లకార్డు మంజూరు చేయాలని ఏడాదిగా తిరుగుతున్నా పట్టించుకోలేదన్నారు. ఈ విషయమై సర్పంచ్ భర్త బాలాజీ నాయుడు జోక్యం చేసుకోవడంతో ఇరువురి నడుమ ఘర్షణ జరిగింది. బాలాజీ నాయుడి ఫిర్యాదుతో ఎస్ఐ మురళీమోహన్ బాబునాయుడు, పోటుకనుమ దళితవాడకు చెందిన భాస్కర్‌పై కేసు నమోదు చేశారు. గురువారం వీరిద్దరు మూడవ కోర్టులో లొంగిపోగా, జడ్జి పూచీకత్తుపై బెయిలు మంజూరు చేశారు.

ఇంటర్వ్యూలకు 440 మంది హాజరు

పాకాల: ఎస్సీ, బీసీ, మైనార్టీ, కాపు కార్పొరేషన్ల సబ్సిడీ రుణాల మంజూరుకు గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలను నిర్వహించారు. మొత్తం 440 మంది అభ్యర్థులు హాజరు కాగా, వీరిలో ఎస్సీలు 136 మంది, ఎస్టీలు ఏడుగురు, బీసీలు 139 మంది, మైనార్టీలు 78మంది, కాపులు 80 మంది ఉన్నట్లు ఎంపీడీవో అమరనాథ్ పేర్కొన్నారు.

త్వరలో వంద అడుగుల రోడ్డు నిర్మాణం: ఆర్డీవో



రోడ్డు స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో

ఐరాల(కాణిపాకం): వరసిద్ధుడి ఆలయ సమీపంలో త్వరలో వంద అడుగుల రోడ్డు నిర్మించనున్నట్లు ఆర్డీవో కోదండరామిరెడ్డి తెలిపారు. కాణిపాకం బస్టాండ్ నుంచి ప్రధాన రహదారి వరకు వెళ్లే ఈ రోడ్డును గురువారం ఆర్డీవో పరిశీలించారు. కాగా, రోడ్డు ఏర్పాటయ్యే మార్గంలో ఓ ఇల్లు తొలగించడంపై సంబంధిత యజమాని కోర్టును ఆశ్రయించారు. పనులు ఆగడంపై స్పందించిన కలెక్టర్ ఆ ఇంటిని తొలగించి రోడ్డు నిర్మించాలని ఆదేశించారు. దీంతో ఆర్డీవో ఇల్లు తదితర ప్రాంతాలను పరిశీలించి, త్వరలో రోడ్డు నిర్మాణం చేపట్టనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రసాద్‌బాబు, ఈవో పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన వైద్య సేవలు

ఐరాల: మండలంలోని నాంపల్లె సబ్‌సెంటర్ హెల్త్‌వెల్ సెంటర్‌గా ఎంపికైనట్లు ఏపీవీవీపీ అదనపు జాయింట్ కమిషనర్ విజయలక్ష్మి తెలిపారు. శుక్రవారం నాంపల్లె సబ్‌సెంటర్‌ను సందర్శించిన ఆమె మాట్లాడుతూ హెల్త్‌వెల్‌సెంటర్ ద్వారా పేదలకు మెరుగైన వైద్యసేవలు అందుతాయని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ లీల, వైద్య సిబ్బంది ఈశ్వరయ్య, శాంతకుమారి, షమీం, అనురాధ, శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అందని సంక్షేమ పథకాలు: వైసీపీ

పూతలపట్టు: పలువురు ఎమ్మెల్యేలు డబ్బుకు అమ్ముడుపోయి టీడీపీలో చేరారని పూతలపట్టు ఎమ్మెల్యే సునీల్‌కుమార్, జీడీనెల్లూరు ఎమ్మెల్యే నారాయణస్వామి ఆరోపించారు. మండలంలోని చిటిపిరాళ్ల పంచాయతీ నాదంపల్లెలో ప్రవాస భారతీయుడు సుధాకర్‌రెడ్డి, ప్రేమ్‌కుమార్‌రెడ్డి విరాళంతో మినరల్ వాటర్‌ప్లాంట్ నిర్మించారు. దీనిని గురువారం ఎమ్మెల్యేలు ప్రారంభించి మాట్లాడుతూ.. సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపికలో జన్మభూమి కమిటీలు కీలకపాత్ర వహిస్తున్నాయని చెప్పారు. అయితే అర్హులైన పేదలకు సంక్షేమ పథకాల లబ్ధి అందడం లేదన్నారు. కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సుబ్బారెడ్డి, నాయకులు జయచంద్రారెడ్డి, రాజారత్నంరెడ్డి, టి.బాబురెడ్డి, పార్థసారథిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇల్లు కూల్చిన దోషులపై చర్యలు తీసుకోండి

తిరుపతి(తిలక్ రోడ్): ఏళ్లకిందట నిర్మించిన ఇంటిని కూల్చి, ఆ స్థలం తమదంటూ పలువురు దౌర్జన్యం చేస్తున్నట్లు పెనుమూరు మణియానంపల్లెకు చెందిన బాలయ్య కోరారు. గురువారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ.. 1997లో ప్రభుత్వం తనకు 3 సెంట్ల స్థలం మంజూరు చేసిందని చెప్పారు. ఇందులో ఇల్లు కట్టుకోగా, ఇటీవల గ్రామానికి చెందిన అగ్రకులస్తులు ఇంటిని కూల్చారని చెప్పారు. తహసీల్దార్, పోలీసుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని కోరినా చర్యలు లేవని వాపోయారు. అఖిలభారత దోబీ మహాసమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణయ్య మాట్లాడుతూ ఉన్నతాధికారులు సమస్యను పరిష్కరించకుంటే చలో పెనుమూరు నిర్వహిస్తామన్నారు. సమావేశంలో రవి, నాగరాజు, ప్రకాష్, సుబ్రహ్మణ్యం, మురళి, హరిప్రసాద్, విజయ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రాధాకృష్ణుల కల్యాణం

పెనుమూరు: మండలంలోని కేసీపల్లెలో వెలసిన రాధాకృష్ణుల ఆలయంలో గురువారం కళ్యాణోత్సవం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం అర్చకులు ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించారు. అనంతరం వేదపండితులు స్వామి, అమ్మవార్లను సుందరంగా ముస్తాబు చేసి ఘనంగా కల్యాణోత్సవం జరిపించారు.

సబ్సిడీ రుణాలకు ఇంటర్వ్యూలు



యాదమరిలో ఇంటర్వ్యూలు

యాదమరి: పలు కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీ రుణాల మంజూరుకు మండలపరిధిలోని పలువురు నిరుద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ఇంటర్వ్యూలకు 405 మంది హాజరైనట్లు ఎంపీడీవో పారిజాతం తెలిపారు. కార్యక్రమంలో ఎంపిక కమిటీ మెంబర్లు, బ్యాంకు మేనేజర్లు పాల్గొన్నారు.

తవణంపల్లెలో: సబ్సిడీ రుణాల మంజూరుకు సంబంధించి స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. మండలవ్యాప్తంగా 979 మంది దరఖాస్తు చేసుకోగా, 219 మంది హాజరైనట్లు ఎంపీడీవో రవికుమార్ తెలిపారు. ఇందులో ఎస్సీలు-133, బీసీలు-55, ఎస్టీలు-6, మైనార్టీలు-3, కాపు కులస్థులు 22 మంది ఉన్నట్లు వివరించారు.

సినిమా గైడ్

చిత్తూరు

రాఘవ	లై
దేవి	వివేగం(త)
గురునాథ	పిడా
ఎంఎస్ఆర్	జయ జానకి నాయక
విజయలక్ష్మి	నేనేరాజు నేనే మంత్రి
చాణక్య	ఆనందోబ్రహ్మ
వెంకటేశ్వర	పొదువాగ ఎన్ మనసు తంగం
ఆనంద్	విరసల్(త)

జిప్సంతో వేరుశనగ అధిక దిగుబడులు



కుక్కలపల్లెలో జేడీ పర్యటన

యాదమరి: జిప్సం వినియోగంతో వేరుశనగలో అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకులు విజయకుమార్ అన్నారు. గురువారం మండల పరిధిలోని కుక్కలపల్లెలోని చంద్రన్న రైతు క్షేత్రాన్ని ఆయన సందర్శించారు. కార్యక్రమంలో ఏడీ రమేష్‌బాబు, ఏవో వాణి, ఏఈవో మోహన్, ఎంపీఈవో హసేన్‌బీ పాల్గొన్నారు.

తవణంపల్లెలో: వేరుశనగ సాగులో జిప్సం వినియోగిస్తే అధిక దిగుబడులు పొందవచ్చని వ్యవసాయశాఖ జేడీ విజయకుమార్ తెలిపారు. గురువారం మండలంలోని పలుగ్రామాల్లో సాగవుతున్న వేరుశనగ పంటను ఆయన పరిశీలించారు. జిల్లాలో 1.10 లక్షల హెక్టార్లలో వేరుశనగ సాగయిందని చెప్పారు. కార్యక్రమంలో ఏడీఏ రమేష్‌బాబు, ఏవో రజనీకుమారి, ఏఈవో రాజేష్, ఎంపీఈవోలు దీపిక, పుష్పాంజలి పాల్గొన్నారు.

అమిత్‌షా సభను విజయవంతం చేయండి

గంగాధరనెల్లూరు: విజయవాడలో శనివారం జరిగే బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షుడు సుధాకర్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ చల్లయ్య, జిల్లా కార్యదర్శి అరుణమ్మ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక విలేఖరుల సమావేశంలో నాయకులు మాట్లాడుతూ.. ప్రతిపక్ష నేతలు ఎన్ని కుతంత్రాలు చేసినా బీజేపీ అభివృద్ధి ముందు ఫలించవన్నారు. ప్రధానమంత్రి మోదీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే వచ్చే ఎన్నికల్లో ఓట్లు తెస్తాయన్నారు. సమావేశంలో బీజేపీ నాయకులు మణివర్మ, సుందర్‌రాజన్, నారాయణమూర్తి, పాల్‌రాజ్, అంజలి, మురళి తదితరులు పాల్గొన్నారు.


డీఎస్పీని సన్మానిస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ

ఎస్పీ డీఎస్పీ రామ్‌కుమార్‌కు సన్మానం

చిత్తూరు అర్బన్: గతవారం అమెరికాలోని లాస్ ఏంజిల్స్‌లో వర్ల్డ్ పోలీస్ అండ్ ఫైర్ టెన్నిస్ డబుల్స్ పోటీలు నిర్వహించిన విషయం విదితమే. ఇందులో దేశం తరపున పాల్గొన్న ఎస్పీ డీఎస్పీ రామ్‌కుమార్ స్వర్ణపతకం సాధించారు. దీంతో గురువారం ఎమ్మెల్యే డీఏ సత్యప్రభ డీఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రామ్‌కుమార్ మరిన్ని పతకాలు సాధించి దేశానికి మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు.

కిటకిటలాడిన నగర వీధులు

చిత్తూరు కల్చరల్: వినాయక చవితి పండుగను పురస్కరించుకుని గురువారం నగర వీధులు కిటకిటలాడాయి. శుక్రవారం జరిగే పండుగ వస్తువుల కొనుగోళ్లలో జనం మునిగారు. దీంతో చర్చివీధి, డీఐరోడ్డు తదితర ప్రాంతాల్లోని దుకాణాలు రద్దీతో నిండాయి. పూజాసామాగ్రి ధరలు ఆకాశాన్నంటుతున్నా పండుగ కావడంతో కొనుగోలు చేశారు. కాగా, పర్యావరణ ప్రేమికులు, స్వచ్ఛంద సంస్థలు, అధికారులు మట్టి విగ్రహాలను పూజించాలని పెద్దఎత్తున ప్రచారం నిర్వహించారు. దీంతో ఎక్కడ చూసినా మట్టి వినాయకుల విగ్రహాల విక్రయాలు కన్పించాయి. నేచర్ లవర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.25కే విక్రయించారు. దీంతో వీటి కొనుగోళ్లకు జనం ఎగబడ్డారు. శనివారం కూడా విక్రయాలు కొనసాగుతాయని నిర్వాహకులు ప్రకటించారు. గణనాథుడి విగ్రహాల ఏర్పాటుకు వాడవాడలా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇప్పటికే అధికశాతం డివిజన్లలో విగ్రహాలను సిద్ధం చేసి విద్యుత్ దీపాలంకరణతో పందిళ్లను ముస్తాబు చేశారు. కాగా, డీఐరోడ్డులో విభిన్నంగా విగ్రహాన్ని ప్రతిష్టిస్తున్నారు.


కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న చర్చివీధి


విగ్రహాల విక్రయాలు

నేడు రైతుబజార్‌లో రాయితీ ఉల్లి పంపిణీ

చిత్తూరు లీగల్: నగర రైతుబజార్‌లో శుక్రవారం నుంచి తక్కువ ధరతో ఉల్లి పంపిణీ చేయనున్నట్లు మార్కెటింగ్ శాఖ ఇన్‌ఛార్జి ఏడీ ఇందుమతి, సీనియర్ అసిస్టెంట్ విశ్వేశ్వర్లు తెలిపారు. కర్నూలు మార్కెట్‌యార్డు నుంచి 15 టన్నుల ఉల్లి వచ్చిందనీ, దీంతో శుక్రవారం నుంచి కిలో రూ.23 వంతున ఉల్లి పంపిణీ చేస్తున్నామని చెప్పారు.

28న స్టాఫ్‌నర్స్ పోస్టుల ఎంపికకు జాబ్‌మేళా

చిత్తూరు రూరల్: కాల్‌హెల్త్ సంస్థలో స్టాఫ్‌నర్సుల ఎంపికకు సంబంధించి ఈనెల 28న జిల్లా ఉపాధి కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి రమేష్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 20-28 ఏళ్లలోపుండి బీఎస్సీ నర్సింగ్ పాసైన అభ్యర్థులు అర్హులన్నారు. అనుభవమున్న వారికి ప్రాధాన్యత ఉంటుందనీ, ఎంపికైన స్టాఫ్‌నర్సులకు నెలకు రూ.10వేల నుంచి రూ.25వేల జీతం ఇస్తామని చెప్పారు.

విజ్ఞానశాస్త్రంపై విద్యార్థుల్లో మక్కువ పెంచడానికే సదస్సులు

శాస్త్రవేత్త ఆర్‌ఆర్‌రావు

చిత్తూరు సిటీ: విద్యార్థుల్లో విజ్ఞానశాస్త్రంపై మక్కువ పెంచడానికే వర్క్‌షాపులను నిర్వహిస్తున్నట్లు ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ శాస్త్రవేత్త ఆర్‌ఆర్‌రావు పేర్కొన్నారు. గురువారం స్థానిక పీవీకేఎన్ డిగ్రీ కళాశాలలో జీవవైవిధ్య పరిరక్షణ అన్న అంశంపై జాతీయస్థాయి వర్క్‌షాపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ... విద్యార్థులను భావిశాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దడంలో సదస్సులు ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు. వీటి ద్వారా విద్యార్థులు తమ మేధోసంపత్తిని మరింత పెంచుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆనందరెడ్డి మాట్లాడుతూ భవిష్యత్తు తరాలను దృష్టిలో ఉంచుకుని జీవవైవిధ్య పరిరక్షణకు ప్రతిఒక్కరు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు శివన్న, యశోదమ్మ, వర్క్‌షాపు సమన్వయకర్త మీరాసాహెబ్, అధ్యాపకులు మోహన్‌బెహరా, మహ్మద్‌బక్ష్, సుజన, హేమలత, శశికళ తదితరులు పాల్గొన్నారు.


సదస్సును ప్రారంభిస్తున్న ఆర్‌ఆర్‌రావు

30 మంది మందుబాబులకు రూ.2వేల వంతున జరిమానా

చిత్తూరు లీగల్: మద్యం మత్తులో వాహనాలు నడిపిన మందుబాబులకు మూడవ కోర్టు జడ్జి శైలజ జరిమానా విధించారు. రెండ్రోజుల కిందట నగరంలో నగర ట్రాఫిక్ పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఇందులో భాగంగా మద్యం మత్తులో వాహనాలు నడుపుతున్న 30 మందిని అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. నిందితులను గురువారం కోర్టులో హాజరు పరచగా జడ్జి ఒక్కొక్కరికి రూ.రెండు వేల వంతున జరిమానా విధించారు.

చెక్‌పోస్టులు లేకున్నా వాహనాల తనిఖీ: ఓంకార్‌రెడ్డి

చిత్తూరు లీగల్: వాణిజ్య పన్నుల శాఖ ఆధ్వర్యంలో చెక్‌పోస్టులు లేకున్నా వాహనాల తనిఖీలు యథావిధిగా జరుగుతుందని జాయింట్ కమిషనర్ ఓంకార్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన నగరంలోని తన ఛాంబర్‌లో మాట్లాడుతూ.. జీఎస్‌టీ అమల్లోకి వచ్చిన వెంటనే వాణిజ్య చెక్‌పోస్టులను తొలగించినట్లు చెప్పారు. ఇప్పటి వరకు జిల్లాలో 20వేల మంది వ్యాపారులు జీఎస్టీ సభ్యత్వం తీసుకున్నారని చెప్పారు. కొనుగోలుదారులు జీఎస్‌టీ బిల్లులపై సంబంధిత రికార్డులు చూపమని కోరవచ్చన్నారు. పలువురు జీఎస్టీ పేరిట భారం మోపుతున్నట్లు గుర్తించామన్నారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేకే వైసీపీ దుష్ప్రచారం: టీడీపీ

చిత్తూరు కల్చరల్: మండలాభివృద్ధిని చూసి ఓర్వలేకనే టీడీపీపై వైసీపీ నేతలు దుష్ప్రచారం చేస్తున్నారని పార్టీ మండల అధ్యక్షుడు శశికర్‌బాబు విమర్శించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. కుర్చివేడు టీడీపీ కార్యకర్తలు వైసీపీలో చేరారన్న ప్రచారం అవాస్తమని చెప్పారు. తమ పార్టీలో ఉన్న వారికే మళ్లీ కండువా కప్పడం వైసీపీ రివాజుగా మారిందన్నారు. చౌకబారు ప్రచారంమాని ప్రజా సంక్షేమాన్ని కాంక్షించే ప్రభుత్వానికి మద్దతివ్వాలని కోరారు. సమావేశంలో టీడీపీ నేత జయచంద్ర నాయుడు, సర్పంచులు మోహన్‌రాజ్, నీలకంఠం నాయుడు, తులసీపతి నాయుడు, నాయకులు కుమార్, జగన్నాథం పాల్గొన్నారు.


మాట్లాడుతున్న శశికర్‌బాబు

లక్కీ షూమార్ట్ ప్రారంభం


లక్కీ షూమార్టును ప్రారంభిస్తున్న శ్రీనివాసరావు

చిత్తూరు అర్బన్: నగర చర్చివీధిలోని జీవకారుణ్య సంఘం ఎదురుగా గురువారం లక్కీ షూమార్ట్‌ను ఆ దుకాణ అధినేత శ్రీనివాసరావు వైభవంగా ప్రారంభించారు. 25 ఏళ్ళకుపైగా పనిచేసిన అనుభవంతో ఆయన నగరంలో మొదటిసారిగా షూమార్టు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. తమ దుకాణంలో బ్రాండెడ్ తదితర ప్రముఖ కంపెనీల పాదరక్షలను విక్రయాలకు ఉంచినట్లు చెప్పారు. మహిళలు, పిల్లలకు ప్రత్యేకంగా ఫ్యాన్సీ రకాలు, స్కూల్‌బ్యాగ్‌లను సరసమైన ధరలకు విక్రయిస్తున్నామన్నారు. ఈనెల 27వతేదీ వరకు 10% డిస్కౌంట్ అందజేస్తున్నట్లు తెలిపారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు రూరల్: బి.నరసింగరాయనిపేట ప్రభుత్వ ఐటీఐలో ఖాళీగా ఉన్న సీట్లకు ఈనెల 28వతేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలి ఐటీఐ ప్రిన్సిపాల్ జి.గుణశేఖర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్ పాసైన విద్యార్థులు కంప్యూటర్ ఆపరేటర్, ప్రోగ్రామింగ్ అసిస్టెంట్ కోర్సుల్లో చేరవచ్చన్నారు. చిత్తూరు ప్రభుత్వ ఐటీఐలో ఖాళీగా ఉన్న సీట్లకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రాధాకృష్ణమూర్తి పేర్కొన్నారు. ఈనెల 30న కౌన్సెలింగ్ జరుగుతుందనీ, ఆసక్తి కలిగిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

రామాలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ

చిత్తూరు అర్బన్: నగర టావ్‌లైన్‌లోని పోలీసు క్వార్టర్స్‌లో నూతనంగా నిర్మించిన రామాలయంలో గురువారం ధ్వజస్తంభ ప్రతిష్ఠ జరిగింది. అనంతరం ఆలయంలో వేదపండితులు కుంభాభిషేకం, హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ రాజశేఖర్‌బాబు దంపతులు, డీఎస్పీలు సుబ్బారావు, దేవదాసు తదితరులు పాల్గొన్నారు.


హోమంలో పాల్గొన్న ఎస్పీ రాజశేఖర్‌బాబు దంపతులు



వినాయక చవితి శుభాకాంక్షలు



టంగ్ ట్విస్టర్స్


1. I broke a brickbat and a brickbat broke me.
2. A wooden worm wouldn't be worthy of worship but would he if he wondered and worried about what he would be worthy of if he wasn't wooden?
3. Give papa a cup of proper coffee in a copper coffee cup.
4. Forgiveness forms a firm foundation for future fortitude.

మనింట్లోనే మహా గణపతి

విఘ్నాలు తొలగించి.. విజయాలు అందిస్తాడు. గరిక సమర్పించినా, ఉండ్రాళ్లు నివేదించినా కోరిన కోరికలు తీరుస్తాడు. భక్తితో పూజించినా.. ఆర్తితో పిలిచినా ఆలకించే ఆదిదేవుడు 'వినాయకుడు'. ఆయన పుట్టినరోజు సందర్భంగా ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. మరి ఆ లంబోదరుడి విగ్రహం తయారీకి 'ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్' వాడుతున్నాం. ప్రతిమలకు కృత్రిమ రంగుల్ని ఉపయోగిస్తున్నాం. విఘ్నాలు తొలగించే దేవుణ్ణి కొలిచేందుకు ప్రకృతికి ఎన్నో విఘ్నాలు కలిగిస్తున్నాం. అందుకే మట్టి వినాయకులనే పూజిద్దాం.

మొదట్లో వినాయక చవితి ఉత్సవాలకు పూర్తిగా మట్టి విగ్రహాలనే తయారు చేసేవారు. ఆ తర్వాత 'ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్' రాకతో అందరూ ఆ విగ్రహాలనే కొనుగోలు చేయడం మొదలుపెట్టారు. విగ్రహాల తయారీకి ఉపయోగిస్తున్న 'ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్', కృత్రిమ రంగులు పర్యావరణానికి హాని చేస్తున్నాయి. అంతేకాదు వాటిని నీటిలో నిమజ్జనం చేయడంతో నీరు కలుషితమవుతోంది. ఇప్పుడిప్పుడే సమాజం 'ఎకో ఫ్రెండ్లీ' విగ్రహాల వైపు అడుగులు వేస్తోంది. ఈ మార్పును స్వాగతించి, మట్టి వినాయకులనే పూజిద్దాం.







మీకు తెలుసా?

- బ్రిటీష్ పాలకులకు వ్యతిరేకంగా ప్రజల్ని సంఘటిత పరిచేందుకు బాల గంగాధర్ తిలక్ 1893 లో వినాయక పండగను అందరూ కలిసి జరుపుకోవాలని పిలుపునిచ్చారు.
- రెండు చేతులే ఉన్న వినాయక విగ్రహం ఎక్కువగా కనిపించదు. అలాంటి విగ్రహం ఉండకూడదని భక్తుల విశ్వాసం.
- కొన్ని ప్రాంతాల్లో స్త్రీ రూపంలో ఉన్న గణపతులు కూడా ఉన్నాయి. వాటిని 'వినాయకి', 'గణేశని' అనే పేర్లతో పిలుస్తారు.
- తమిళనాడులోని నాగర్‌కోయిల్ మండలంలో ఉన్న వినాయక విగ్రహం 6 నెలలు తెల్లగా, మరో ఆరు నెలలు నల్లగా ఉంటుంది. ఇదే రాష్ట్రంలో 'తిరుచిరాపల్లి' అనే గ్రామం ఉంది. ఈ గ్రామంలో ఉన్న వినాయక ఆలయం దేశంలోనే అతి ప్రాచీనమైందిగా చెబుతారు.
- ఒక్క జపాన్‌లోనే దాదాపు 250 పైగా వినాయక ఆలయాలున్నాయి.
- ఇండోనేషియా, గ్రీస్ దేశాల కరెన్సీపై వినాయకుడి బొమ్మను ముద్రిస్తారు.
- దాదాపు ఎనిమిది దేశాలు గణపతి పోస్టల్ స్టాంపులను విడుదల చేశాయి.

మట్టి విగ్రహాన్ని మనమే చేసుకుందాం! ప్రకృతిని కాపాడుకుందాం!

కావాల్సినవి :

- ఒక కిలో బంకమట్టి (క్లే పౌడర్)
- పౌడర్‌ను ముద్దగా చేసేందుకు సరిపడేటన్ని నీళ్లు

తయారీ :

- ముందుగా బంకమట్టిలో నీళ్లు కలిపి ముద్దగా చేసుకోవాలి.
- మొదట ఉదర(పొట్ట) భాగాన్ని తయారు చేసుకునేందుకు ఒక పెద్ద ముద్దను తయారుచేసుకోవాలి.
- చేతులు, కాళ్లు, చెవులతో పాటు, ఇతర వాటి కోసం మూడు మధ్యస్థం, నాలుగు చిన్నపాటి ముద్దలు చేసుకోవాలి. వాటితో పాటే పొడవాటి ముద్దలను ఓ ఐదు తయారు చేసుకోవాలి.
- ఉదరభాగంగా తయారుచేసుకున్న మట్టి ముద్ద చుట్టూ, పొడవాటి మట్టి ముద్దను పేర్చుకుని, కాళ్ల ఆకారం వచ్చేలా తీర్చిదిద్దుకోవాలి. మరో పొడవాటి ముద్దతో పీఠం(గద్దె)లా తీర్చిదిద్దుకోవాలి.
- రెండు పొడవాటి ముద్దలతో చేతులను చేసుకోవాలి. చేతిలో లడ్డూలా కనిపించేందుక ఓ చిన్న ముద్దను పెట్టుకోవాలి.
- మధ్యస్థ పరిమాణంలో ఉన్న మట్టి ముద్దను, ఉదర పైభాగంలో నిలపాలి.
- పొడవాటి ముద్దతో తొండం తయారుచేసుకోవాలి. ఉదర పైభాగంలో నిలిపిన మట్టిముద్దతో ఈ తొండాన్ని అనుసంధానం చేయాలి. ఆ పైభాగానికే రెండు చిన్న ముద్దలను రెండు చెవులుగా పెట్టుకోవాలి. వాటిని కాస్త ఫ్లాట్‌గా చేసుకుంటే విశాలమైన చెవుల్లా కనిపిస్తాయి.
- కిరీటం కోసం మధ్యస్థ పరిమాణంలోని రెండు ముద్దలను ఉపయోగించుకోవాలి. వాటిని ఫ్లాట్‌గా తీర్చిదిద్దుకుంటూ ఒకదానిపై ఒకటి పేర్చాలి. దానిపైన ఒక చిన్నపాటి ముద్దను నిలిపితే సరి.
- జంధ్యం కోసం తాడులా ఉండే పొడవాటి మట్టి ముద్దను పేర్చుకోవాలి. కళ్లు, దంతాలు, బొట్టు కోసం ఇలానే తయారు చేసుకోవాలి.
- సహజమైన రంగులతో మరింత ఆకట్టుకునేలా వినాయకుణ్ణి తీర్చిదిద్దుకోవచ్చు.

రంగు వెయ్యండి





ఔనా!


ఒక్కో ఏనుగు దంతం దాదాపు 45 కిలోల బరువు ఉంటుంది. తొండం బరువు ఏకంగా 180 కిలోల వరకు ఉంటుంది.

మీకు తెలుసా?



పంచముఖ గణపతి ఆలయాలు అరుదుగా ఉంటాయి. బెంగుళూరుకు సమీపంలో మైసూరు రోడ్డులో ఉన్న 'మహా మేరు పంచ ముఖి' ఆలయాన్ని అందులో ఒకటిగా చెప్పుకోవచ్చు. దాన్ని 1984లో నిర్మించారు. 30 అడుగుల గణేశుడి విగ్రహాన్నే గోపురంగా మలిచి ఈ ఆలయాన్ని నిర్మించడం విశేషం.

చుక్కలు కలపండి



పీలేరులో చవితి వేడుకలకు భారీ ఏర్పాట్లు

27న నిమజ్జనోత్సవం

పీలేరు : పీలేరులో వినాయక చవితి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. దశాబ్దాలుగా ఇక్కడ సామూహిక నిమజ్జనోత్సవ ఊరేగింపు నిర్వహించి పండుగను అంగరంగ వైభవంగా జరుపుకుంటున్నారు. రాష్ట్ర విభజనకు ముందు హైదరాబాద్ తరువాత ఇక్కడ జరిగే నిమజ్జనోత్సవానికి ప్రత్యేక గుర్తింపు ఉండేది. ప్రస్తుతం రాష్ట్రం విడిపోయిన నేపథ్యంలో పీలేరులో జరిగే సామూహిక నిమజ్జనోత్సవం ప్రత్యేక ప్రాధాన్యతను సంతరించుకుంది. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఇక్కడ వందకు పైగా విగ్రహాలతో ఉదయం నుంచి రాత్రి వరకు నిమజ్జనోత్సవ ఊరేగింపు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. పట్టణంలోనే వందకుపైగా వినాయక మండపాలను ఏర్పాటు చేసి ఒకే రోజు నిమజ్జనోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. 1982లో స్థానిక గాంధీ రోడ్డులోని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం వద్ద స్థానిక ప్రముఖులు జొన్నగడ్ల నటరాజ, వేణుగోపాల్‌రెడ్డిలు తొలుత వినాయక కేంద్రాన్ని ఏర్పాటు చేసి ఈ సాంప్రదాయానికి శ్రీకారం చుట్టారు. క్రమేణా కేంద్రాల సంఖ్య పెరుగుతూ వందకుపైగా దాటింది. నిమజ్జనోత్సవం ఒక పెద్ద జాతరను తలపించే స్థాయిలో జరుగుతుంది. సాంప్రదాయ పద్ధతిలో కడప మార్గంలోని అయ్యప్పనాయునిచెరువులో విగ్రహాలు నిమజ్జనం చేయడం జరుగుతుంది. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నిమజ్జనోత్సవానికి చెరువు ప్రాంగణంలో లైటింగ్ సదుపాయం చేస్తున్నారు.



పీలేరులో కొలువుతీరేందుకు సిద్ధంగా వినాయక విగ్రహాలు

న్యాయం చేయకుంటే ఆందోళనకు సిద్ధం

● ద్రావిడ రిజిస్ట్రార్‌తో బోధనేతర సిబ్బంది

గుడుపల్లె : తమకు న్యాయం చేయకుంటే ఆందోళనకు దిగుతామని ద్రావిడ విశ్వవిద్యాలయం బోధనేతర సిబ్బంది గురువారం రిజిస్ట్రార్‌కు విన్నవించారు.చాలీచాలని జీతాలతో సంవత్సరాలుగా పనిచేస్తూ, న్యాయమైన డిమాండును అడుగుతున్నా అధికారులు నాన్చుడు ధోరణి అవలంబిస్తున్నారని వివరించారు. తమకు టైమ్స్ స్కేల్ ఇవ్వడంతో పాటు ఎన్ఎంఆర్‌లుగా పరిగణించాలని, లేకుంటే నిధులు బహిష్కరించి నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు.



రిజిస్ట్రార్‌తో మాట్లాడుతున్న బోధనేతర సిబ్బంది

రేపు తిరుమలకు నేపాల్ ప్రధాని రాక

పర్యటన ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్ష

రేణిగుంట: శ్రీవారి దర్శనార్థం నేపాల్ ప్రధాని శనివారం తిరుమలకు రానున్నారు. ఆయన పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లపై తిరుపతి విమానాశ్రయంలోని పాత టర్మినల్ భవనంలో గురువారం అధికారులతో కలెక్టర్ ప్రద్యుమ్న సమీక్షించారు. శనివారం హైదరాబాదు నుంచి ప్రత్యేక విమానంలో బయల్దేరి ఉదయం 11 గంటలకు తిరుపతి విమానాశ్రయం చేరుకుంటారన్నారు. ఆ తర్వాత ఆయన రోడ్డుమార్గాన శ్రీవారి దర్శనార్థం తిరుమల బయల్దేరుతారన్నారు. అన్నిశాఖల అధికారులు పారదర్శకంగా విధులు నిర్వహించాలన్నారు. విమానాశ్రయం నుంచి తిరుమలకొండ వరకు భద్రతా చర్యలపై అర్బన్ ఎస్పీ అభిషేక్ మహంతితో చర్చించారు. కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో సబ్‌కలెక్టర్ నిషాంత్‌కుమార్, ఇంటెలిజెన్స్ అధికారి అమితారాయ్, అధికారులు గంగరాజు, నందకుమార్, రాజ్‌రామ్, డీఎస్పీ నంజుండప్ప, సాయిగిరిధర్, ఇన్‌చార్జ్ మున్సిపల్ కమిషనర్ శ్రీదేవి, కనకజాక్షి పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ప్రద్యుమ్న

జిల్లావ్యాప్తంగా మోస్తరు వర్షం

చిత్తూరు కలెక్టరేట్: జిల్లావ్యాప్తంగా గడిచిన 24 గంటల్లో సాధారణం నుంచి భారీ వర్షాలు కురిశాయి. పెద్దమండ్యంలో 50.2 మి.మీ., తంబళ్ళపల్లెలో 23.2, ములకలచెరువులో 9.8, పీటీఎంలో 7.4, బి.కొత్తకోటలో 15.8, కురబలకోటలో 28.4, గుర్రంకొండలో 16.2, కలకడలో 33.4, కేవీపల్లెలో 22.2, ఎర్రావారిపాళెంలో 107.8, తిరుపతి అర్బన్‌లో 67.4, రేణిగుంటలో 43.6, ఏర్పేడులో 17.4, శ్రీకాళహస్తిలో 7.6, తొట్టంబేడులో 7, బీఎన్ కండ్రిగలో 18.6, వరదయ్యపాళెంలో 32.6, సత్యవేడులో 3, నాగలాపురంలో 7.2, పిచ్చాటూరులో 17.2, విజయపురంలో 5.8, నింద్రలో 15.2, కేవీబీపురంలో 22.2, నారాయణవనంలో 13.2, వడమాలపేటలో 24.2, తిరుపతి రూరల్‌లో 30.2, రామచంద్రాపురంలో 46.2, చంద్రగిరిలో 89.6, చిన్నగొట్టిగల్లులో 103.6, రొంపిచెర్లలో 42.6, పీలేరులో 39.2, కలికిరిలో 45.4, వాల్మీకిపురంలో 42.2, నిమ్మనపల్లెలో 26.4, మదనపల్లెలో 53.4, రామసముద్రంలో 31, పుంగనూరులో 15, చౌడేపల్లెలో 28.2, సోమలలో 69.6, సదుంలో 34.2, పులిచెర్లలో 51.2, పాకాలలో 51.2, వెదురుకుప్పంలో 21.6, పుత్తూరులో 12.6, నగరిలో 27.8, కార్వేటినగరంలో 50, శ్రీరంగరాజపురంలో 52.8, పాలసముద్రంలో 20.6, గంగాధరనెల్లూరులో 13.8, పెనుమూరులో 32.4, పూతలపట్టులో 35.4, ఐరాలలో 25.6, తవణంపల్లెలో 23.6, చిత్తూరులో 49.2, గుడిపాలలో 42.2, యాదమరిలో 11.6, బంగారుపాళ్యంలో 39.2, పలమనేరులో 50.4, గంగవరంలో 32.2, పెద్దపంజాణిలో 30.4, బైరెడ్డిపల్లెలో 17.2, వి.కోటలో 9, రామకుప్పంలో 9.4, శాంతిపురంలో 39.6, గుడుపల్లెలో 3.4, కుప్పంలో 3.42 మి.మీ. వర్షపాతం నమోదైంది.

కవి మండెం శివరామాచారి మృతి



పలమనేరు : కవి మండెం శివరామాచారి (76) అనారోగ్యంతో గురువారం తుది శ్వాస విడిచారు.కలకడ మండలం నడిమిచెర్లకు చెందిన శివరామాచారి పలమనేరు పట్టణంలో స్థిరపడ్డారు.బసవన్నగుడి వీధిలో నివాసముంటున్న ఆయన 1988లో ఆదర్శ ఉపాధ్యాయుడిగా,1997లో ఆదర్శ ప్రధానోపాధ్యాయుడిగా సన్మానమందుకున్నారు. అభినయ గీతాలు, బాల గీతికలు, సత్యసూక్తి, లోకలీల ఖండకావ్యం, సత్యసూక్తి నీతిశతకం, శ్రీ వెంకటేశ్వర శతకం, శ్రీ చైతన్యవాణి శతకం, శ్రీ సుదతీ సందేశం, కాలజ్ఞాన శతకం, విశ్వకర్మ గ్రంథం, తెలుగు వెలుగు -1,2,అమ్మ లఘు కావ్యం, దళిత శతకం, షిరిడి బాబా శతనామావళి గ్రంథం, మత్కాంక్ష, జాతినీతి శతకం, వేగుచుక్క పదకవితలు తదితర రచనలతో సాహితీ ప్రముఖుడిగా మండెం శివరామాచారి గుర్తింపుపొందారు.


మొక్కలు నాటే విద్యార్థులకు

ఉచిత వైద్యసేవలు

చిత్తూరు క్రైం : ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో మొక్కలు నాటే విద్యార్థులకు ఉచిత వైద్యసేవలు అందించనున్నట్లు జిల్లా సామాజిక వనవిభాగం డీఎఫ్‌వో శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే విద్యార్థులకు తిరుపతిలోని నారాయణాద్రి ఆస్పత్రిలో ఉచితంగా కంటి, దంత వైద్య పరీక్షలు చేయిస్తామని చెప్పారు. ఐదు మొక్కలకు పైగా నాటే విద్యార్థుల తల్లిదండ్రులకు ఉచిత గుండె పరీక్షలు చేయిస్తామని వివరించారు. అవకాశాన్ని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



వరసిద్ధుడి బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం


కాణిపాకంలో ఆకట్టుకుంటున్న విద్యుత్ ప్రతిమలు

నేటినుంచి 14వతేదీ వరకు ఉత్సవాలు



ముస్తాబైన అలంకార మండపం

ఐరాల(కాణిపాకం): వరసిద్ధుడి బ్రహ్మోత్సవాలకు కాణిపాకం సుందరంగా ముస్తాబైంది. శుక్రవారం నుంచి ప్రారంభమై వచ్చేనెల 14వతేదీ వరకు జరిగే ఉత్సవాలకు అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. లక్ష మంది భక్తులు తరలి రానున్నడంతో, 1.50 లక్షల లడ్డూలు, 10 వేల వడలను సిద్ధం చేశారు. ఉత్సవాలు జరిగే 21 రోజుల పాటు ప్రధాన ఆలయంలో నిర్వహించే అన్ని ఆర్జిత సేవలను పూర్తిగా రద్దు చేశారు. కాగా, శుక్రవారం చవితి రోజున మూలవిరాట్‌కు ఉభయదారుడు గాలి మునస్వామి నాయుడు ఆధ్వర్యంలో అభిషేకం నిర్వహించి, తెల్లవారుజామున 3 గంటల నుంచి భక్తులకు స్వామి దర్శనం కల్పించనున్నారు. రద్దీని దృష్టిలో ఉంచుకుని ఉచితం, రూ.10, రూ.51, రూ.100 క్యూలైన్లను ప్రత్యేకంగా సిద్ధం చేశారు. ఉత్సవాలకు ప్రధాన, అనుబంధ ఆలయాలు రంగవల్లులు, విద్యుత్ దీపాలంకరణతో సుందరంగా ముస్తాబయ్యాయి. ఆలయ పరిసర ప్రాంతాల్లో విభిన్న రూపాల్లో ఏర్పాటు చేసిన దేవతామూర్తుల ఆర్చిలు ఆకట్టుకుంటున్నాయి. తిరుపతి నుంచి చిత్తూరు వరకు 23 స్వాగత ఆర్చిలు, ప్రత్యేకంగా అగరంపల్లె వద్ద 40 అడుగుల ఎత్తున్న తంజావూరు ఆర్చిని ఏర్పాటు చేశారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు యంత్రాంగం 300 మందితో ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేసింది. చిత్తూరు, తిరుపతి నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడుపుతోంది. భక్తుల కాలక్షేపం కోసం ఆలయాధికారులు ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఇందుకు అనుగుణంగా ఆలయ ఆస్థాన మండపాన్ని సుందరంగా తీర్చిదిద్దారు.

నేటినుంచి బ్రహ్మోత్సవాలు మొదలు

కాణిపాక వినాయకస్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభమై వచ్చేనెల 14వతేదీతో ముగియనున్నాయి. కాగా, శుక్రవారం వినాయక చవితి ఉత్సవాలు, 26న ధ్వజారోహణం, రాత్రి హంస వాహనసేవ, 27న నెమలి వాహనసేవ, 28న మూషిక వాహనసేవ, 29న శేష వాహనసేవ, 30న వృషభ వాహనసేవ, 31న గజ వాహన సేవ, సెప్టెంబర్ 1న రథోత్సవం, 2న తిరుకల్యాణం, అశ్వ వాహనసేవ, 3న ధ్వజావరోహణం, వడాయత్తు ఉత్సవం, ఏకాంతసేవతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి. ప్రత్యేక ఉత్సవాలలో భాగంగా 4న అధికార నంది వాహనసేవ, 5న రావణబ్రహ్మ వాహనసేవ, 6న యాళి వాహనసేవ, 7న సూర్యప్రభ వాహనసేవ, 8న చంద్రప్రభ వాహనసేవ, 9న పుష్పపల్లకి, 10న విమానోత్సవం, 11న కల్పవృక్ష వాహన సేవ, 12న కామధేను వాహనసేవ, 13న పూలంగిసేవ, 14న తెప్పోత్సవంతో ప్రత్యేక ఉత్సవాలు ముగుస్తాయి.







అధికారులూ...కాంట్రాక్టు కార్మికులకు జీతాలివ్వండి

చిత్తూరు అర్బన్: ఆరునెలలుగా జీతాలు లేక ఇబ్బందులు పడుతున్న కాంట్రాక్టు కార్మికులకు అధికారులు న్యాయం చేయాలని ఏఐటీయూసీ నేత నాగరాజన్ కోరారు. వేతన బకాయిలు మంజూరు చేయాలని కోరుతూ గురువారం ఏపీ మెడికల్ ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ సిబ్బంది ఆధ్వర్యంలో గాంధీ విగ్రహం వద్ద ధర్నా జరిగింది.గోపీనాథ్, మణి, బాలాజీరావు, గజేంద్ర బాబు, మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ నేతలు రాజారాం, రవిరెడ్డి, మూర్తి, మోహన, కృష్ణవేణి, అలివేలు, సుందరరాజు, విక్టోరియా, నిర్మల పాల్గొన్నారు.







దేశ విభజనతో ఎక్కువగా నష్టపోయిన పరిశ్రమ?

భారతదేశ పరిశ్రమలు

1. కింది వాటిలో భారీ పరిశ్రమ కానిది?
ఎ) వస్త్ర పరిశ్రమ బి) ఉక్కు పరిశ్రమ
సి) జౌళి పరిశ్రమ డి) గ్రామీణ ఖాదీ పరిశ్రమ

2. భారతదేశం ఏ సంవత్సరంలో ప్రపంచంలో ఏడో అతిపెద్ద వాహనాల తయారీ దేశంగా ప్రకటితమైంది?
ఎ) 2007 బి) 2008 సి) 2009 డి) 2010

3. దేశంలో తొలి ఆధునిక పేపర్ మిల్లును ఎప్పుడు స్థాపించారు?
ఎ) 1827 బి) 1832 సి) 1846 డి) 1854

4. కింది రాష్ట్రాల్లో చెరకు ఉత్పత్తిలో ఎక్కువ పేరుగాంచని రాష్ట్రం?
ఎ) ఉత్తరప్రదేశ్ బి) ఆంధ్రప్రదేశ్
సి) మధ్యప్రదేశ్ డి) మహారాష్ట్ర

5. ప్రపంచంలో 'స్పాంజ్ ఐరన్'ని అత్యధికంగా తయారు చేసే దేశం?
ఎ) అల్జీరియా బి) భారత్
సి) ఇరాన్ డి) సౌదీఅరేబియా

6. హెచ్ఎంటి సంస్థను ఎప్పుడు ప్రారంభించారు?
ఎ) 1953 బి) 1957 సి) 1966 డి) 1958

7. భారత్‌లో అతి పెద్ద నౌకల తయారీ కేంద్రం?
ఎ) కొచ్చిన్ షిప్‌యార్డ్ బి) హిందుస్థాన్ షిప్‌యార్డ్
సి) గోవా షిప్‌యార్డ్ డి) గార్డెన్ రీచ్ షిప్‌యార్డ్

8. సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలను ప్రోత్సహించడానికి ప్రత్యేక ప్యాకేజీని ఎప్పుడు ప్రకటించారు?
ఎ) 2005 ఆగస్టు బి) 2007 ఫిబ్రవరి
సి) 2009 మార్చి డి) 2010 నవంబరు

9. బాంబేలో వస్త్ర పరిశ్రమను ఎప్పుడు నెలకొల్పారు?
ఎ) 1854 బి) 1855 సి) 1948 డి) 1956

10. భారత్‌లో మొదటి పారిశ్రామిక విధానాన్ని ఎప్పుడు ప్రవేశపెట్టారు?
ఎ) 1855 బి) 1948 సి) 1956 డి) 1961

11. 2010-11 లెక్కల ప్రకారం భారత్‌లో ఏ రాష్ట్రం కాటన్ మిల్ వస్త్ర తయారీలో అగ్రస్థానంలో ఉంది?
ఎ) గుజరాత్ బి) మహారాష్ట్ర
సి) పంజాబ్ డి) తమిళనాడు

12. కింది వాటిలో 'మాంచెస్టర్ ఆఫ్ ఉత్తరప్రదేశ్' అని దేన్ని పిలుస్తారు?
ఎ) ఆగ్రా బి) అలహాబాద్
సి) కాన్పూర్ డి) లక్నో



సందీప్ కంభంపాటి
సీనియర్ ఫ్యాకల్టీ

13. 'మాంచెస్టర్ ఆఫ్ సౌత్ ఇండియా'గా పేరుగాంచింది?
ఎ) మధురై బి) కోయంబత్తూర్
సి) ఈ-రోడ్ డి) సేలం

14. ఏ రాష్ట్రంలో అత్యధికంగా యంత్ర మగ్గాలు ఉన్నాయి?
ఎ) గుజరాత్ బి) మధ్యప్రదేశ్
సి) మహారాష్ట్ర డి) తమిళనాడు

15. కింది వాటిలో ఏ పట్టు వెరైటీ భారత్‌లో అధికంగా ఉత్పత్తి అవుతుంది?
ఎ) ఏరీ బి) మల్బరీ సి) ముడిపట్టు డి) టస్సర్

16. భారత్‌లో మొదటి ఆధునిక ఇనుము - ఉక్కు కర్మాగారాన్ని ఎప్పుడు స్థాపించారు?
ఎ) 1830 బి) 1907 సి) 1919 డి) 1923

17. టాటా ఉక్కు పరిశ్రమను ఎప్పుడు స్థాపించారు?
ఎ) 1919 బి) 1907 సి) 1923 డి) 1973

18. భారతదేశంలోని ఏ పరిశ్రమలో ఎక్కువ మంది మహిళలు ఉపాధి పొందుతున్నారు?
ఎ) జనుము బి) వస్త్ర సి) బొగ్గు డి) తేయాకు

19. కింది వాటిలో ఏ సంస్థకు ఒక పరిశ్రమను ఖాయిలాపడిన పరిశ్రమగా ప్రకటించే అధికారం ఉంది?
ఎ) IRBI బి) MRTPC సి) BIFR డి) పైవన్నీ

20. బొకారొ ఉక్కు పరిశ్రమను ఏ దేశ సహకారంతో నెలకొల్పారు?
ఎ) చైనా బి) అమెరికా సి) జర్మనీ డి) రష్యా

21. వస్త్ర పరిశ్రమ తరవాత భారత్‌లో అతి ముఖ్యమైన పరిశ్రమ?
ఎ) జనుము బి) ఇనుము - ఉక్కు
సి) బొగ్గు డి) తేయాకు

22. భారత్‌లోని ఏ పరిశ్రమ ఎక్కువ ఉద్యోగ అవకాశాలను కల్పిస్తుంది?
ఎ) వస్త్ర బి) వాహన
సి) ఉక్కు - ఇనుము డి) తేయాకు

23. భారతదేశ విభజనతో ఎక్కువగా నష్టపోయిన పరిశ్రమ ఏది?
ఎ) జనుము, సిమెంట్ బి) పత్తి, చెరుకు
సి) పేపర్, ఉక్కు డి) జనుము, వస్త్ర

24. వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు అధికంగా ఉన్న రాష్ట్రం?
ఎ) పశ్చిమ బెంగాల్ బి) గుజరాత్
సి) పంజాబ్ డి) అసోం

25. భారత్‌లో అతి ముఖ్యమైన చిన్నతరహా పరిశ్రమ?
ఎ) జనుము బి) వస్త్ర సి) చేనేత డి) ఏదీకాదు

26. భారత్‌లోని వస్త్రాన్ని ఎక్కువగా దిగుమతి చేసుకొనే దేశం?
ఎ) ఇటలీ బి) రష్యా సి) జర్మనీ డి) అమెరికా

27. కింది వాటిలో ఏ వస్తువు ఎగుమతి వల్ల భారత్‌కు అత్యధిక విదేశీ మారకద్రవ్యం లభిస్తుంది?
ఎ) తేయాకు బి) జనుము సి) పత్తి డి) వస్త్ర

జనరల్ స్టడీస్ - ఇండియన్ ఎకానమీ

28. కింది వాటిలో మాషెల్కర్ కమిటీ దేనికి సంబంధించి సూచనలు చేసింది?
ఎ) నల్లధనం బి) ఆర్థిక విధానం
సి) వాహన ఇంధన ధరల విధానం
డి) రాజ్యాంగంలో మార్పులు

29. తృతీయ రంగం నిర్వచనంలో కింది వాటిలో దేన్ని కలపలేదు?
ఎ) వాణిజ్యం బి) విద్యుత్తు
సి) రవాణా డి) వాణిజ్య సేవలు

30. కోర్ పరిశ్రమలన్నింటిలోకి అత్యుత్తమ పనితీరు కనబరిచిన పరిశ్రమ?
ఎ) వాహన రంగం బి) పెట్రోలియం
సి) గనుల రంగం డి) సిమెంట్

31. కింది ప్రదేశాల్లో ఏది వజ్రాల కటింగ్, పాలిషింగ్‌కి ప్రఖ్యాతిగాంచింది?
ఎ) బెంగళూరు బి) సేలం సి) సూరత్ డి) కుల్టి

32. భారత్‌లో టెలిఫోన్ కేబుల్స్ తయారీకి పేరుగాంచిన ప్రదేశం?
ఎ) పింప్రి బి) భోపాల్
సి) కపుర్తలా డి) రూప్‌నారాయణ్‌పూర్

33. కింది ప్రదేశాల్లో ఎక్కడ రైల్‌కోచ్ ఫ్యాక్టరీ ఉంది?
ఎ) భోపాల్ బి) వారణాసి
సి) కపుర్తలా డి) చిత్తరంజన్



34. పశ్చిమ బెంగాల్‌లోని టిటాఘడ్ దేనికి ప్రసిద్ధి?
ఎ) వస్త్ర పరిశ్రమ బి) ఎరువుల పరిశ్రమ
సి) పేపర్ పరిశ్రమ
డి) రైల్ ఇంజన్ల తయారీ పరిశ్రమ

35. భారత్‌లోని మొదటి ఎరువుల కర్మాగారాన్ని ఎక్కడ స్థాపించారు?
ఎ) నీంగల్ బి) ట్రాంబె సి) సింద్రి డి) అల్వాయ్

36. బిహార్‌లోని 'గోమియా' ప్రాంతం దేనికి ప్రసిద్ధి?
ఎ) బొగ్గు బి) టపాసుల తయారీ
సి) లిగ్నైట్ డి) పేలుడు పదార్థాల తయారీ

37. భారత్‌లో మొదటి జనపనార మిల్లును ఎక్కడ స్థాపించారు?
ఎ) కలకత్తా బి) హౌరా సి) బన్సబేరియా డి) రిష్రా

38. తాటినార పరిశ్రమ ఏ రాష్ట్రంలో ఎక్కువగా కేంద్రీకృతమైంది?
ఎ) అసోం బి) ఆంధ్రప్రదేశ్ సి) కేరళ డి) కర్ణాటక

39. భారత్‌లో పురాతనమైన నేవల్ డాక్‌యార్డ్ ఏది?
ఎ) బాంబే బి) మద్రాస్ సి) వైజాగ్ డి) కొచ్చిన్

40. కింది ప్రదేశాల్లో హెచ్ఎంటి వాచీల తయారీ కేంద్రం ఉంది?
ఎ) బెంగళూరు బి) పింజోరి
సి) హైదరాబాద్ డి) ఏదీకాదు

సమాధానాలు

		13) బి	20) డి	27) ఎ	34) సి
1) డి	7) ఎ	14) సి	21) బి	28) సి	35) సి
2) సి	8) బి	15) బి	22) ఎ	29) బి	36) డి
3) బి	9) ఎ	16) ఎ	23) డి	30) సి	37) డి
4) సి	10) బి	17) బి	24) సి	31) సి	38) సి
5) బి	11) ఎ	18) డి	25) సి	32) డి	39) ఎ
6) ఎ	12) సి	19) సి	26) ఎ	33) సి	40) బి

ఉద్యోగాలు

మజగావ్ డాక్

ముంబైలోని మజగావ్ డాక్ లిమిటెడ్- కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది
మొత్తం ఖాళీలు: 26
సీనియర్ ఇంజనీర్ **ఖాళీలు:** 13
అర్హత: 60 శాతం మార్కులతో బిఇ/ బిటెక్(ఎలక్ట్రికల్) ఉత్తీర్ణులై ఉండాలి
వయసు: 28 ఏళ్లు మించరాదు
ఎగ్జిక్యూటివ్ ట్రైనీస్ **ఖాళీలు:** 13
అర్హత: సీఏ/ సీఎంఏ ఉత్తీర్ణత + కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలి
వయసు: 28 ఏళ్లు మించరాదు
ఎంపిక: రాత పరీక్ష, గేట్ 2015/ 2016 స్కోరు, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా
దరఖాస్తు ఫీజు: రూ.300
ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఆగస్టు 31
దరఖాస్తు హార్డు కాపీ చేరేందుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 11
చిరునామా: CM(HR - CR) Executives, Recruitment Section, 2nd Floor, Mazdock House, Mazagon Dock, Shipbuilders Limited, Dockyard Road, Mumbai - 400010
వెబ్‌సైట్: www.mazdock.com/

ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్

ఎయిర్ ఇండియా ఇంజనీరింగ్ సర్వీసెస్ లిమిటెడ్ - కాంట్రాక్ట్ ప్రాతిపదికన **ఎయిర్ క్రాఫ్ట్ మెయింటెనెన్స్ ఇంజనీర్** పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
మొత్తం ఖాళీలు: 40
కాంట్రాక్ట్ వ్యవధి: అయిదేళ్లు
అర్హత: ఇంటర్(ఎంపిసి) ఉత్తీర్ణతతోపాటు జెట్ ఇంజనీర్ ఎయిర్ క్రాఫ్ట్‌కు సంబంధించి సిఎటి బి1/ బి 2 లైసెన్స్ ఉండాలి.
వయసు: ఆగస్టు 1 నాటికి 60 ఏళ్లు మించరాదు
ఎంపిక: పర్సనల్ ఇంటర్వ్యూ, మెడికల్ ఎగ్జామ్ ద్వారా
దరఖాస్తు ఫీజు: రూ.1000
ఇంటర్వ్యూ: ఆగస్టు 30న
వేదిక: Air India Engineering Services Limited Maintenance Training Organization, Near Mascot Hotel Thiruvananthapuram - 695033
వెబ్‌సైట్: www.airindiaexpress.in/data/Advt.AME.docx

ఐఎఆర్ఐ

న్యూఢిల్లీలోని ఇండియన్ అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఐఎఆర్ఐ)- కింది పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.
మొత్తం ఖాళీలు: 25
రీసెర్చ్ అసోసియేట్ **ఖాళీలు:** 5
విభాగాలు: క్రాప్ ఇంప్రూవ్‌మెంట్ 2, నేచురల్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ 2, సిమ్యులేషన్ మోడలింగ్ 1
అర్హత: (పిహెచ్ డి/ ఎమ్మెస్సీ)(జెనెటిక్స్/ బయోటెక్నాలజీ/ బయో కెమిస్ట్రీ/ ప్లాంట్ ఫిజియోలజీ/ లైఫ్ సైన్సెస్) పూర్తిచేసి ఉండాలి. నెట్/ గేట్ అర్హతతోపాటు రెండేళ్ల రీసెర్చ్ అనుభవం ఉండాలి
సీనియర్ రీసెర్చ్ ఫెలో **ఖాళీలు:** 20
విభాగాలు: క్రాప్ ఇంప్రూవ్‌మెంట్ 5, నేచురల్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ 9, సిమ్యులేషన్ మోడలింగ్ 2, ప్లాంట్ ప్రొటెక్షన్ 2, సోషల్ సైన్సెస్ 2
అర్హత: (పిహెచ్ డి/ఎమ్మెస్సీ)(ఆగ్రోనమీ/ సాయిల్ సైన్స్/ ఎన్విరాన్ మెంటల్ సైన్స్/ వాటర్ సైన్స్/ లైఫ్ సైన్సెస్) + నెట్ / గేట్ అర్హత లేదా (పిహెచ్ డి/ ఎంటెక్/ ఎంసిఏ/ ఎమ్మెస్సీ)(అగ్రికల్చర్/ ఆగ్రానమీ/ సాయిల్ సైన్స్/ ఫిజియోలజీ/ హైడ్రాలజీ/ రిమోట్ సెన్సింగ్ జిఐఎస్/ ఐటి/ కంప్యూటర్ సైన్స్/ జెనెటిక్స్/ బయో టెక్నాలజీ / బయో కెమిస్ట్రీ/ ప్లాంట్ ఫిజియోలజీ/ లైఫ్ సైన్సెస్) పూర్తిచేసి ఉండాలి. రెండేళ్ల రీసెర్చ్ అనుభవం ఉండాలి
వయసు: రీసెర్చ్ అసోసియేట్స్‌కు 40 ఏళ్లు, సీనియర్ రీసెర్చ్ ఫెలోస్‌కు 35 ఏళ్లు మించరాదు
ఎంపిక: ఇంటర్వ్యూ ద్వారా
ఇంటర్వ్యూ: సెప్టెంబరు 7న
వేదిక: Board Room of the Center for environment Science and Climate Resilient Agriculture, NRL Building, IARI, New Delhi - 110012
వెబ్‌సైట్: www.iari.res.in/

నాల్కో

నేషనల్ అల్యూమినియం కంపెనీ లిమిటెడ్(నాల్కో)- కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది
మొత్తం ఖాళీలు: 16
జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్- ఇ 1 గ్రేడ్ పోస్టులు **ఖాళీలు:** 5
అర్హత: ఎంబిబిఎస్ ఉత్తీర్ణతతోపాటు రెండేళ్ల అనుభవం ఉండాలి. పీజీ సర్టిఫికెట్ (ఇండస్ట్రియల్ హెల్త్)పూర్తి చేసినవారికి ప్రాధాన్యం ఉంటుంది. **వయసు:** ఆగస్టు 18 నాటికి 32 ఏళ్లు మించరాదు
సీనియర్ మెడికల్ ఆఫీసర్ - ఇ 2 గ్రేడ్ పోస్టులు
ఖాళీలు: 11
విభాగాలవారీ ఖాళీలు: మెడిసిన్ 2, ఆర్థోపీడిక్స్ 1, అబ్‌స్టెట్రిక్స్ & గైనకాలజీ 1, పీడియాట్రిక్స్ 2, ఆప్తల్మాలజీ 1, అనెస్థీషియా 1, రేడియాలజీ 1, పాథాలజీ 1, డెర్మటాలజీ 1
అర్హత: ఎండి/ ఎంఎస్/ పోస్ట్ ఎంబిబిఎస్ డిప్లొమా (మెడిసిన్ / ఆర్థోపీడిక్స్/ అబ్‌స్టెట్రిక్స్ & గైనకాలజీ/ పీడియాట్రిక్స్/ ఆప్తల్మాలజీ/అనెస్థీషియా/ రేడియాలజీ/ పాథాలజీ/ డెర్మటాలజీ) పూర్తిచేసి ఉండాలి
ఎంపిక: రిటెన్ టెస్ట్/ పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా
ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 15
దరఖాస్తు హార్డు కాపీ చేరేందుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 25
వెబ్‌సైట్: www.nalcoindia.com

'ఎలుక గుర్రమునెక్కి ఏడేడు లోకాలు..' తిరుగుతూ ఏడాదికోమారు భూమి వాసులను చూసిపోవడానికి దిగివచ్చే బొజ్జగణపయ్యను తనివితీరా సేవించుకుని ఎన్నేళ్లయింది.
ఆయనకు ఇష్టమైన పత్రిని కరువుతీరా సమర్పించుకుని ఎన్నాళ్లయింది.
కనీసం నిమజ్జనానికి కూడా నీటికి దిక్కులేక ఎండి బీటలు వారిన బావురుమనే చెరువుల్లో అలాగే గణపయ్యను వదిలేసి వచ్చే దుస్థితే కదా ఇన్నేళ్లూ. ఇప్పుడు.. ఈ చవితి పండుగ పూట ఆ వినాయకుడికి పచ్చటి ప్రకృతే పరవశించి ఆహ్వానం పలుకుతోంది. నిండుతున్న చెరువుల్లో నీరు అలలలలలుగా శ్లోకాలు ఆలపిస్తోంది.

పత్రాలకు కొదువ రాదు..
తోయానికి దిగులు లేదు..!

వర్షాగమనంతో వినాయకుడికి పచ్చని ప్రకృతి ఆహ్వానం

ఫలం.. పుష్పం.. పత్ర.. తోయం. వీలైతే ఫలాలతో.. కాదంటే పుష్పాలతో.. అదీ లేదంటే.. పత్రాలతో.. దానికీ దిక్కులేదంటే.. ఒట్టి తోయంతో అంటే జలంతో పూజించినంత మాత్రాన ఉబ్బిపోయే దేవర గణేశుడు. వరాల వృష్టి కురిసే భోళా దేవుడు.వానలుంటేగా.. ఆ నాలుగు పదార్థాలతో నిండుగా పూజించుకోవడాని కాయన్ని. వినాయక చవితికి ముందుకానీ.. ఆపైన కానీ వానలు కురిసి చాలాకాలమైంది. ఈసారీ తలవని తలంపుగా తలంటుతోంది భూమికి వాన. బీళ్లుబీళ్లుగా మారిపోయి భోరుమంటున్న పొలాలను తనివితీరా తడిమి.. పురుళ్లు పోస్తోంది. ఈ నెల ఆరంభమైనది మొదలు, నేటిదాకా అడపాదడపా కురుస్తున్న వానలు.. ఎండి పగుళ్లుబారిన చెరువులు, కుంటల్లో నీటిని చేరుస్తున్నాయి. వరి, రాగి నాట్లు వేస్తూ.. కలుపు తీస్తూ.. గెనివార వేస్తూ.. అడుసు తొక్కుతూ.. మడక పడుతూ.. ఎటుచూసినా మట్టి మనిషే కనిపిస్తున్నాడు. మట్టి పిసుక్కుంటున్న ఆ మనిషి ముఖాల్లో ఎంత సంతోషమో. వాన చినుకులతో పచ్చటి పురుడు పోసుకుంటున్న భూమి తల్లిని చూసి పొంగిపోతున్నాడు. రాత్రీపగలూ తేడా లేకుండా రోజంతా పొలంలోనే గడుపుతున్నాడు. ఆరుగాలం శ్రమించి పెట్టిన పంట చేతికంది వస్తుంటే మురిపెంగా చూసుకుంటున్నాడు. ధాన్యరాశులతో నిండబోయే గాదెలను తలుచుకుని పొంగి పోతున్నాడు. కేవలం పొలాల్లోనే కాదు.. బీడు భూములు కూడా నానారకాల పచ్చటి మొక్కలతో కళకళలాడుతున్నాయి. నేలకు తలవాల్చేసిన మొక్కలు కొన్ని చిగుర్లు తొడుగుతున్నాయి. ఎవరో విసిరిపడేసిన గుమ్మడి గింజ తీగై.. పువ్వై.. పండై నేలంతా విస్తరిస్తోంది. చినుకుల తొలకరింపునకు పచ్చగా, ఏపుగా పెరిగిన జిల్లేడు మొక్కలమీద పువ్వులు గుత్తులుగుత్తులుగా ఉద్భవించి లంబోదరుడి పూజకు సిద్ధమయ్యాయి. ఏకదంతునికి ప్రీతిపాత్రమైన గరిక, అర్క, అశ్వత్థ, బదరీ, బిల్వ, దతూర, దేవదారు, దూర్వార, జాజి, మాచీ, శమీ, తులసి, విష్ణుకాంత తదితర పత్రాలు మొక్కల నిండుగా పచ్చపచ్చగా దర్శనమిస్తున్నాయి. వక్రతుండుని పూజకు వేగిరపడుతున్నాయి. బంతి, చేమంతులకు కొదువే లేదు. ఇక జామ, కిచ్చిలి, బత్తాయి, వెలగ తదితర ఫలాలు ఆ బొజ్జగణపయ్యకు నైవేద్యం కావడానికి ఆతృత పడుతున్నాయి. వినాయకుడి నిమజ్జనానికి తయారుగా చెరువులు, కుంటల్లో నీళ్లు తుళ్లిపడుతున్నాయి. వినాయక చవితినాడు ఈ పచ్చటి ప్రకృతి దృశ్యాలు చూసి ఎన్నేళ్లయింది? వినాయకులను ప్రతిష్ఠించిన దగ్గరనుంచీ వారిని ఎక్కడ, ఎలా నిమజ్జనం చేయాలన్న దిగులుతోనే ఉత్సవాలు నడిచేవి. నీళ్లులేని చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేయలేక పోయిన విగ్రహాలను వదిలి వెనుదిరగాల్సి వచ్చేది. ఎక్కడో సుదూరంగా చారెడు నీళ్లున్న కుంటలకు విగ్రహాలు వారులు తీరి, సరిగ్గా నిమజ్జనం కాకుండానే అనాథలుగా కనిపించేవి. ఈసారలా కాదు.. ఆ గణేశుని వర ప్రభావమో ఏమో కానీ.. వానలు కురిశాయి.చెరువులు నిండుతున్నాయి.సకల చరాచర గ్రామీణమూ వ్యవసాయప్పనుల్లో మునిగిపోయి వున్నా, ఆ భోళా గణపతికి చవితి వేడుకలు నిండారా చేయడానికి సిద్ధమవుతోంది. ఇదేవిధంగా యేటా వానలతో తమను కరుణించమంటూ వేడుకుంటోంది. **-కుప్పం**



కుప్పం వీధుల్లో అమ్మకాలకు పత్రి సిద్ధం





విరబూసిన గుమ్మడి పువ్వు - గణపయ్య పూజకు వేగిరపడుతున్న జిల్లేడు పువ్వులు





గణేశ పూజకు సిద్ధమవుతున్న పూలబాలలు - సగం నిండిన డీకేపల్లె చెరువు

తుమ్మలగుంటలో 30 అడుగుల షిరిడీసాయి గణేశుడు



తిరుపతి రూరల్ : వినాయకచవితి పర్వదినాన్ని పురస్కరించుకుని తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంటలో షిరిడీసాయి గణేశX ఆకారంలో మట్టితో స్వామి ప్రతిమను ఏర్పాటు చేశారు. సినీ ఆర్ట్ డైరెక్టర్ చిన్న ఆధ్వర్యంలో చెన్నై, హైదరాబాద్‌కు చెందిన 40 మంది కళాకారులు పదిరోజులు కష్టపడి 30 అడుగుల ఎత్తు, 30 అడుగుల వెడల్పుతో భారీ విగ్రహాన్ని రూపొందించారు. శరీరమంతా షిరిడి సాయి ఆకారంలో ఉండి తల వినాయకుడి రూపంలో ఉండడం ఈ విగ్రహం ప్రత్యేకత. దీని తయారీకోసం 10 టన్నుల బంకమన్ను, 2 టన్నుల టెంకాయ పీచు, 300 కిలోల గడ్డి, 100కిలోలకు పైగా చెక్కలు వినియోగించారు. చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో బాలవినాయక కమిటీకి చెందిన చిన్నారులు విగ్రహం తయారీలో కీలకంగా వ్యవహరించారు. కాగా, తిరుపతికి చెందిన ముస్లింలు కె.షరీఫ్, కె.అష్రఫ్ కొన్నేళ్ల నుంచి తుమ్మలగుంట వినాయక విగ్రహానికి ప్రసాదంగా భారీలడ్డు తయారు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఈ ఏడాది 1,116 కిలోల లడ్డు తయారు చేశారు.

పరవళ్ల జలపాతాలు



తిరుమల గిరుల నుంచి జలపాతాల పరవళ్లు ప్రజలను తిరుపతి ప్రజలను పరవశానికి గురి చేస్తున్నాయి. రెండు వారాలుగా అప్పుడప్పుడు వానలు కురుస్తున్నాయి. బుధవారం అర్ధరాత్రి తర్వాత భారీ వర్షం కురిసింది. దీంతో తిరుమల సప్తగిరుల నుంచి జలసిరులు కిందకు ఉరకలెత్తాయి. వృషభాద్రి కొండకు ఇరువైపులా ఉన్న కపిలతీర్థం, మాల్వాడిగుండం జలపాతాలు గురువారం నగరవాసులకు, యాత్రికులకు కనువిందు చేశాయి. కపిలతీర్థం జలపాతం ఉధృతి ఎక్కువగా ఉండగా మాల్వాడిగుండం జలపాతం సాధారణస్థాయిలో ఉండి ఆకట్టుకుం టోంది. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని కపిలేశ్వరస్వామి ఆలయంలో భక్తులను పవిత్ర స్నానాలకు అనుమతించలేదు. అయితే జలపాతాల సోయగాలను పలువురు నగరవాసులు, యాత్రికులు తమ సెల్ ఫోన్లలో బంధించుకుని మురిసిపోయారు.

- తిరుపతి (సాంస్కృతికం)

మాల్వాడి గుండం



సూక్ష్మ వినాయకం నమోస్తుతే

తిరుపతి(సాంస్కృతికం): వినాయక చవితిని పురస్కరించుకుని స్థానిక చిత్రకారుడు పల్లె చిరంజీవి సూక్ష్మ వినాయకు లను చిత్రించాడు. బియ్యం గింజలు, ఆవాలు, మినపపప్పు, చింతగింజలు, పూసలపై వినాయకుని చిత్రాలు చిత్రించాడు. వినాయకచవితి కావడంతో ఇవి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.





చింతగింజపై గణపతి చిత్రం

వినాయక చవితికి ఆలయాల్లో ఏర్పాట్లు

కుప్పం రూరల్ : వినాయక చవితిని పురస్కరించుకుని కుప్పం ప్రాంతంలోని ఉన్న ఆలయాల్లో మామిడి, అరటి తోరణాలు, పుష్పాలంకరణ చేశారు. కొత్తపేటలోని వెలిసిన వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త వెంకటేశులు, కార్యదర్శి లక్ష్మీపతి తెలిపారు. స్వామివారికి తెల్లవారుజామున క్షీరాభిషేకాలతో పూజలు నిర్వహిస్తామన్నారు. భక్తులకు అన్నదానం, తాగునీటి ఏర్పాటు చేశామని వారు చెప్పారు. ఈసారి వర్షాలు పడడడంతో ఆనందోత్సావాలతో పండుగ ఏర్పాట్లు చేసుకున్నారు.

శుద్ధి నీటి కోసం ఎదురుచూపు

నిధులు విడుదల చేసినా సాగని పనులు ● పల్లెల్లో మినీ ప్లాంట్లకు విద్యుత్ సమస్య

శాంతిపురం : స్వచ్ఛమైన నీటి కోసం మండల ప్రజలు రెండున్నర ఏళ్లుగా శాంతిపురం మండల ప్రజలు ఎదురుచూస్తున్నారు. మండలంలో మూడు చోట్ల ఎన్టీఆర్ సుజల స్రవంతి ప్లాంట్లు ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం రెండున్నర ఏళ్ల క్రితం రూ. 27 కోట్లు నిధులు మంజూరు చేసింది. వెంటనే ప్లాంట్ల నిర్మాణానికి స్థల సేకరణ చేశారు. బడుగుమాకులపల్లె, వడ్డివాణికొత్తూరు, రాళ్ళబూదుగూరు పంచాయతీ సాతు గ్రామాల్లో ప్లాంట్‌లు నిర్మించేందుకు నిర్ణయించారు. బడుగుమాకులపల్లె, రాళ్ళబూదుగూరు వద్ద పనులు కూడా ప్రారంభించారు. బడుగుమాకులపల్లెలో సుజల ప్లాంట్ 95 శాతం పనులు పూర్తై ప్రారంభానికి సిద్ధంగా ఉంది. రాళ్ళబూదుగూరు ప్లాంట్ 70 శాతం పనులు పూర్తయ్యాయి. కానీ వడ్డివానికొత్తూరు ప్లాంట్‌కు ఇప్పటివరకు స్థల సేకరణ జరగలేదు. స్థల సేకరణ కోసం సర్పంచ్ గోపాల్ తహసీల్దార్ శ్రీనివాసులు వద్దకు తిరుగుతూనే ఉన్నారు. కానీ ప్లాంట్‌ల కోసం వేసిన బోర్లకు మోటర్లు బిగించలేదు. మోటర్లు బిగిస్తేగానీ ఏ బోర్లో ఎంత నీరు ఉందని తెలియదు. ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ నిర్లక్ష్యం వల్లే సుజల స్రవంతి పనులు ఆలస్యమౌతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. పల్లెల్లో ఏర్పాటు చేసిన మినీ ప్లాంట్లకు విద్యుత్ సమస్య ఏర్పడిందని నిర్వాహకులు ఆరోపిస్తున్నారు. మండలం మొత్తం 46 మినీ ప్లాంట్లు నిర్మించినట్లు తెలిసింది. రెస్కో అధికారులను అడిగితే విద్యుత్ సర్వీసుల కోసం ఇంతవరకు డబ్బు చెల్లించలేకపోవడం వల్లే మినీ ప్లాంట్‌లకు సర్వీసులు ఇవ్వలేకపోయామన్నారు. సంబంధిత అధికారులు స్పందించి పల్లెల్లో ఏర్పాటు చేసిన మినీ ప్లాంట్‌లకు విద్యుత్ సౌకర్యం కల్పించి, సుజల స్రవంతి కోసం వేసిన బోర్లకు మోటర్లు బిగించి స్వచ్ఛమైన నీరును ప్రజలకు అందించాలని ప్రజానీకం కోరుతోంది.


బడుగుమాకులపల్లెలో సుజల స్రవంతి ప్లాంట్(ఇన్‌సెట్)మోటరు లేక ఖాళీగా ఉన్న బోరు

రైతు సంక్షేమమే ముఖ్యమంత్రి ధ్యేయం

శాంతిపురం : రైతు సంక్షేమమే ముఖ్యమంత్రి చంద్రబాబు ధ్యేయమని ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు అన్నారు. గురువారం మండల సచివాలయంలో రైతు ఉత్పత్తి దారుల సంఘాల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని, రైతు గ్రూపులు ఏర్పాటు చేసి బ్యాంకు లింకేజీ ద్వారా రుణాలు అందించడం ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కుతుందన్నారు. ప్రజాప్రతినిధులకు తెలియకుండా అధికారులు రైతు గ్రూపులు ఏర్పాటు చేయడంపై సీడీసీఎంఎస్ చైర్మన్ శ్యామరాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ శ్రీనివాసులు, ఎంపీపీ పుష్ప, ఏపీఎం లావణ్య, డీపీఎం మునిరత్నం, టీడీపీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

వంద శాతం రాయితీతో ఉలవల పంపిణీ



కుప్పం: కుప్పం మండల రైతులకు వంద శాతం రాయితీతో ఉలవలు పంపిణీ చేస్తున్నారు. స్థానిక మండల వ్యవసాయ కార్యాలయంలో గురువారం ఉలవల పంపిణీ కార్యక్రమాన్ని జడ్పీటీసీ రాజ్‌కుమార్, వ్యవసాయ శాఖ ఏడీఏ బషీర్ అహ్మద్ ప్రారంభించారు. వారు మాట్లాడుతూ సాగునీరు లభ్యత తక్కువ ఉన్న చోట ఉలవలు వంటి ఆరుతడి పంటల సాగు చేయడం లాభదాయకమన్నారు.

స్వచ్ఛ గ్రామాలకు సహకరించండి



వి.కోట : ప్రతి గ్రామాన్ని స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రజలందరూ సహకరించాలని సర్పంచ్ రామకృష్ణప్ప కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో స్వచ్ఛభారత్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కుప్పం మండలం నుంచి విచ్చేసిన సర్పంచులు, ఈవోలు, కార్యదర్శులకు స్వచ్ఛ గ్రామాల సాకారంపై చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో శిక్షణ ఇచ్చారు. తడి, పొడి చెత్తలను వేర్వేరుగా సేకరించి ఎలా సేంద్రియ ఎరువులు తయారు చేయాలన్న అంశంపై అవగాహన కల్పించారు. శిక్షణ అనంతరం సర్పంచులు, కార్యదర్శులు, అధికారులు పట్టణంలోని వీధులో చెత్తను సేకరించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ శ్రీనాథ్‌రెడ్డి, ఈవో సత్యనారాయణ, స్వచ్ఛదూతలు, సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

మట్టి విగ్రహాలు ఏర్పాటు చేసుకోవాలి



గుడుపల్లె : వినాయక చవితికి మట్టి విగ్రహాలను ఏర్పాటు చేసుకోవాలని ద్రావిడ ప్రథమ మహిళ ఆచార్య దేవి పేర్కొన్నారు. గురువారం వర్శిటీలో వినాయక మట్టి విగ్రహాల తయారీ చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ద్రావిడలో శుక్రవారం వినాయక చవితికి మట్టి విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రసాయనిక పదార్థాలతో తయారు చేసే వినాయక ప్రతిమల వల్ల వాతావారణం కలుషితమౌతుందన్నారు. ప్రజలు అందరూ మట్టి వినాయక ప్రతిమలను వాడి వాతావరణాన్ని కాపాడాలని ఆమె కోరారు.

కార్పొరేషన్ రుణాలకు అనూహ్య స్పందన



గుడుపల్లె : మండల కేంద్రంలోని స్త్రీశక్తి భవనంలో గురువారం నిర్వహించిన కార్పొరేషన్ ఇంటర్వ్యూలకు వెయ్యి మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, కాపు, కార్పొరేషన్ కింద 143 యూనిట్లకు 1504 మంది అభ్యర్థలు దరఖాస్తు చేసుకున్నారు. బ్యాంకు అధికారులు అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బాబురావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలి

శాంతిపురం : ప్రతి విద్యార్థి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు అన్నారు. గురువారం తులసీనాయనపల్లె ఆదర్శ పాఠశాలలో ఫ్రెషర్స్ డే జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోనే శాంతిపురం ఆదర్శ పాఠశాల ఆదర్శంగా నిలవడం గొప్ప వరమన్నారు. ఇక్కడ చదువుతున్న విద్యార్థులందరూ మంచి ఫలితాలు సాధించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. మంచి ఫలితాలు సాధించిన 10 మంది విద్యార్థులకు ఆర్థిక సహాయాన్ని అందజేస్తానని గత సమావేశంలో చెప్పిన విధంగానే విద్యార్థులకు చెక్కులు పంపిణీ చేశారు. విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం ఆట పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. అలాగే కస్తూర్బా గురుకుల పాఠశాలను ఎమ్మెల్సీ తనిఖీ చేశారు. కార్యక్రమంలో సీడీసీఎం ఎస్ చైర్మన్, రెస్కో వైస్ చైర్మన్ చలపతిస్వామి, ఎంపీపీ పుష్ప, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ నాగరాజు, జడ్పీటీసీ శ్రీనివాసులు, సర్పంచ్ నారాయణప్ప, ఎంపీటీసీ రామచంద్రనాయుడు, నాగరాజు, తెలుగు యువత అధ్యక్షుడు కేశవులు, పాఠశాల కమిటీ చైర్మన్ చలపతి, క్యాబేజీ మురళి, ఎంపీటీసీ గోవిందరాజులు, ప్రిన్సిపాల్ మురళి పాల్గొన్నారు.

కార్పొరేషన్ రుణాల

ఇంటర్వ్యూలకు 175 మంది హాజరు


కార్పొరేషన్ రుణాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న బ్యాంకు అధికారులు

పలమనేరు రూరల్ : మండలం పరిధిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, కాపు, బీసీ, పీహెచ్ సీ అభ్యర్థులు 175 మంది కార్పొరేషన్ రుణాల కోసం ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. పలమనేరు ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఎంపీపీ గీత అధ్యక్షతన బ్యాంకు అధికారులు ఇంటర్వ్యూలను నిర్వహించారు. పలమనేరు ఎస్‌బీఐ బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ శ్యాంసన్ విజయ్‌కుమార్ 134 మందికి ఇంటర్వ్యూలు నిర్వహించారు. కొలమాసనపల్లె సప్తగిరి గ్రామీణ బ్యాంకు మేనేజర్ సంపూర్ణరావు 41 మందికి ఇంటర్వ్యూలు నిర్వహించారు. వీరిలో ఇరు బ్యాంకులు 158 మందిని ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో హర్మత్, ఈవోఆర్డీ, సెక్రటరీలు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో

యువకుడి మృతి


ప్రమాదంలో మృతి చెందిన మున్నా

బంగారుపాళ్యం : మండలంలోని మొగిలి ఘాట్ రోడ్డులో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఏఎస్ఐ మనోహర్ వివరాల మేరకు.. చిత్తూరు నగరంలోని కైనికట్టు వీధికి చెందిన మున్నా (32), అన్సర్ బాషా(62)లు పలమనేరులో తమ సమీప బంధువుకు చెందిన శుభ కార్యానికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో బంధువులు ముందు వాహనంలో వెళ్తుం డగా వెనుకవైపు మున్నా, అన్సర్ బాషా ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా వెనుకవైపు నుంచి కంటైనర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో మున్నా మృతి చెందగా అన్సర్ బాషా తీవ్రంగా గాయపడ్డాడు. ప్రమాదాన్ని గుర్తించిన ముందు వెళ్తున్న బంధువులు వెనుకకు వచ్చి మృతి చెందిన మున్నాను, తీవ్రంగా గాయపడిన అన్సర్ బాషాను బంగారుపాళ్యం ప్రభుత్వాస్పత్రికి తరలిం చారు. బంగారుపాళ్యం ఏఎస్ఐ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కాగా మధ్యాహ్నం నుంచి బంధువులతో కలసి ఎంతో ఉల్లాసంగా ఉన్న మున్నా కళ్ల ఎదుటే మృతి చెందడంతో బంధువులు ఆస్పత్రిలో కన్నీరుమున్నీగా విలపిస్తున్నారు.

టీడీపీ కార్యాలయంలో నేడు వినాయక చవితి వేడుకలు

బంగారుపాళ్యం : మండల కేంద్రం బంగారుపాళ్యంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో వినాయక చవితి వేడుకలను శుక్రవారం వైవభంగా నిర్వహించనున్నట్లు మండల టీడీపీ అధ్యక్షుడు జయప్రకాష్, కార్యదర్శి జనార్దన్ గౌడ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరు కావాలని వారు కోరారు. వినాయక చవితి ఉత్సవ ఏర్పాట్లకు నిర్వాహకులు పెద్దఎత్తున ఏర్పాట్లు చేసారు. ఇదిలావుండగా మండలవ్యాప్తంగా పలు గ్రామాల్లో చవితి వేడుకలకు సన్నామాలు చేస్తున్నారు.

ఉచితంగా ఉలవల పంపిణీ

పెద్దపంజాణి : మండల పరిధిలో వేరుశనగ పంట వేయని రైతులకు ప్రత్యామ్నాయంగా గురువారం ఎంపీపీ మురళీకృష్ణ ఉచితంగా ఉలవలు పంపిణీ చేశారు. ఏవో పరమేశ్వరి మాట్లాడుతూ మండలానికి 120 బస్తాలు ఉలవలు వచ్చాయని, పాసు పుస్తకంతో వ్యవసాయ కార్యాలయానికి వచ్చి ఉచితంగా ఉలవలు తీసుకువెళ్లాలన్నారు. రాగులు కావాల్సిన రైతులకు 50 శాతం రాయితీపై పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సింగిల్‌విండో అధ్యక్షుడు శంకరప్ప, సీఈవో రామరాజు, అసిస్టెంట్ సీఈవో మునిరాజ, ఎంపీటీసీ ముబారక్‌తాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఉలవలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ మురళీకృష్ణ



పంటలపై ఏనుగుల దాడి

పలమనేరు : మున్సిపాలిటీ పరిధిలోని టీఎస్ అగ్ర హారం పంట పొలాలపై బుధవారం రాత్రి ఏనుగుల గుంపు దాడి చేసి ఆస్తి, పంట నష్టం చేశాయి. ఈశ్వర్ రెడ్డి, మనోహర్‌లకు చెందిన మల్బరీ, టమోటా పంటలపై ఏనుగుల గుంపు దాడి చేసి తర్వాత డ్రిప్ పైపులను ధ్వంసం చేశాయి. దీంతో సుమారు రూ.లక్షకు పైగా నష్టం వాటిల్లినట్లు రైతులు పేర్కొన్నారు.



ఏనుగుల దాడిలో ధ్వంసమైన టమోటా పంట




వాడవాడలా వినాయక చవితి సందడి



మార్కెట్‌లో పూలు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

పలమనేరు రూరల్ : ఎక్కడ చూసినా వినాయక చవితి సందడి కనిపిస్తోంది. వాడవాడలకు, గ్రామాలకు గణపయ్య విగ్రహాలు తరలాయి. పండుగను పురస్కరించుకుని గురువారం పూలు, పండ్ల వ్యాపారాలు ఊపందుకున్నాయి. దీంతో వ్యాపారస్తులు దీన్ని ఆసరాగా చేసుకొని అధిక ధరలకు విక్రయించి దోపిడీ చేస్తున్నారు. కృత్రిమ డిమాండ్ సృష్టించి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. వాడవాడలా వినాయక ప్రతిమలను ఏర్పాటు చేసి పూలతో, పండ్లతో స్వామి వారిని అలంకరించి ప్రత్యేక పూజలు చేస్తారు. ఇళ్లల్లోనూ తప్పనిసరిగా పూలు, పండ్లు, పూజకు వాడుతున్నారు. బంతిపూలు కిలో రెండు రోజుల క్రితం రూ.50 ఉండగా ప్రస్తుతం రూ.80 నుంచి రూ.100 వరకు పలుకుతున్నాయి. మల్లెలు కిలో మామూలుగా రూ.150 ఉండగా రూ.500 ధరకు విక్రయిస్తున్నారు. ఇదే బాటలో కిలో ఆపిల్ రూ.100 ఉండగా పండగ రోజుల్లో రూ.250లకు విక్రయిస్తున్నారు. ఇక మిగిలిన పండ్ల గురించి చెప్పాల్సిన అవసరం లేదు. ఇక పూజకు వాడే కొబ్బరి కాయలు, ఆకు, వక్క, పసుపు, కుంకుమ వీటి ధరలను కూడా పండగ రోజుల్లో అమాంతం పెంచేస్తున్నారు.







మట్టి విగ్రహాలపై అవగాహన ర్యాలీ

పలమనేరు : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ విద్యార్థులు గురువారం గో గ్రీన్ గణేషా ర్యాలీ నిర్వహించారు. మట్టి వినాయకుడితో కలిగే ప్రయోజనాలను, రసాయనాలతో తయారు చేసిన విగ్రహాల వల్ల కలిగే అనర్థాలను తెలియజేసేందుకు ప్లకార్డులు పట్టుకొని కళాశాల నుంచి ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ప్రిన్సిపాల్ డాక్టర్ బాబు ప్రారంభించారు. మట్టి వినాయకుడి విగ్రహాన్ని సహజ రంగులతో, పుష్పాలతో అలంకరించి ర్యాలీలో పాల్గొన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు భానుప్రకాష్, చంద్రా నాయుడు, అధ్యాపకులు సూర్యశేఖర్ రెడ్డి, గోపినాయక్, ప్రసన్నలత తదితరులు పాల్గొన్నారు.



ఎన్ఎస్ఎస్ విద్యార్థుల గో గ్రీన్ గణేష ర్యాలీ






అధ్వానంగా గ్రామీణ రహదారులు

బంగారుపాళ్యం : మండలంలోని పలు గ్రామీణ రోడ్లు అధ్వాన స్థితికి చేరుకున్నాయి. బీటీ రోడ్లలో గుంతలుపడి కంకర తేలిపోవడంతో రహదారిపై ప్రయాణించే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కురిసిన కొద్దిపాటి వర్షాలకే రోడ్లలోని గుంతల్లో నీరు నిలిచి రోడ్లు మరింత అధ్వానంగా తయారయ్యాయి. మండలంలోని అరగొండ రోడ్డు, టేకుమంద, బండ్లదొడ్డి, నలగాంపల్లె, తంబుగానిపల్లె, ఎర్రాండ్లపల్లె, బోడబండ్ల, రాగిమాను పెంట, కంతలచెరువు, వెలుతురుచేను, వేపనపల్లె, తుంబకుప్పం, తుంబపాళ్యం రోడ్లు మరీ అధ్వానంగా ఉన్నాయి. తుంబకుప్పం, తుంబపాళ్యం పది కిలోమీటర్ల రహదారి మరమ్మతులకు సుమారు రూ.60 లక్షలతో అధికారులు నివేదికలను సిద్ధం చేశారు. నిధులు మంజూరు కాకపోవడంతో మరమ్మతులకు నోచుకోవడం లేదు.



అధ్వానంగా ఉన్న తుంబపాళ్యం రహదారి



దినఫలాలు

అదృష్టసంఖ్యలు: 6, 7

మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20): శ్రీవారు, శ్రీమతి విషయాల్లో శుభపరిణామాలు సంభవం. స్పెక్యులేషన్లు, పందాలు, పోటీల్లో దూకుడు తగదు. కొత్త పరిచయాలు ఏర్పడతాయి. సమావేశాలు, వేడుకల్లో కీలకపాత్ర పోషిస్తారు.

వృషభరాశి: (ఏప్రిల్21-మే20): కృషి రంగంలో కొత్త ఆలోచనలు స్ఫురిస్తాయి. ప్రియతముల ఆరోగ్యం మెరుగవుతుంది. రిటైల్, ఆహారం, ఆస్పత్రుల రంగాల వారికి శ్రమకు తగిన ప్రతిఫలం లభిస్తుంది. వేడుకలు ఉల్లాసం కలిగిస్తాయి

మిథునరాశి: (మే21-జూన్21): ప్రేమానుబంధాలు బలపడతాయి. ప్రియతముల కలయిక ఉల్లాసం కలిగిస్తుంది. విద్యార్థులు చేపట్టిన పనులు పూర్తి చేస్తారు. చిన్నారుల వైఖరి మనస్తాపం కలిగిస్తుంది. సంకల్పం నెరవేరుతుంది.

కర్కాటకరాశి: (జూన్22-జూలై23): మార్పులు, చేర్పులకు అనుకూలం. ఇంటికి అవసరమైన వస్తువులు సమకూర్చుకుంటారు. రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగాల వారి కీలక సమాచారం అందుకుంటారు. బంధువులతో ఉల్లాసంగా గడుపుతారు.

సింహరాశి: (జూలై24-ఆగస్ట్23): సోదరీసోదరుల విషయాల్లో శుభపరిణామాలు సంభవం. మెయిల్స్, శుభవార్త అందుకుంటారు. సన్నిహితుల సహకారంతో ఆర్థిక లక్ష్యాలు సాధిస్తారు. ప్రయాణాలు, చర్చల్లో జాగ్రత్తలు పాటించాలి.

కన్యారాశి: (ఆగస్ట్24-సెప్టెంబర్23): షాపింగ్ ఉల్లాసం కలిగిస్తుంది. విలువైన వస్తువులు సేకరిస్తారు. పెట్టుబడులు మంచి ప్రతిఫలాలను ఇస్తాయి. అదనపు ఆదాయం కోసం ప్రయత్నాలు చేస్తారు. వేడుకల్లో పాల్గొంటారు.

తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23): నూతన అంశాలపై దృష్టి సారిస్తారు. మనసు ఆహ్లాదకరంగా ఉంటుంది. ఉత్సాహంతో కొత్త పనులను ప్రారంభిస్తారు. జనసంబంధాలు విస్తరిస్తాయి. సంకల్ప సిద్ధికి పట్టుదలతో కృషి చేయాలి.

వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22): ఉన్నత విద్య, విదేశీవ్యవహారాలకు అనుకూలం. రాజకీయ, సినీ రంగాల వారు గతాన్ని సమీక్షించుకుంటారు. ప్రయాణాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు, చర్చలు ఆనందం కలిగిస్తాయి. పెట్టుబడుల్లో జాగ్రత్త అవసరం.

ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21): బృంద కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొంటారు. యూనియన్ కార్యకలాపాలు, ప్రదర్శనలు,సమావేశాలకు అనుకూలం. ఆర్థిక పరిస్థితి ప్రోత్సాహకరంగా ఉంటుంది. ప్రేమలు బెడిసికొట్టే ప్రమాదం ఉంది.

మకరరాశి(డిసెంబర్22-జనవరి21): ఉన్నత పదవులు అందుకుంటారు. ప్రభుత్వ రంగంలోని వారికి ప్రోత్సాహకరంగా ఉంటుంది. పైఅధికారుల వైఖరి మనస్తాపం కలిగిస్తుంది. వృత్తి, వ్యాపారాల్లో ఆశించిన ఫలితాలు సాధిస్తారు. వేడుకలు ఉల్లాసం కలిగిస్తాయి.

కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18): ప్రణాళికాబద్ధంగా వ్యవహరించి లక్ష్యాలు సాధిస్తారు. విదేశీవ్యవహారాలు, దూరప్రయాణాలకు ఏర్పాట్లు చేసుకుంటారు. ఆధ్యాత్మిక, కళా, సాంస్కృతిక కార్యక్రమాలు ఆనందం కలిగిస్తాయి.

మీనరాశి:(ఫిబ్రవరి19మార్చి20): ఆర్థిక సంస్థలతో పనులు పూర్తవుతాయి. పెట్టుబడుల విషయంలో నిదానం అవసరం. ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. వారసత్వ విషయాలు ఒక కొలిక్కి వస్తాయి.

-బిజుమళ్ళ బిందుమాధవ శర్మ

శ్రీసిటీలో 'కలాం సందేశ్ వాహిని'





సందేశ్ వాహిని రథానికి స్వాగతం పలుకుతున్న విద్యార్థులు - రథంలోని ప్రదర్శనలను తిలకిస్తున్న విద్యార్థులు

శ్రీసిటీ (వరదయ్యపాళెం): దివంగత మాజీ రాష్ట్రపతి డాక్టర్ అబ్దుల్‌కలాం నిర్దేశించిన విజన్ 2020పై అవగాహన కల్పించేందుకు రూపొందించిన కలాం సందేశ్ వాహిని ప్రచార రథం గురువారం శ్రీసిటీకి చేరుకుంది. స్థానిక చిన్మయా విద్యాలయ విద్యార్థులు, ఉపాధ్యాయులు, శ్రీసిటీ అధికారులు, సిబ్బంది రథానికి శ్రీసిటీ వద్ద స్వాగతం పలికారు. ఈ రథంలోని చిన్మయా మిషన్ రూపొందించిన కలాం జీవిత ఘట్టాలు, అంతరిక్ష మరియు రక్షణ రంగాల్లో ఆయన సాధించిన విజయాలు, దేశ ప్రగతికి దిశా నిర్దేశం చేసిన కలాం ఆలోచనలకు సంబంధించిన చాయా చిత్రాలు, నమూనాలు విద్యార్థులను ఆకట్టుకున్నాయి. ఈ ప్రదర్శనను తిరుపతి, నెల్లూరు, స్థానిక చిన్మయా విద్యాలయ, ఇరుగుళం తదితర పాఠశాలలకు చెందిన 600మంది విద్యార్థులు సందర్శించినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో చిన్మయా విద్యాలయ కరస్పాండెంట్ ఉమాకల్యాణం, ప్రిన్సిపాల్ హేమలత, శ్రీసిటీ సెక్యూరిటీ అధికారి అల్తాఫ్, శ్రీసిటీ ఫౌండేషన్ అధికారి సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి బ్యాంకులకు మూడురోజుల సెలవులు

చిత్తూరు కలెక్టరేట్: బ్యాంకులకు శుక్రవారం నుంచి మూడురోజుల పాటు వరుస సెలవులున్నాయి. ఈ మేరకు.. శుక్రవారం వినాయక చవితి, 26న నాలుగో శనివారం, 27న ఆదివారం సాధారణ సెలవు కారణంగా బ్యాంకులు మూతపడనున్నాయి. ఈనెల 12న రెండో శనివారం, 13న ఆదివారం, 14న కృష్ణాష్టమి, 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా బ్యాంకుల్లో లావాదేవీలు బంద్ అయిన విషయం విదితమే. మరోవైపు 6, 20న ఆదివారం సాధారణ సెలవులతో మూతపడగా , 22న ఉద్యోగుల సమ్మెతో బ్యాంకులు పనిచేయలేదు. అంటే ఈనెలలో అత్యధికంగా పదిరోజుల పాటు బ్యాంకులు మూతపడ్డాయి. వరుస సెలవుల కారణంగా నగదు లావాదేవీలకు దూరమై ఖాతాదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ. 2.68కోట్లు

ఆంధ్రజ్యోతి, తిరుమల: శ్రీవారికి హుండీ ద్వారా రూ.2.68కోట్ల ఆదాయం లభించింది. బుధవారం వచ్చిన కానుకలను గురువారం లెక్కించగా ఈ మేరకు ఆదాయం సమకూరిందని అధికారులు ప్రకటించారు. అలాగే టీటీడీ ఆధ్వర్యంలో జరుగుతున్న వివిధ పథకాలకు గురువారం పలువురు దాతలు రూ.27.71లక్షలను వితరణ చేశారు. నిత్యాన్న ప్రసాదానికి రూ.19.56లక్షలు, బర్డ్ ఆస్పత్రికి రూ.8.15లక్షలను అందజేశారు.

5న టెన్త్ విద్యార్థులకు ఎన్టీఎస్ఈ పరీక్ష

చిత్తూరు సిటీ: నవంబర్ 5న జరిగే ఎన్టీఎస్ఈ (ఒకటవ దశ) పరీక్షకు పదవ తరగతి విద్యార్థుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జి డీఈవో శామ్యూల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో గుర్తింపు పొందిన విద్యాసంస్థలు, కేంద్రీయ విద్యాలయాలు, సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ విద్యార్థులు పరీక్ష రాసేందుకు అర్హులని పేర్కొన్నారు. చలానా రూపంలో రూ.200 పరీక్ష ఫీజు చెల్లించి సెప్టెంబర్ 18లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.కాగా, ఫీజు వచ్చేనెల 20వతేదీలోగా చెల్లించి,25వతేదీలోగా డీఈవో కార్యాలయం లేదా ప్రభుత్వ పరీక్షల సంచాలకుల కార్యాలయంలో చలానా అందజేయాలని ఆయన సూచించారు.

ఎన్ఎంసీఎం స్కాలర్‌షిప్ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు సిటీ: నవంబరు 5న జరిగే ఎన్ఎంసీఎం(నేషనల్ మీన్స్ కమ్ మెరిట్) స్కాలర్‌షిప్ మంజూరు కోసం నిర్వహించే పరీక్షకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జి డీఈవో శామ్యూల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, జడ్పీ, మున్సిపల్, ఎయిడెడ్, వసతి సౌకర్యంలేని ఆదర్శ పాఠశాలల్లో 8వతరగతి చదువుతున్న విద్యార్థులు ఇందుకు అర్హులని పేర్కొన్నారు. జనరల్, బీసీలు రూ.100, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్ విద్యార్థులు రూ.50 వంతున ఎస్బీఐ కలెక్ట్ ద్వారా ఫీజు చెల్లించాలని కోరారు. సెప్టెంబర్ 18వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలనీ, 20వతేదీలోగా ఫీజు చెల్లించాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు ప్రభుత్వ పరీక్షల సంచాలకుల కార్యాలయంలో సంప్రదించాలని ఆయన కోరారు.

ఐటీఐలలో మూడోవిడత ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

తిరుపతి(టీటీడీ): చిత్తూరు జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పారిశ్రామిక శిక్షణా సంస్థలలో 3వ విడత ప్రవేశాలకై ఆగస్టు 28వ తేదీ లోగా అర్హత గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఐటీఐ విద్యా సంస్థల కన్వీనర్ పి.గణేష్ ఒక ప్రకటనలో తెలిపారు. 30వ తేదీ దరఖాస్తుల పరిశీలన, 31న అడ్మిషన్లు జరుగుతాయని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

27న జిల్లాస్థాయి చదరంగ జట్ల ఎంపిక

తిరుపతి(క్రీడలు): చిత్తూరు జిల్లా చదరంగం సంఘం ఆధ్వర్యంలో ఈనెల 27వ తేదీ ఉదయం 8 గంటలకు తిరుపతిలోని యూత్ హాస్టల్‌లో జిల్లా జట్ల ఎంపిక టోర్నీ నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు వై.ప్రవీణ్ ఒక ప్రకటనలో తెలియజేశారు. పాల్గొనదలచిన క్రీడాకారులు తమతో బాటు తమ వయస్సు ధృవీకరణ పత్రం, చదరంగం క్రీడా సామాగ్రితో హాజరు కావాలని, వివరాలకు 8008473330, 8008572123 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

దినఫలాలు

అదృష్టసంఖ్యలు: 5, 7

మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20): వృత్తి, వ్యాపారాల్లో ఆర్థిక పరిస్థితులను సమీక్షించుకుంటారు. బీమా, గ్రాట్యుటీ, పింఛన్ వ్యవహారాలకు అనుకూలం. క్లెయిములు మంజూరవుతాయి. యోగధ్యానాలపై దృష్టి పెడతారు.

వృషభరాశి: (ఏప్రిల్21-మే20): పందాలు, పోటీల్లో విజయం సాధిస్తారు. ప్రేమానుబంధాలు బలపడతాయి. కొత్త పరిచయాలు లాభిస్తాయి. ప్రియతముల కోసం విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. ఆర్థికపరిస్థితి ప్రోత్సాహకరం.

మిథునరాశి: (మే21-జూన్21): వాయిదా పడుతున్న పనులు పట్టుదలతో పూర్తి చేస్తారు. బదిలీలు, సీట్ల మార్పిడి కోసం చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. హోటల్, క్యాటరింగ్, ఔషధ రంగానికి చెందిన వారికి ప్రోత్సాహకరం.

కర్కాటకరాశి: (జూన్22-జూలై23): విద్యారులు లక్ష్యాలు సాధిస్తారు. చిన్నారులు, ప్రియతముల విషయాల్లో శుభపరిణామాలు సంభవం. పెట్టుబడులకు సంబంధించిన సమాచారం సేకరిస్తారు. ప్రేమలు ఫలిస్తాయి.

సింహరాశి: (జూలై24-ఆగస్ట్23): వాయిదా పడుతున్న ఆర్థిక వ్యవహారాలు ఒక కొలిక్కి వస్తాయి. బదిలీలు, మార్పులకు అనుకూలం. ఇల్లు మార్పు, స్థలసేకరణకు నిధులు సర్దుబాటవుతాయి. గృహరుణాలు మంజూరుకు, వాయిదాల చెల్లింపులకు అనుకూలం.

కన్యారాశి: (ఆగస్ట్24-సెప్టెంబర్23): కాంట్రాక్టులు, అగ్రిమెంట్లు లాభిస్తాయి. సోదరీసోదరుల విషయాలు, ప్రయాణాలు, చర్చలకు అనుకూలం. ఏజెంట్లు, రిప్రజెంటేటివ్‌లు, రవాణా రంగానికి చెందిన వారికి ప్రోత్సాహకరం.

తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23): ఉన్నత విద్య, విదేశీ వ్యవహారాలకు అవసరమైన నిధులు సర్దుబాటవుతాయి. మొండి బకాయిలు వసూలవుతాయి. గతంలో మీరు చేసిన కృషికి ఫలితం అందుకుంటారు. ఫొటోగ్రఫీ, గ్రానైట్, మత్స్య రంగాల వారికి ప్రోత్సాహకరం.

వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22): బంధుమిత్రులతో ఉల్లాసంగా గడుపుతారు. బ్యాంకులు, ఆర్థిక సంస్థలకు సంబంధించిన వ్యవహారాల్లో స్పష్టమైన నిర్ణయానికి వస్తారు. యూనియన్లు, సహకార సంఘాల్లో కీలకపాత్ర పోషిస్తారు.

ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21): పూర్వానుభవంతో వృత్తి, వ్యాపారాల్లో లక్ష్యాలు సాధిస్తారు. ఉన్నత పదవులు అందుకుంటారు. వృత్తిపరమైన చర్చలు, ప్రయాణాలకు అనుకూలం. బంధుమిత్రులతో వేడుకల్లో పాల్గొంటారు.

మకరరాశి(డిసెంబర్22-జనవరి21): బంధుమిత్రుల సహకారంతో ఆర్థికపరమైన లక్ష్యాలు సాధిస్తారు. స్నేహానుబంధాలు విస్తరిస్తాయి. బ్యాంకులు ఆర్థిక సంస్థల నుంచి కీలక సమాచారం అందుకుంటారు. ఆర్థిక విషయాల్లో సంకల్పం నెరవేరుతుంది.

కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18): వృత్తి, వ్యాపారాల్లో ఆర్థికంగా ప్రోత్సాహకరంగా ఉంటుంది. మెడికల్ క్లెయిములు మంజూరవుతాయి. గతంలో మీరు పడిన శ్రమకు ఫలితం అందుకుంటారు. సంస్మరణల్లో పాల్గొంటారు.

మీనరాశి: (ఫిబ్రవరి19మార్చి20): ప్రియతములతో చర్చలు, ప్రయాణాలు ఉల్లాసం కలిగిస్తాయి. కుటుంబ వ్యవహారాలు ఉల్లాసం కలిగిస్తాయి. సమావేశాల్లో గౌరవ మన్ననలు అందుకుంటారు. జనసంబంధాలు విస్తరిస్తాయి.

-బిజుమళ్ళ బిందుమాధవ శర్మ

ఒకే పని.. రెండు సార్లు!

సమన్వయ లోపంతో పెరిగిన వ్యయం



తిరుపతి-రేణిగుంట రోడ్డుపై జోరుగా సాగుతున్న డివైడర్ల తొలగింపు పనులు

తిరుపతి నగరం: ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయలోపానికి తిరుపతి-రేణిగుంట రోడ్డుపై జరుగుతున్న అభివృద్ధి పనులే నిదర్శనం. ఈ రెండు విభాగాలు సమన్వయంతో పనిచేయక పోవడంతో ఎనిమిది నెలల వ్యవధిలో ఒకే పనిని రెండు సార్లు చేయాల్సిన దుస్థితికి తలెత్తింది. ప్రజాధనం వృథా అవుతోంది. నగరంలో జనవరి తొలి వారంలో ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ అసోసియేషన్ (ఇస్కా) సమావేశాల సందర్భంగా రేణిగుంట రోడ్డు అభివృద్ధికి నేషనల్ హైవేస్ లక్షలాది రూపాయలు వెచ్చించాల్సి వచ్చింది. తమిళనాడు నుంచి ఈ మార్గంలోనే తిరుపతికి పెద్ద సంఖ్యలో సందర్శకులు విచ్చేస్తున్న కారణంగా దీన్ని అప్పట్లో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దే ప్రయత్నాలు జరిగాయి. ఈక్రమంలో రోడ్డు మధ్యలో డివైడర్ ఎత్తును పెంచడంతోపాటు, పెయింటింగ్ పనులను చేపట్టింది. హైవే రోడ్డు కావడంతో తిరుపతి నగరపాలక సంస్థ అప్పట్లో దీనిపై దృష్టి పెట్టలేదని సమాచారం. కాగా, తిరుపతి నగర ప్రవేశ మార్గాలను పచ్చదనం ఉండాలని ఇటీవల యంత్రాంగం నిర్ణయించింది. ఇతర ప్రాంతాల నుంచి తిరుపతి నగరానికి విచ్చేసే సందర్శకులకు ఆహ్లాదకర వాతావరణంతో స్వాగతించేలా చర్యలు ప్రారంభించింది. ఇందులో భాగంగా పది రోజుల కిందటే రూ.1.26 కోట్ల వ్యయంతో ఎల్ఈడీ లైట్లతో స్ట్రీట్ లైటింగ్ సిస్టమ్‌ను ప్రారంభించింది. తాజాగా డివైడర్ స్థానంలో సెంట్రల్ మీడియన్‌ను నిర్మించి అందులో పచ్చదనం ఉట్టిపడేలా గడ్డి, పూల మొక్కలను నాటడానికి శ్రీకారం చుట్టింది. డివైడర్ల తొలగింపు పనులు చకచకా పూర్తి చేస్తోంది. సుమారు రూ.40 లక్షల వెచ్చించి సెంట్రల్ మీడియన్లను నిర్మించే పనులను కాంట్రాక్టరకు అప్పగించింది. రోడ్డు మధ్య భాగంలో మీడియన్లను నిర్మించి, పచ్చదనం ఉండేలా మొక్కలను పెంచడం వల్ల సందర్శకులను ఆకర్షించేలా పనులు పూర్తి చేయడానికి యంత్రాంగం చర్యలు చేపట్టింది. చిత్తూరు, కడప, తిరుచానూరు, రాయలచెరువు రోడ్డు ప్రాంతాల నుంచి తిరుపతికి ప్రవేశ మార్గాలు ఉండగా.. రేణిగుంట రోడ్డు మినహా మిగిలిన అన్ని రోడ్లపై తిరుపతి ఎంట్రీ పాయింట్‌లో మీడియన్లు ఉన్నాయి. ఈ కారణంతో రేణిగుంట రోడ్డు హైవేస్‌కు సంబంధించినదైనా..తిరుపతి నగరపాలక సంస్థ సొంత నిధులతో మీడియన్లను నిర్మించడం గమనార్హం.

ఆర్టీసీ డ్రైవర్ల ఆందోళన

5 గంటల పాటు ఆగిన రైల్వేస్టేషన్- తిరుమల బస్సులు



విష్ణునివాసం వద్ద ఆగిన తిరుమల బస్సులు

తిరుపతి (రవాణా): పనిభారం పెరిగిందంటూ అలిపిరి డిపో ఆర్టీసీ డ్రైవర్లు విష్ణునివాసం వద్ద బుధవారం అర్ధరాత్రి నుంచి గురువారం ఉదయం 6 గంటల వరకు బస్సులు నిలిపేసి ఆందోళనకు దిగారు. దీంతో సుమారు 5 గంటల పాటు తిరుపతి రైల్వేస్టేషన్ నుంచి తిరుమల మధ్య ఆర్టీసీ సర్వీసులు నిలిచిపోయాయి. నైట్ అవుట్ డ్యూటీలకు వచ్చినవారు 6 ట్రిప్పులు తిరగాల్సి ఉంటుందని, ఈ ట్రిప్పులు ఆలస్యం కావడంతో పనిభారం పెరుగుతోందని డ్రైవర్లు ఆరోపించారు. ఆర్టీసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కరించకపోవడంతో ఆందోళనకు దిగామన్నారు. ఇందులో భాగంగా ఆర్టీసీ డ్రైవర్లు బుధవారం అర్ధరాత్రి ఒంటి గంట నుంచి గురువారం ఉదయం 6 గంటల వరకు అలిపిరి డిపో బస్సులను విష్ణునివాసంలో నిలిపేసి ఆందోళన చేశారు. చివరికి డిపో మేనేజరు పార్థసారథి విష్ణునివాసం వద్దకు చేరుకుని సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో బస్సులు యథావిధిగా తిరుమలకు వెళ్లాయి.

నంద్యాల సర్వే నివేదిక చంద్రబాబుకు సమర్పణ



చంద్రబాబుతో కుప్పం టీడీపీ నాయకులు

కుప్పం : నంద్యాల ఉప ఎన్నిక సందర్భంగా అక్కడ పార్టీ విజయావకాశాలపై చేసిన సర్వే నివేదికను కుప్పం తెలుగుదేశం నాయకులు గురువారం విజయవాడలో అధ్యక్షుడు చంద్రబాబుకు సమర్పించారు.రెస్కో ఛైర్మన్ పిఎస్.మునిరత్నం, సీఎం వ్యక్తిగత కార్యదర్శి పి.మనోహర్ ఆధ్వర్యంలో సుమారు 15 రోజులపాటు నంద్యాలలో ఎన్నికలకు సంబంధించి అప్పగించిన అంశాలపై సర్వే నిర్వహించారు.18 క్లస్టర్లకు 18 మంది నాయకులను కేటాయించుకుని పని పూర్తి చేశారు.అమరావతిలో గురువారం చంద్రబాబును కలిసి సర్వే నివేదికను సమర్పించారు. కాకినాడ కార్పొరేషన్ ఎన్నికలు జరుగనున్నందున కుప్పం టీడీపీ నాయకులను అక్కడికి వెళ్లి సర్వే నిర్వహించాల్సిందిగా ఆయన ఆదేశించారు.ఎంపీపీ సాంబశివం, శ్రీ ప్రసన్న తిరుపతి గంగమాంబ ధర్మకర్తలమండలి ఛైర్మన్ బిఎంకె.రవిచంద్రబాబు, కుప్పం సర్పంచి డాక్టర్ వెంకటేష్, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ శాంతారాం, గోపీనాథ్, శ్రీనివాసులు, చంద్రశేఖర్, మునిరాజు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వరాహస్వామి జయంత్యుత్సవం

ఆంధ్రజ్యోతి, తిరుమల: తిరుమలలో గురువారం వరాహస్వామి జయంతి ఉత్సవం ఘనంగా జరిగింది. ఇందులో భాగంగా ఉదయం తొలుత భూవరాహస్వామి ఆలయంలో కలశస్థాపన, కలశపూజ, పుణ్యాహవచనం చేశారు. అనంతరం పాలు, పెరుగు, తేనె, చందనం, కొబ్బరినీళ్ల, వివిధ రకాల పండ్లతో తయారుచేసిన పంచామృతంతో వేదోక్తంగా వరాహస్వామికి అభిషేకం నిర్వహించారు. కలియుగ వైకుంఠంగా భాసిల్లుతున్న తిరుమలలో ఆగమ శాస్త్రం ప్రకారం ఏటా వరాహస్వామి జయంతిని టీటీడీ ఘనంగా నిర్వహిస్తోంది. స్థలపురాణం ప్రకారం తిరుమలలో తొలి పూజ, తొలినివేదన వరాహస్వామికే చేస్తారు. భక్తులు ముందుగా భూవరాహస్వామిని దర్శించుకుని ఆ తరువాత శ్రీవారిని దర్శించుకోవడం ఆచారం. ఈ ఉత్సవంలో తిరుమల జేఈవో శ్రీనివాసరాజు, ఆలయ డిప్యూటీఈవో కోదండరామారావు తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టుకు ఎస్వీయూ డీడీఈ

పరీక్షల వ్యవహారం

తెలంగాణలో మాత్రం ప్రైవేట్ కాలేజీల్లో పరీక్షల నిర్వహణకు అనుమతే కారణం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు): ఎస్వీయూనివర్సిటీ దూరవిద్య విభాగం (డీడీఈ) పరిధిలో ఈనెల 28 నుంచి డిగ్రీ, పీజీ పరీక్షలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఏపీలోని అన్ని స్టడీ సెంటర్ల పరీక్షల నిర్వహణ ప్రభుత్వ కాలేజీల్లో జరపాలని వర్సిటీ నిర్ణయించింది. తెలంగాణలోని స్టడీ సెంటర్లకు మాత్రం ప్రైవేట్ కాలేజీల్లో పరీక్షలు నిర్వహించుకునేలా వెసులుబాటు కల్పించింది. దీనిని సవాలు చేస్తూ అనంతపురం జిల్లా ధర్మవరానికి చెందిన ఓ స్టడీ సెంటర్ విద్యార్థులు హైకోర్టును ఆశ్రయించారు. తెలంగాణలో మాత్రం ప్రైవేటు కాలేజీల్లో పరీక్షలు నిర్వహించేలా అనుమతించి.. తాము చదువుకుంటున్న ధర్మవరం కేంద్రంలో కాకుండా అనంతపురంలోని ఓ ప్రభుత్వ కాలేజీలో పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశారని వాపోయారు. విచారించిన హైకోర్టు సదరు స్టడీ సెంటర్ విద్యార్థులను అనంతపురంలో కాకుండా ధర్మవరంలోనే పరీక్షలు నిర్వహించే అవకాశాన్ని కల్పించేలా చర్యలు చేపట్టాల్సిందిగా యూనివర్సిటీ అధికార యంత్రాంగానికి హైకోర్టు సూచించింది. ఈ మేరకు గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.

వేడుకగా శత చండీయాగం



చండీయాగంలో పాల్గొన్న సుధారాణి తదితరులు

తిరుచానూరు: నవ్యాంధ్రప్రదేశ్ ప్రజల అభివృద్ధి, లోక కల్యాణం ఆకాంక్షిస్తూ తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో శాస్త్రోక్తంగా జరుగుతున్న శత చండీయాగం గురువారం రెండవ రోజుకు చేరింది. ఉదయం అన్నపూర్ణేశ్వరి ఉత్సవమూర్తికి నేత్ర పర్వంగా అభిషేకం నిర్వహించారు. అరుణాచల అన్నపూర్ణ ఆశ్రమ పీఠాధిపతి శివానందలహరి స్వామి పర్యవేక్షణలో రుత్వికులు హోమాది పూజలు చేశారు. ఉదయం వేదమంత్రోచ్ఛారణల మధ్య నిత్యార్చనలు, చక్రార్చన, చండీ హోమం గావించారు. నీరాజనం అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం యాగశాలలో చండీ హోమం నిర్వహించారు. ఎటువంటి ప్రవేశ రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని ఉచితంగా దంపతులు పాల్గొనవచ్చని శివానందలహరి తెలిపారు. పూజా సామాగ్రి తామే అందిస్తామన్నారు. శుక్రవారం వరసిద్ధి వినాయక పూజ, చండీ హోమం నిర్వహిస్తామన్నారు. కాగా బుధవారం అర్ధరాత్రి తర్వాత వర్షం రావడంతో యాగం జరిగే ప్రాంతంలో కొంత ఇబ్బంది ఏర్పడింది. టెంట్లు పడిపోయాయి. నిర్వాహకులు వెంటనే వీటిని పునరుద్ధరించడంతో యాగం నిర్విఘ్నంగా సాగింది. టీడీపీ జిల్లా ఆరోగ్య విభాగం అధ్యక్షురాలు డాక్టర్ సుధారాణి, నిర్వాహకులు మదనమోహన్‌నాయుడు, సందీప్, విజయకుమార్ శర్మ, ప్రతాప్ శర్మ పాల్గొన్నారు.

తిరుపతి రైల్వేస్టేషన్‌లో

అధునాతన మెటల్ డిటెక్టర్లు

తిరుపతి (రవాణా): తిరుపతి రైల్వేస్టేషన్‌లో అధునాతన మెటల్ డిటెక్టర్లను ఏర్పాటు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి నిత్యం రైళ్లలో శ్రీవారి దర్శనార్థం భక్తులు తిరుపతికి వస్తుంటారు. వీరికి భద్రత కల్పించడంతో పాటు అక్రమంగా తరలించే వస్తువులను గుర్తించేందుకు వీలుగా రైల్వే అధికారులు వీటిని రైల్వే స్టేషన్ ప్రధాన ద్వారం వద్ద రెండు, వీఐపీ గేటు వద్ద రెండు ఏర్పాటు చేశారు. 250 గ్రాములకు మించి బరువున్న ఎటువంటి మెటల్‌బ్యాగ్స్ తీసుకెళ్లినా ఇవి గుర్తిస్తాయని ఐపీఎఫ్ నాగార్జునరావు తెలిపారు. వీటి పక్కన 400 గ్రాములు పైన బరువున్న మెటల్స్ తీసుకెళ్లినా తక్షణం గుర్తించి పోలీసులను అప్రమత్తం చేస్తాయన్నారు. రైలు ప్రయాణికుల భద్రత దృష్ట్యా ఈ ఆధునిక భద్రత వ్యవస్థ చేపట్టామని, అక్రమంగా బంగారు, వెండి వస్తువులు స్మగ్లింగ్ చేసినా వీటి ద్వారా గుర్తిస్తామని ఆయన తెలిపారు.



తిరుపతి రైల్వే స్టేషన్‌లో ఏర్పాటు చేసిన అధునాతన మెటల్ డిటెక్టర్లు



సిద్ధార్థలో ఫ్రెషర్స్ డే

సిద్ధార్థ ఇంజనీరింగ్ విద్యాసంస్థలు ఫ్రెషర్స్‌డే వేడుకలను ఘనంగా జరుపుకున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వర్చ్యూసా సాఫ్ట్‌వేర్ కంపెనీ సీనియర్ డైరెక్టర్ సురేష్ శ్రీనివాసన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన చదువుతో పాటు సంపాదన, సిద్ధార్థకు అమెరికా అక్రిడిటేషన్, వర్చ్యూసా సాఫ్ట్‌వేర్ కంపెనీ ప్రయోగశాలల ఏర్పాటు వంటి అంశాలపై మాట్లాడారు. అనంతరం కళాశాల చైర్మన్ అశోకరాజు మాట్లాడుతూ ఈ ఫ్రెషర్స్‌డే వేడుకలు సిద్ధార్థ చరిత్రలో ఒక అపురూపమైన ఘట్టమని తెలుపుతూ మొదటి, ద్వితీయ సంవత్సరాల బీటెక్ విద్యార్థులు అవకాశాలను వినియోగించుకుని సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటే వివిధ కంపెనీలను సిద్ధార్థ ప్రాంగణానికి తెచ్చి చక్కని ఉపాధి అవకాశాలను కల్పిస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో డీఎన్‌డీ గ్లోబల్ టెక్ సొల్యూషన్స్ కంపెనీ సీఈవో నాగభూషణ, హైకోర్ సాఫ్ట్‌వేర్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ సీఈవో పద్మనాభం, విద్యార్థులు పాల్గొన్నారు.

- నారాయణవనం



వినాయకుడి విగ్రహాలను కొనుగోలు చేస్తున్న యువకులు

చవితి వేడుకలకు సర్వం సిద్ధం

మదనపల్లెటౌన్: చవితి వేడుకలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. మదనపల్లె పట్టణంలో సుమారు వెయ్యి వరకు వినాయక విగ్రహాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగా చలువ పందిళ్ల నుంచి విగ్రహం, సెట్టింగ్స్‌కు అధిక ప్రాధాన్యం ఇస్తూ అందుకు తగ్గట్టు ఏర్పాట్లు చేశారు. మూడు అడుగుల నుంచి 15 అడుగుల వరకు వినాయక ప్రతిమలు ఏర్పాటు చేస్తున్నారు. అలాగే పండుగ సందర్భంగా అవసరమైన పూజా సామగ్రి కొనుగోలుకు చిత్తూరు బస్టాండు, బెంగళూరు బస్టాండు, వారపుసంత, నీరుగట్టువారిపల్లె, ఎన్టీఆర్ సర్కిల్ తదితర ప్రాంతాల్లో పూజా సామగ్రి, వినాయక ప్రతిమలు అమ్మకాలు చేపట్టారు. పెద్దసంఖ్యలో ప్రజలు పూజా సామగ్రి కొనుగోలుకు తరలిరావడంతో ఈ ప్రాంతాలు కిటకిటలాడాయి. బెంగళూరు బస్టాండులో పూల దుకణాలు అమ్మకం, కొనుగోలు దారులతో సందడిగా మారింది. పండుగ సందర్భంగా పూల ధరలకు రెక్కలొచ్చాయి. స్థానిక సుబ్బారెడ్డి లేఅవుట్‌లోని సత్యసాయి ధ్యానమండలి ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమలను 300మందికి పంపిణీ చేశారు. బీజేవైఎం ఆధ్వర్యంలో వంద మందికి ఉచితంగా మట్టి వినాయక ప్రతిమలను అందజేశారు. ఈ సందర్భంగా సత్యసాయి ధ్యాన మండలి సభ్యులు శోభారాణి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా తమ వంతుగా ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్, వివిధ రసాయనాలు కలిపిన రంగులతో ఉన్న వినాయకుడిని నీటిలో నిమజ్జనం చేయడం ద్వారా ఎదురయ్యే విపత్కర పరిస్థితులపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు సత్యసాయి ధ్యానమండలి ఆధ్వర్యంలో ఉచితంగా గత ఐదు సంవత్సరాలుగా మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు.





కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న పూలమార్కెట్, మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్న సత్యసాయి ధ్యానమండలి నిర్వాహకులు

చోరీకేసులో నిందితుడికి జైలు



నిందితుడిని సబ్‌జైలుకు తరలిస్తున్న పోలీసులు

మదనపల్లె అర్బన్: చోరీకేసులో నిందితుడికి నాలుగు నెలలు జైలుశిక్షను విధిస్తూ స్థానిక జూనియర్ సివిల్ జడ్జి జియావుద్దీన్ గురువారం తీర్పునిచ్చారు. ఏపీపీ రామకృష్ణ కథనం మేరకు.. మదనపల్లె పట్టణం దిగువ కురవంకకు చెందిన ఎమ్.దామోదర్, అతని స్నేహితుడు పట్టణంలోని నిమ్మనపల్లె క్రాస్ ఏరియాకు చెందిన బావాజాన్ అలియాస్ ఇమ్రాన్ 2010మార్చి 21న పట్టణంలోని సొసైటీ కాలనీకి చెందిన శ్రీరాములురెడ్డి ఇంట్లోకి చొరబడి రూ.1.80లక్షలు విలువ చేసే బంగారు ఆభరణాలు, నగదు చోరీ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు వన్ టౌన్ పోలీసులు కేసునమోదు చేసి నిందితులను రిమాండుకు తరలించారు. కాగా ఈ కేసులో ప్రధాన నిందితుడైన బావాజాన్ అలియాస్ ఇమ్రాన్ కోర్టు వాయిదాలకు హాజరుకాకుండా పరారీలో ఉన్నాడు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన న్యాయమూర్తి దామోదర్‌పై నేరం రుజువుకావడంతో నాలుగు నెలలు జైలుశిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారు. వన్ టౌన్ పోలీసులు నిందితుడిని సబ్‌జైలుకు తరలించారు.

యువకుడి ఆత్మహత్య

మదనపల్లె అర్బన్: భార్యతో గొడవపడి మనస్తాపం చెందిన ఓ యువకడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం మదనపల్లెలో చోటు చేసుకుంది. పట్టణంలోని చీకిలిగుట్ట గౌతమీనగర్‌కు చెందిన మొరుపూరి చిన్నరెడ్డెప్ప(35)టెంపో డ్రైవర్‌గా పని చేస్తుండేవాడు. ఇతడికి భార్య గౌరి, ఏడాది వయసు గల కుమారుడు ఉన్నాడు. ఈ నేపథ్యంలో భార్యాభర్తలు బుధవారం రాత్రి కుటుంబ సమస్యలపై గొడవపడ్డారు. భర్తపై అలిగిన గౌరి తన కుమారుడిని తీసుకుని అదేవీధిలో నివాసముంటున్న పిన్నమ్మ రెడ్డెమ్మ ఇంటికెళ్లింది. గురువారం ఉదయం ఇంటివద్దకెళ్లి చూడగా తలుపుకు గడియపెట్టి ఉంది. అనంతరం వారు కిటికీలో చూడగా చిన్నరెడ్డెప్ప ఇంట్లోని ఇనుప పైపుకు వేళాడుతూ కన్పించాడు. స్థానికులు తలుపు గడియ తొలగించి చూడగా, అప్పటికే అతడు మృతిచెంది ఉన్నాడు. టూటౌన్ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధం: వైసీపీ

మదనపల్లె రూరల్: మదనపల్లె మున్సిపాలిటీలో జరిగిన అభివృద్ధిపై చర్చకు సిద్ధమని వైసీపీ ఎస్సీ విభాగం పట్టణాధ్యక్షుడు అంబేడ్కర్ చంద్రశేఖర్ స్పష్టం చేశారు. గురువారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మున్సిపల్ ఛైర్మన్ కొడవలి శివప్రసాద్ చెప్పినట్లు ఎక్కడా అభివృద్ధి జరగలేదన్నారు. దళితులు నివశించే ప్రాంతాల్లో అభివృద్ధి పనులు ఒక్కటి కూడా చేయలేదన్నారు. మూడేళ్ల పాలనలో ప్రజాధనం దుర్వినియోగం చేసి ఛైర్మన్ ఛాంబర్‌ను అలంకరించుకున్నారని తప్పుబట్టారు. నీతి నిజాయితీతో పనిచేస్తున్న ఎమ్మెల్యే దేశాయ్ తిప్పారెడ్డిని విమర్శించే స్థాయి మున్సిపల్ ఛైర్మన్ కు లేదన్నారు. మాజీ కౌన్సిలర్ పూజారి రమేష్ మాట్లాడుతూ పట్టణంలో వెనుబడిన రెండో వార్డులో ఇంత వరకు మురుగునీటి కాలువలు నిర్మించలేదన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వైసీపీ నాయకులు

అభివృద్ధి చేశామని చెబుతున్న మున్సిపల్ ఛైర్మన్ ఒక్కసారి తమ వార్డుకు వస్తే ఏమాత్రం అభివృద్ధి చేశారో బయటపడుతుందన్నారు. బహిరంగ చర్చకు సవాల్ విసురుతున్న ఛైర్మన్ రెండోవార్డులో చర్చకు సిద్ధమేనా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో వైసీపీ మహిళా విభాగం జిల్లా ఉపాధ్యక్షురాలు రోలింగ్ మల్లిక, నాయకులు ఈశ్వర్, మోహన తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల అభివృద్ధికి కృషి



ప్రమాణస్వీకారం చేస్తున్న ఆర్యవైశ్య సంఘ కమిటీ సభ్యులు

మదనపల్లెటౌన్: ఆర్యవైశ్యుల అభివృద్ధికి కృషి చేస్తానని ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షుడు పూనగంటి ఓంప్రకాష్ పేర్కొన్నారు. స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయంలో గురువారం ఆర్యవైశ్య సంఘం నూతన కమిటీ ప్రమాణస్వీకార మహోత్సవం నిర్వహించారు. అధ్యక్షుడిగా ఓంప్రకాష్, ఉపాధ్యక్షులుగా పంచరత్న నవీన్, కార్యదర్శిగా దేవతా సతీష్‌బాబు, కోశాధికారిగా సూరే గిరిధర్ కమిటీ సభ్యులుగా ప్రమాణస్వీకారం చేశారు. ఓంప్రకాష్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన ప్రత ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఎంతో బాధ్యతగా వ్యవహరిస్తూ ఆర్యవైశ్యుల అభివృద్ధి, వ్యాపార పరంగా ఎదురవుతున్న ఇబ్బందుల పరిష్కారానికి తన వుంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ములకలచెరువు విద్యార్థులు



ప్రతిభ చూపిన విద్యార్థులతో హెచ్‌ఎం రషీదాబాను

ములకలచెరువు: రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ములకలచెరువు జడ్పీహైస్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. ఈనెల 22న పూతలపట్టులో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో సబ్‌జూనియర్స్ విభాగం సాఫ్ట్‌బాల్‌లో 9వ తరగతి విద్యార్థులు మనోజ్‌కుమార్, ప్రసన్న ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. సెప్టెంబర్ 1నుంచి 3వ తేదీ వరకు ప్రకాశం జిల్లా ఒంగోలులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ఇద్దరు విద్యార్థులు పాల్గొననున్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను హెచ్ ఎం రషీదాబాను, పీఈటీ లీలాప్రభ అభినందించారు.

సిమెంటు రోడ్ల నిర్మాణంలో నాణ్యత పాటించాలి



సిమెంటురోడ్డుకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే తిప్పారెడ్డి

మదనపల్లె రూరల్: సిమెంటురోడ్ల నిర్మాణంలో నాణ్యత పాటించాలని ఎమ్మెల్యే దేశాయ్ తిప్పారెడ్డి అన్నారు. మండలంలోని వేంపల్లె పంచాయతీ గుట్టకిందపల్లెలో గురువారం ఎంపీ నిధులతో నిర్మిస్తున్న సిమెంటు రోడ్డు పనులకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదికాలాల పాటు సిమెంటురోడ్లు వుండేలా నిర్మించాలని నాయకులకు సూచించారు. అవసరమైన చోట్ల మురుగునీటి కాలువలు నిర్మాణానికి నిధులు కేటాయిస్తామన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ భాస్కర్, వైసీపీ నాయకులు జగన్నాథరెడ్డి, రామిరెడ్డి, లోకేష్‌రెడ్డి, గోపాల్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యాలయానికి భూమిపూజ

మదనపల్లె: పట్టణంలోని సొసైటీకాలనీలో తంబళ్లపల్లె ఎమ్మెల్యే శంకర్ తెలుగుదేశం పార్టీ కార్యాలయానికి గురువారం భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే సొంత నిధులతో పార్టీ కార్యాలయంతో పాటు నివాస గృహాన్ని నిర్మిస్తున్నారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య భూమిపూజ చేసి లాంఛనంగా పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి జ్యోతి, కుమారుడు శ్రీకాంత్ , ఆనంద్, సుధాకర్, చంద్రతో పాటు టీడీపీ నాయకులు మల్లికార్జున నాయుడు, మండల తెలుగు యువత అధ్యక్షుడు మైసూర్ శ్రీనివాస్ యాదవ్, తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన పార్టీ అధ్యక్షులు ప్రసాద్, భాస్కర్, సురేంద్ర, త్యాగరాజు, నారాయణస్వామిరెడ్డి, రాము, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గౌరీదేవి వ్రతం

ములకలచెరువు: మండల కేంద్రంలో మహిళలు మంగళ గౌరీవ్రతాన్ని గురువారం భక్తిశ్రద్ధలతో ఆచరించారు. ఈసందర్భంగా అష్టోత్తరం, సహస్త్రనామావలి తదితర కార్యక్రమాలు జరిగాయి. కార్యక్రమంలో భక్తులు విజయలక్ష్మి, శారదమ్మ, శాంతమ్మ, అన్నపూర్ణమ్మ, ఆదిలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం: ముగ్గురి అరెస్టు

ములకలచెరువు: పెద్దమండ్యం, ములకలచెరువు మండలాల్లోని బెల్టుషాపులపై గురువారం దాడులు చేసి మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకోవడంతో పాటు ముగ్గరిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ భార్గవ్‌రెడ్డి తెలిపారు. ములకలచెరువు మండలంలోని చౌడసముద్రంలోని బెల్టుషాపుపై దాడి చేసి ఏడు మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని నిర్వాహకుడు అంజనప్పను అరెస్టు చేసినట్లు చెప్పారు. అలాగే పెద్దమండ్యం మండలంలో కత్తేనాయక్ తాండా, చదివేవాండ్లపల్లెలోని బెల్టుషాపుపై దాడులు నిర్వహించి 18మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని నిర్వాహకులు కృష్ణానాయక్, నరసింహులు నాయక్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

20 లీటర్ల సారా స్వాధీనం

వాల్మీకిపురం: కలికిరి మండలం గోళ్లతోపువడ్డెపల్లెకు చెందిన రాము ద్విచక్రవాహనంలో సారా తరలిస్తుండగా మేడికుర్తి క్రాస్‌వద్ద దాడిచేసి అరెస్టు అరెస్టు చేసి అతని నుంచి 20లీటర్ల సారా, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ ధీరజ్‌రెడ్డి తెలిపారు.

జంతుశాస్త్ర అధ్యాపక పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

పుంగనూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాలలో జంతుశాస్త్ర అధ్యాపక పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎల్‌వీ. రమణారెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ పదవీ విరమణ పొందిన జంతుశాస్త్ర అధ్యాపకులు, ఎంఎస్సీ జంతుశాస్త్రంలో 50శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులన్నరు. ఈ నెల 28 తేదీ 10 గంటలకు కళాశాల ఆవరణలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.10 వేలు వేతనం చెల్లించడం జరుగుతుందన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని కూలీ మృతి

సోమల: సోమల - సదుం ప్రధాన రహదారిలోని అభయాంజనేయస్వామి ఆలయ సమీపంలో బుధవారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని కూలీ మృతి చెందాడు. సోమల మండలం చిన్నఉప్పరపల్లె పంచాయతీ గాంధీనగర్‌కు చెందిన కృష్ణప్ప(50) కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆరు నెలల క్రితం స్థానికంగా పనులు లేకపోవడంతో బెంగళూరుకు వలస వెళ్లాడు. కొద్ది రోజుల క్రితం స్వగ్రామం చేరుకున్నాడు. బుధవారం సోమల నుంచి సదుం మార్గంలో నడిచి వెళుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సునందిని పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

చౌడేపల్లె: సునందిని పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారి దినేశ్‌రెడ్డి కోరారు. గురువారం ఆయన మాట్లాడుతూ సునందిని పథకం ద్వారా 3నుంచి 6నెలల వయస్సు గల పేయ దూడలకు బీమా సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పించిందన్నారు. ఒక్క దూడకు రూ.1675 చెల్లిస్తే 32 నెలల వరకు గడువుంటుందని, బీమా చేయించుకున్న రైతులకు నట్టల నివారణ మందు, కాల్షియం, లివర్, విటమిన్ టానిక్‌తో పాటు 240కిలోల దాణాను అందివ్వడం జరుగుతుందన్నారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

పుంగనూరు రూరల్: స్థానిక మైనారిటీ ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ సూర్యప్రకాశ్ కోరారు. మోటర్ మెకానిక్, ఫిట్టర్, డీజల్ మెకానిక్, వెల్డర్ గ్రూపుల్లో ఖాళీలు ఉన్నట్లు ఆయన తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ఈనెల 28 తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. 30న ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు.

అంతటా చవితి సందడే

పుంగనూరు రూరల్: వినాయక చవితి పండుగ సందర్భంగా గురువారం పుంగనూరులో సందడి నెలకొంది. పండుగకు అవసరమైన వస్తువులు కొనుగోలు చేసేందుకు ప్రజలు ఉత్సాహం చూపారు. వినాయక చవితి సందర్భంగా ప్రత్యేకంగా పండుగ సంతను ఏర్పాటు చేయడంతో తాజా పండ్లు, పూలు, కూరగాయలు, పూజాసామగ్రి ధరలు ఆకాశాన్నంటాయి. పూలు కిలో ధర రూ.80 పలికింది. అరటి పిలకలు రెండు రూ.30, ఎలక్కాయ ఒకటి రూ.5నుంచి రూ.10 వరకు పలికాయి. పట్టణంలోని గోకుల్ సర్కిల్, బస్టాండు, ఇందిరా సర్కిల్, బజారువీధి, నాగపాళ్యం, వారపుసంత తదితర ప్రాంతాల్లో దుకాణాలు ఏర్పాటు చేయడంతో జనం కిక్కిరిశారు. రైతులు, చిన్న వ్యాపారులు రోడ్లపైన తోపుడు బండ్లపై వివిధ సైజుల్లో వినాయక ప్రతిమలను విక్రయాలు చేపట్టారు. పిల్లలు వినాయక ప్రతిమలను కొనుగోలు చేశారు. ప్రధాన మార్గాల్లో పండుగ వస్తువులు, వినాయక ప్రతిమలు అమ్మకాలుకు ఉంచడంతో రద్దీ భారీగా పెరిగి పలుమార్లు ట్రాఫిక్ అంతరాయం కలిగింది. జనం పండుగసంబరాల్లో మునిగితేలుతున్నారు.


అమ్మకాలకు సిద్ధంగా ఉన్న వినాయక ప్రతిమలు

మునివెంకటప్ప సేవలు ఆదర్శనీయం

పుంగనూరు/చౌడేపల్లె: దివంగత ఐఏఎస్ అధికారి మునివెంకటప్ప సేవలు అందరికీ ఆదర్శనీయమని లిడ్‌క్యాప్ మాజీ ఛైర్మన్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్.రెడ్డెప్ప అన్నారు. గురువారం పుంగనూరు అంబేడ్కర్ విగ్రహం ఎదుట దివంగత మునివెంకటప్ప మూడో వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన కుమార్తె, ఆర్థికశాఖ ప్రత్యేక కార్యదర్శి హేమ మాట్లాడుతూ పేదల కోసం తన తండ్రి మునివెంకటప్ప అనేక సంక్షేమ పథకాలు తీసుకొచ్చారని అన్నారు. కార్యక్రమంలో మునివెంకటప్ప కుటుంబీకులు, ఎల్లమ్మ, అమరేష్, టీటీడీ విజిలెన్స్ సీఐ సుకుమార్‌బాబు, జడ్పీటీసీ వెంకటరెడ్డియాదవ్, అత్రపాల్, జెవీ.నాగరాజ, రమణ, మునిరత్నం, రెడ్డెప్ప, శ్రీనివాసులు, రెడ్డెమ్మ తదితరులు పాల్గొన్నారు. ● చౌడేపల్లె మండలం పుదిపట్ల ఉన్నత పాఠశాలలో మునివెంకటప్ప వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు.


మునివెంకటప్ప చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

అనంతరం జరిగిన సమావేశంలో ప్రొఫెసర్ గాంధీ వెంకటరెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఐఏఎస్ మునివెంకటప్పను ఆదర్శంగా తీసుకుని తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచిపేరు తీసుకురావాలని అన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వేదవతి, బ్యాంక్ రెడ్డెప్ప, శ్రీరాములు, లాజర్, బీఎస్ఎన్ఎల్ శ్రీరాములు, రెడ్డెప్ప, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన సేవలందించండి

సదుం: రోగులకు మెరుగైన సేవలందించాలని డీసీహెచ్ఎస్ సరళమ్మ వైద్య సిబ్బందిని ఆదేశించారు. గురువారం స్థానిక ప్రభుత్వ వైద్యశాలను తనిఖీ చేసిన ఆమె ఆస్పత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలను, సిబ్బంది హాజరు పట్టికను, రికార్డులను పరిశీలించారు. సిబ్బంది సమయపాలన పాటించాలని, సి గ్రేడులో ఉన్న ఆస్పత్రి స్థాయిని బి గ్రేడుకు తీసుకురావాలని సూచించారు. ఇన్ పేషంట్ బెడ్స్, ల్యాబ్‌గది మరమ్మతులకు సూచనలు చేశారు. ఎమ్మార్ టీకా వ్యాక్సినేషన్‌పై సిబ్బందికి అవగాహన కల్పించారు. ఆస్పత్రి భవన మరమ్మత్తు పనులను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా క్వాలిటీ అస్యూరెన్స్ కన్సల్టీస్ డాక్టర్ నిరంజన్‌రెడ్డి, వైద్యాధికారి రూపానంద్, వైద్యులు శ్రీధర్‌బాబు, అజిత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బ్యాంకు రుణాలను సకాలంలో చెల్లించండి


రుణమేళాలో మాట్లాడుతున్న రామకృష్ణమరాజు

పుంగనూరు: లబ్ధిదారులు తీసుకున్న బ్యాంకు రుణాలను సకాలంలో చెల్లించినప్పుడే ఇతరులకు రుణ అవకాశం వస్తుందని పుంగనూరు ఇండియన్ బ్యాంక్ మేనేజర్ ముసలయ్య అన్నారు. గురువారం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో రుణమేళాలో నిరుద్యోగ యువతీ, యువకులకు బ్యాంకు, మున్సిపల్ అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ రుణాలు తీసుకున్న వారు తిరిగి చెల్లించకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు. టీడీపీ నాయకుడు రామకృష్ణమరాజు మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం నిరుద్యోగుల కోసం అనేక పథకాలు అమలుచేస్తోందని వాటిని సద్విని యోగం చేసుకోవాలని సూచించారు. వివిధ కార్పొరేషన్ల రుణాల కోసం 1600 దరఖాస్తులు రాగా 916మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. సమావేశంలో మున్సిపల్ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు ఎస్.షరీఫ్, పీవో మధు సూదన్‌రెడ్డి, వివిధ బ్యాంకుల అధికారులు, కౌన్సిలర్లు ఇనాయితుల్లా, రేష్మా, నయాజ్, కుమార్‌రాజా, టీడీపీ నాయకులు ఖలీల్, కేశవమూర్తి, దినేశ్, మున్సిపల్ అధికారులు వెంకట్రామయ్య, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

ఉలవల కోసం రైతుల క్యూ


ఉలవల కోసం క్యూలో ఉన్న రైతులు

పుంగనూరు రూరల్: ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తున్న ఉలవ విత్తనాల కోసం రైతులు పోటీపడ్డారు. భారీ సంఖ్యలో రైతులు గురువారం ఉదయాన్నే పుంగనూరులో వ్యవసాయ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. అధికారులు ఉదయం 10గంటలకు రావడంతో రైతులు ఒక్కసారిగా కార్యాలయంలోకి ప్రవేశించడంతో తోపులాటలు జరిగాయి. రైతులకు అవసరమైన మేరకు ఉలవలు అందజేస్తామని ఏవో జ్యోతి చెప్పడంతో కొంత ప్రశాంతత నెలకొంది. అనంతరం జడ్పీటీసీ వెంకటరెడ్డి యాదవ్ రైతులకు ఉలవలను పంపిణీ చేశారు. కార్యక్రమం వైస్ ఎంపీపీ రామచంద్రారెడ్డి, ఏవో జ్యోతి, రైతులు పాల్గొన్నారు. ● రామసముద్రం మండలానికి 5కిలోల బ్యాగులు 200 వచ్చాయి. గురువారం ఉదయం రైతులు ఒక్కసారిగా కార్యాలయానికి చేరుకోవడంతో గందరగోళం ఏర్పడింది. ఉలవలు తీసుకుంటే ఇన్‌పుట్ సబ్సిడీ రాదనే ప్రచారం రైతుల్లో చెలరేగగా ఒక్కసారిగా కార్యాలయం వద్ద జనం ఖాళీ అయ్యారు. ఈ విషయంపై ఏడీఏ శివకుమార్‌ను విచారించగా అలాంటిదేమి లేదన్నారు. ● సోమల వ్యవసాయ కార్యాలయంలో 5 టన్నుల ఉలవలను రాగా రైతుకు 10 కిలోల చొప్పున పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు యధుశేఖర్‌నాయుడు, ఏవో షణ్ముగం, టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రహ్మణ్యంనాయుడు, సర్పంచ్‌లు హరిప్రసాద్, శ్రీనివాసులునాయుడు, రెడ్డెమ్మ, మునిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

దళితుల భూ సమస్యల పరిష్కారంలో జాప్యం తగదు

సదుం: దళితుల భూ సమస్యల పరిష్కారంలో జాప్యం తగదని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు, ఆలిండియా ఎస్సీ, ఎస్టీ ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మునస్వామి అన్నారు. గురువారం దళిత సంఘ నాయకులతో సమావేశమైన ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని పలువురు దళితులు సుదీర్ఘ కాలంగా భూ సమస్యల పరిష్కారానికి అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తుండటం బాధాకరమన్నారు. భూ సమస్యల పరిష్కారంపై సంబంధిత అధికారులు తక్షణమే స్పందించాలని కోరారు. దళితుల భూ సమస్యలపై తహసీల్దారు హనుమానాయక్‌కు వినతి పత్రం అందజేశారు. బాధిత దళితుల ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని ఎస్ఐ నాగరాజుకు విజ్ఞప్తి చేశారు.


భూ సమస్యలపై తహసీల్దారు హనుమానాయక్‌తో చర్చిస్తున్న మునస్వామి తదితరులు

కార్యక్రమాల్లో డాక్టర్ వజ్రవేలు, పట్టాభి, వెంకటరత్న, వసంతకుమార్, సీతాపతి తదితరులు పాల్గొన్నారు.

కొత్త పింఛన్ విధానాన్ని రద్దు చేయండి

రామసముద్రం: కొత్త పింఛన్ విధానాన్ని రద్దుచేసి పాత విధానాన్ని అమలు పరచాలని సీపీఎస్ రాష్ట్ర నాయకులు రంజిత్‌కుమార్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయం ఎదుట మధ్యాహ్న విరామ సమయంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయవాడలో సెప్టెంబర్ 1న జరిగే మిలియన్ మార్చ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని అన్ని శాఖలు సీపీఎస్ ఉద్యోగులు స్వచ్ఛందంగా తరలిరావాలని కార్యక్రమంలో సంఘ నాయకులు అయూబ్, శివశంకర్, మురళి, సీపీఎస్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

వెంకటేశ్వర	అర్జున్‌రెడ్డి
తాజ్‌మహల్	జయ జానకి నాయక
గోకుల్	వివేకం
ఎంఎస్ఆర్	విఐపి 2

ఎమ్మార్ టీకా పంపిణీపై విచారణ

కేవీబీపురం: మండలంలోని కోవనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఎమ్మార్ టీకాల పంపిణీపై ఢిల్లీ నుంచి వచ్చిన వైద్యుడు పంకజ్ గురువారం విచారణ చేపట్టారు.ఈ సందర్భంగా ఆయన ఎమ్మార్ టీకాల విషయమై కొత్తూరు, తిమ్మసముద్రం, రాజులకండ్రిగ పాఠశాలల విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలల్లో ఈ టీకాలు వేస్తున్నారా, లేదా, వేయనివారికి ఎప్పుడు వేస్తారు అనే వివరాలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో సీహెచX వో రామారావు, ఏఎనX ఎంలు తదితరులు పాల్గొన్నారు.



టీకాపై విద్యార్థిని అడిగి తెలుసుకుంటున్న పంకజ్







వినాయక ప్రతిమలను తీసుకెళుతున్న కేవీబీపురం, తొట్టంబేడు మండలం కంచనపల్లె యువత - వరదయ్యపాళెంలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న ప్రతిమలు

పూజలకు తరలుతున్న పార్వతీ పుత్రుడు

కేవీబీపురం: మండలంలోని గ్రామాల్లో వినాయక చవితి పండుగ వాతావరణం నెలకొంది. గ్రామాలలో వినాయక ప్రతిమలను ప్రతిష్ఠించేందుకు గ్రామస్థులు, యువత పోటీలు పడి భారీ ప్రతిమలను పట్టణాల నుంచి తీసుకెళుతున్నారు. పెద్ద ఎత్తున చవితి వేడుకలు నిర్వహించనున్నారు.

వరదయ్యపాళెం: మండలంలో చవితి సంబరాల హడావుడి గురువారం నుంచే మొదలైంది. వరదయ్యపాళెంలో బస్టాండ్, కళ్యాణ వేంకటేశ్వరాలయం, గంగమిట్ట, చెంగాళమ్మగుడి పరిసరాల్లో విగ్రహాల ప్రతిష్ఠకు ఏర్పాట్లు చేస్తున్నారు. మార్కెట్లో పూజ సామగ్రి విక్రయాలు జోరందుకున్నాయి.



బీఎనX కండ్రిగలో వినాయకచవితికి వెలసిన దుకాణాలు

తొట్టంబేడు: మండలంలోని యువత శ్రీకాళహస్తి పట్టణంలో కొనుగోలు చేసిన భారీ వినాయక ప్రతిమలను గురువారం వాహనాలలో గ్రామాలకు తరలించారు. మండలంలోని యువకులు శ్రీకాళహస్తి, తిరుపతి, నాయుడుపేట ప్రాంతాల నుంచి పోటీపడి భారీ వినాయక ప్రతిమలను ప్రతిష్ఠించడానికి ఏర్పాట్లు చేస్తుండడంతో గ్రామాల్లో వినాయక చవితి సందడి నెలకొంది.

బుచ్చినాయుడుకండ్రిగ: స్థానిక ప్రధాన రహదారి పక్కన వినాయకచవితి సందర్భంగా గురువారం పెద్దఎత్తున దుకణాలు వెలశాయి. వివిధ పరిమాణాల్లో వినాయక విగ్రహాలు, పత్రి, పూలు, పండ్లు తదితర పూజా సామగ్రిని వ్యాపారులు విక్రయాలకు సిద్ధం చేశారు. దీంతో కొనుగోలుదారులతో బజార్లు కిక్కిరిశాయి.

మట్టి ప్రతిమలు పూజిద్దాం... ప్రకృతిని రక్షిద్దాం

ఏర్పేడు: వినాయక చవితి సందర్భంగా ప్రజలందరూ మట్టి వినాయకుడి ప్రతిమలను పూజించి పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని ఏర్పేడు ఎస్ఐ వెంకటరమణ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ పర్యావరణానికి హాని కలిగించే రసాయనిక పదార్థాలతో చేసిన ప్రతిమలను ఉపయోగించరాదని సూచించారు.భక్తులు వినాయక ప్రతిమలను నదులు, చెరువులలో నిమజ్జనం చేసేటపుడు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్ఐ విజ్ఞప్తి చేశారు.

విద్యతో పేదరిక నిర్మూలన సాధ్యం



బ్యాగులను పంపిణీ చేస్తున్న విజయకుమార్

ఏర్పేడు: విద్యతో పేదరికాన్ని నిర్మూలించడం సాధ్యమని ప్రముఖ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మర్రివాగు విజయకుమార్ పేర్కొన్నారు. గురువారం ఆయన తన భార్య స్వర్గీయ భాను జన్మదినం సందర్భంవగా ప్రగతి స్వచ్ఛంద సంస్థ సహకారంతో మండలంలోని బండారుపల్లె జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బ్యాగులు, పుస్తకాలు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ పేదవాడైన తాను చదువుకుని సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అయ్యానన్నారు. అలాగే పేదరిక నిర్మూలనకు ప్రతి విద్యార్థి చక్కగా చదువుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో హెచX ఎంలు రామచంద్రనాయుడు, వెంకటరమణ, ప్రగతి సంస్థ డైరెక్టర్ రమణ, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి రుణాల ఇంటర్వ్యూలకు స్పందన

ఏర్పేడు: ఎస్సీ, ఎస్టీ, బీసీ తదితర కార్పొరేషన్ల ద్వారా స్వయం ఉపాధి రుణాలకు దరఖాస్తు చేసుకున్న వారికి ఏర్పేడు మండల పరిషతX కార్యాలయంలో గురువారం కూడా ఇంటర్వ్యూలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో చిన్నరెడ్డెప్ప, ఎంపీపీ నాగరాణి, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు. కాగా, పాపానాయుడుపేటలోని ఆంధ్రా బ్యాంకు, సప్తగిరి గ్రామీణ బ్యాంకు, రేణిగుంట ఐవోబీ, పల్లం గ్రామీణ బ్యాంకు, ఏర్పేడు గ్రామీణ బ్యాంకుల పరిధిలోని అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. రుణాలకు మొత్తం 400 మంది దరఖాస్తు చేసుకోగా, 230 మంది మాత్రమే ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ నీలకంఠేశ్వరరెడ్డి, వివిధ శాఖల బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

కేవీబీపురం: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం కూడా కార్పొరేషనX రుణాలకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎక్కువ మంది అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరు కావడంతో ముందుగానే అభ్యర్థులందరికీ ఒకేసారి తగిన సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో సీతారామయ్య, శ్రీకాళహస్తి,కేవీబీపురంలోని సప్తగిరి గ్రామీణ బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

నిరుద్యోగులను ఆదుకోవడమే లక్ష్యం

బుచ్చినాయుడుకండ్రిగ: నిరుద్యోగులను ఆదుకోవడానికే ప్రభుత్వం వివిధ కార్పొరేషన్ల ద్వారా రుణాలు అందింస్తోందని ఎంపీపీ ఇందిర తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, కాపు, మైనారిటీ తదితర కార్పొరేషన్ల ద్వారా రుణాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఇంటార్వ్యూలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ విజయకుమారి, సప్తగిరి గ్రామీణ బ్యాంకు మేనేజర్ వివేకానంద్, స్టేట్ బ్యాంకు మేనేజర్ రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పవార్ జన్మదినం



వేడుకల్లో పాల్గొన్న పవార్ తదితరులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తలమండలి మాజీ చైర్మనX శాంతారాం పవార్ జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ది స్కూల్ ఆవరణంలో కేక్ కట్ చేసి ఉపాధ్యాయులకు, విద్యార్థులకు పంచిపెట్టారు. శాంతారాం పవార్‌కు పలువురు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో హెచX ఎం విశాల, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు వినాయకచవితి శుభాకాంక్షలు



పొన్నారావు

ఏర్పేడు: మండల ప్రజలకు టీడీపీ మండలాధ్యక్షుడు నైనారు పొన్నారావు వినాయకచవితి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రజలందరూ చవితి పండుగను ఘనంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.



రామాంజుల నాయుడు

కేవీబీపురం: మండలంలోని ప్రజలందరూ శాంతి, సంతోషాలతో సుభిక్షంగా ఉండాలని ఏఎంసీ చైర్మనX రామాంజుల నాయుడు అన్నారు. వినాయక చవితి సందర్భంగా మండల ప్రజలందరికీ ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు.

అందరికీ మేలుచేయడమే టీడీపీ లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిత్య

కేవీబీపురం: ప్రజలందరికీ మేలు చేయడమే టీడీపీ లక్ష్యమని ఎమ్మెల్యే తలారి ఆదిత్య అన్నారు.సత్యవేడు నియోజకవర్గానికి చెందిన 7 మండలాల పార్టీ ఎంపీపీలు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలతో గురువారం కేవీబీపురంలో సమన్వయ కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు.ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలందరూ ఆర్థికంగా ఎదగడానికి ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. ఆ పథకాలను పేదలకు సక్రమంగా అందే విధంగా చూడటమే కార్యకర్తలు లక్ష్యమన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదగడానికి వడ్డీ లేని రుణాలు అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. పలు కార్పొరేషన్ల ద్వారా రుణాలు కూడా అందిస్తున్నట్లు ఆయన చెప్పారు. వీటిని ప్రజలందరూ సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ విజయానికి కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. మార్కెట్ కమిటీ చైర్మనX రామాంజుల నాయుడు,వైస్ ఎంపీపీ కిరణ్‌యాదవ్, నేతలు మునస్వామి యాదవ్, గోపిరెడ్డి, కిషోర్ రెడ్డి, రామచంద్రయ్య, పలువురు సర్పంచX లు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ బాలికల హాస్టల్ పరిశీలించిన ఎస్ఐ

బుచ్చినాయుడుకండ్రిగ: స్థానిక ఎస్సీ బాలికల హాస్టల్‌ను ఎస్ఐ రామమోహనX గురువారం పరిశీలించారు. హాస్టల్ పరిసరాలను పరిశీలించి విద్యార్థుల రక్షణ, వసతులపై ఆరా తీశారు. ఈసందర్భంగా విద్యార్థినులు దోమలు ఎక్కువగా ఉన్నాయని ఎస్ఐ దృష్టికి తెచ్చారు. స్పందించిన ఎస్ఐ ప్రతి గది కిటీకీలకు దోమల రాకుండా నెట్‌లు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వార్డెనX హేమలత పాల్గొన్నారు.

కాగా, మండలంలో వినాయక చవితి వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్ఐ రామమోహనX సూచించారు. మండలంలో వినాయక విగ్రహాలను ఏర్పాటు చేయదలచినవారు ముందుగా తమ పేర్లను పోలీస్‌స్టేషనX లో నమోదు చేసుకోవాలన్నారు. అనుమతి లేకుండా విగ్రహాలను ఏర్పాటు చేయరాదని ఆయన హెచ్చరించారు.



వసతిగృహాన్ని పరిశీలిస్తున్న రామమోహనX

వేమాలమ్మగుడిలో చోరీ

వరదయ్యపాళెం: మండలంలోని మావిళ్లపాడు వేమాలమ్మ గుడిలో దుండగులు చోరీకి పాల్పడ్డారు. స్థానికుల కథనం మేరకు... గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం రాత్రి గుడి తాళాలను పగులగొట్టి లోనికి ప్రవేశించారు. అమ్మవారి వజ్రపు ముక్కుపుడక, బంగారు తాళిబొట్టు, వెండి వస్తువులతోపాటు హుండీలోని నగదును అపహరించారు. గురువారం స్థానికుల సమాచారం మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ షేక్ షావల్లి తెలిపారు.



గుడి వద్ద విచారణ చేస్తున్న పోలీసులు



కంటి, దంత సమస్యలను నిర్లక్ష్యం చేయరాదు

పీలేరు : కంటి, దంత సమస్యలను నిర్లక్ష్యం చేయరాదని పీలేరు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మల్లు శశిధర్‌రెడ్డి అన్నారు. గురువారం రేగళ్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో పీలేరు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని నిర్వహించి విద్యార్థులకు కంటి , దంత పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా వైద్యులు ఆనందరెడ్డి, రామ్మోహన్‌రెడ్డిలు మాట్లాడుతూ కంటి, దంత సమస్యలు ఏర్పడినప్పుడు వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స పొందాలన్నారు.

చిన్నగొట్టిగల్లుకు జలకళ

భాకరాపేట: చిన్నగొట్టిగల్లు మండలంలో బుధవారం రాత్రి భారీ వర్షం కురిసింది. రాత్రివేళ కురిసిన ఈ వర్షానికి చెరువులు, చెక్‌డ్యాంలు పంట సంజీవిని కుంటలలో నీరు చేరి జలకళ సంతరించుకున్నాయి. మండలంలో 103.6 మి.మీ వర్షపాతం నమోదైంది. చెరువులు, కుంటలలో నీరు చేరడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ వర్షాల వల్ల భూగర్భజలాలు పెరిగేందుకు అనుకూలమని రైతులు భావిస్తున్నారు. వేరుశనగ పంట పూర్తి స్థాయిలో చేతికి వచ్చే అవకాశం ఉన్నదని రైతాంగం భావిస్తున్నది.



కోటబైలు చెక్‌డ్యాంలో చేరిన వర్షపునీరు

మరమ్మతుకు నోచుకోని సప్లయి ఛానల్ : ఇళ్లలోకి నీరు

భాకరాపేట: చిన్నగొట్టిగల్లు చెరువుకు వచ్చే సప్లయి ఛానల్ మరమ్మతుకు నోచుకోకపోవడంతో ఇళ్లల్లోకి వర్షపు నీరు వచ్చింది. దీంతో ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఈ సప్లయి ఛానల్ చిన్నగొట్టిగల్లులో ఇళ్ల మధ్యలో ఉండడం, మరమ్మతులు చేపట్టకపోవడంతో వర్షాలు పడడంతో ఆ నీరు నేరుగా ఇళ్లల్లోకి వస్తున్నది. బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ఈ ఛానల్ ద్వారా నీరు పొంగిపొర్లి ఇళ్లల్లోకి రావడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. ఇరిగేషన్‌శాఖ అధికారులు స్పందించి ఛానల్ మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



మరమ్మతుకు నోచుకోని సప్లయి ఛానల్

మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ

పీలేరు : మల్లారపు రవి ప్రకాష్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం వినాయక చవితి పండుగను పురస్కరించుకుని ప్రజలకు మట్టి విగ్రహాలను సీఐ నాగరాజు, ఎస్ఐ సుధాకర్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చవితి పండుగ సందర్భంగా మట్టి విగ్రహాలను ప్రతిష్టించి వాతావరణం కలుషితం కాకుండా సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు నఫీస్, సుభాష్ , మోదీన్‌బాషా, గౌతమ్, వెంకటరెడ్డి, పార్థసారథి, నానూనాయక్, మున్నా, సాధిక్ బాషా, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.



మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్న సీఐ నాగరాజు, ఎస్ఐ

శెభాష్ నగీనా !

పుట్టిన రోజున బడిలో మొక్కలు నాటిన చిన్నారి

కల్లూరు: పుట్టిన రోజు పండుగను అందరిలా కాకుండా సమాజానికి ఉపయోగపడేలా చేసుకోవాలని ఆ చిన్నారి తలచింది. ఓ మొక్క నాటి దాని సంరక్షణ బాధ్యతను తీసుకుని ఆదర్శంగా నిలిచింది. ఆ విధంగా పర్యావరణ పరిరక్షణకు నాంది పలికింది. పులిచెర్ల మండలం కల్లూరు ఉన్నత పాఠశాల ఆరో తరగతి విద్యార్థిని షేక్ నగీనాకు గురువారం పుట్టిన రోజు. ఈ సందర్భంగా ఆ చిన్నారి పాఠశాలలో పూలమొక్కను ప్రత్యేకంగా నాటి ఇక్కడ చదివినంతకాలం దాని సంరక్షణ బాధ్యతను చేపడతానని హెచ్‌ఎంకు తెలపడంతో చిన్నారి ఆశయాన్ని హెచ్‌ఎం తాతయ్య, ఉపాధ్యాయులు అభినందించారు.ఈ సందర్భంగా చిన్నారి పూలమొక్కతో పాటు పలు మొక్కలను తోటి విద్యార్థినుల సహాయంతో నాటడం జరిగింది.



చవితి కొనుగోళ్ళతో కిటకిటలాడిన వీధులు

• జోరుగా గణనాథుని విగ్రహాల విక్రయాలు



పీలేరులో చవితి పూజాసామాగ్రి విక్రయాలు



గణనాథుని మట్టి విగ్రహాల అమ్మకాలు

పీలేరు : వినాయక చవితి పూజాసామాగ్రి కొనుగోళ్ళతో పీలేరు నియోజకవర్గం అంతటా రద్దీ నెలకొంది. పీలేరులోని ఎల్‌బీఎస్ రోడ్డు, క్రాస్ రోడ్డు ప్రాంతాల్లో గురువారం మధ్నాహ్నం నుంచి ఎటుచూసినా పూజాసామాగ్రి అంగళ్ళు ,కొనుగోలుదారుల సందడి కనిపించింది. వివిధ గ్రామాల నుంచి వినాయక విగ్రహాలు, పూజాసామాగ్రి కోసం వచ్చిన ప్రజలతో దుకాణాలన్నీ నిండుగా కిక్కిరిశాయి. వీధులలో పూలు, పండ్లు, వినాయక విగ్రహాలు, పూజాసామాగ్రిని విక్రయించే వారితో రద్దీ నెలకొంది. శుక్రవారం జరిగే వినాయక చవితిని పురస్కరించుకుని పట్టణంలోని గణేష్ మండపాల్లో యువకుల సందడి కనిపించింది. విగ్రహ మండపాలు,ప్రతిమల ప్రతిష్ట ఏర్పాట్లలో ఉత్సవ కమిటీ సభ్యులు, యువకులు నిమగ్నం కావడంతో రెండు రోజుల ముందు నుంచే చవితి శోభ సంతరించుకుంది. పీలేరు పట్టణంలో ఈ ఏడాది 100 ప్రాంతాలకు పైగా విగ్రహాలను ప్రతిష్టిస్తున్నారు. గ్రామాల్లో యువకులు చలువ పందిళ్ళు వేసి ఆలయాలను ముస్తాబు చేశారు. అలాగే పరిసర గ్రామాల ప్రజలు చవితి వేడుకుల కోసం పీలేరు నుంచి వినాయకుడి విగ్రహాలను తీసుకెళ్ళారు. గత ఏడాదికన్నా ప్రస్తుతం వినాయక విగ్రహాలు, పూజాసామాగ్రి ధరలు దాదాపు రెట్టింపు అయినప్పటికీ కొనుగోలుదారులు పూజాసామాగ్రిని కొనేందుకు ఎగబడ్డారు. పీలేరుతో పాటు కలికిరి, కలకడ, కేవీపల్లె, రొంపిచెర్ల, పులిచెర్ల, చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాళెం మండలాల్లోనూ గురువారం చవితి పూజాసామాగ్రి, వినాయకుడి విగ్రహాల కోనుగోళ్ళు జోరుగా సాగాయి.

రూ. 50 వేలకు పైగా ధర పలికిన విగ్రహాలు

పీలేరులో ఈ ఏడాది గణనాథుని విగ్రహాల ధరలు రూ. 50వేలకు పైగా పలికాయి. స్థానిక చిత్తూరు, తిరుపతి, కడప మార్గాల్లో ఉత్తరప్రదేశ్‌కు చెందిన శిల్పి కళాకారులు విగ్రహాలు తయారు చేసి విక్రయించారు. ఈ కేంద్రాలలో రూ. 5 వేల నుంచి రూ. 50 వేల వరకు వివిధ డిజైన్లు, సైజులను బట్టి విగ్రహాలు అమ్ముడుబోయాయి. విగ్రహాల కొనుగోలుకు వచ్చిన వినాయక మండపాల సభ్యులతో దుకాణాలు కిక్కిరిశాయి. భారీ విగ్రహాలను క్రేన్ల సహాయంతో ట్రాక్టర్లు, లారీలలోకి చేర్చి వినాయక కేంద్రాలకు తరలించారు. శుక్రవారం పండుగ కావడంతో గురువారం విగ్రహాల కొనుగోలుదారుల తాకిడి అధికంగా కనిపించింది.

స్కూళ్లలో చవితి సందడి



పీలేరు శ్రీ చైతన్య పాఠశాలలో వినాయక పండుగ వేడుక

పీలేరు / రొంపిచెర్ల : పీలేరు శ్రీ చైతన్య పాఠశాలలో గురువారం ముందస్తు వినాయక పండుగ వేడుకను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పాఠశాలలో వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేసి పూజలు నిర్వహించి ప్రసాదాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుమన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

• రొంపిచెర్ల పీపుల్స్ సాఫ్ట్ పాఠశాలలో గురువారం ముందస్తు వినాయక పండుగను విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించి పూజలు చేశారు.ఈ కార్యక్రమంలో ఛైర్మన్ అజంతుల్లా, ప్రిన్సిపాల్ ప్రతాప్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ కేశవులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంగన్‌వాడి కేంద్రాలకు గ్యాస్ స్టౌలు పంపిణీ

పీలేరు : మండలంలోని జాండ్ల పంచాయతీ పరిధిలో ఉన్న అంగన్‌వాడి కేంద్రాలకు గురువారం ఎంపీడీవో వసుంధర గ్యాస్ స్టౌలు పంపిణీ చేశారు. ఎంపీడీవో మాట్లాడుతూ అంగన్‌వాడి కేంద్రాల బలోపేతానికి ముందుండాలని కోరారు

సినిమా గైడ్

షుకూర్	లై
ఎస్వీ మహల్	నక్షత్రం
ఎస్వీ డీలక్స్	నేనే రాజు నేనే మంత్రి
అజంతా	జయ జానకి నాయక

ఎటు చూసినా పండుగ కోలాహలం



కల్లూరు /రొంపిచెర్ల : పులిచెర్ల మండలంలో వినాయక చవితి పండుగ ఉత్సవానికి గ్రామాలలో యువత అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది. వినాయక పండుగను గ్రామాలలో అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు.ఈ సందర్భంగా ప్రతి గ్రామంలో వినాయక విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నారు. గురువారం కల్లూరు కొనుగోలుదారులతో కిటకిటలాడింది.

• రొంపిచెర్ల మండలంలో వినాయక చవితి ఉత్సవాలకు సర్వం సిద్ధం అయింది. గ్రామాలలో యువకులు విగ్రహాలను కొనుగోలు చేసి గ్రామాలకు తరలిస్తున్నారు. రొంపిచెర్లలో వినోద్ కుమార్, వినాయక పండుగను పురస్కరించుకుని 300 మంది మట్టి విగ్రహాలను తయారు చేశారు.




శ్రీకాళహస్తీశ్వరాలయంలో దర్శన వేళలు

ఉదయం: 4.45 గంటలకు గోపూజ, 5.00కు సుప్రభాత సేవ, 6.00, 7.00, 10.30 గంటలకు అభిషేకాలు **సాయంత్రం:** 5.00 గంటలకు నాలుగవ కాలాభిషేకం **ఉదయం:**6నుంచిరాత్రి 8:30 గంటలవరకు రాహు-కేతు సర్పదోష నివారణ పూజలు **సాయంత్రం:** 6.30 గంటలకు దీపారాధన **రాత్రి:** 9.30 గంటలకు ఏకాంత సేవ






మార్కెట్లో అమ్మకానికి సిద్ధంగా ఉంచిన వినాయక చవితి పూజా సామగ్రి

వినాయక చవితికి సర్వం సిద్ధం

శ్రీకాళహస్తి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తి పట్టణంలో గురువారం వినాయక చవితి సందడి నెల కొంది.ఉదయం నుంచి రాత్రి వరకు ప్రధాన వీధులన్నీ జనమయం అయ్యాయి. నగరివీధి, బజారువీధి, తేరు వీధి, నెహ్రూవీధితో పాటు సినిమావీధి, పాతబస్టాండు, కూరగాయల మార్కెట్, బాబుఅగ్రహారం కూడలి ప్రాంతాల్లో పండుగ సరుకులు విక్రయానికి పెట్టడంతో ఈ ప్రాంతాలు కొనుగోలుదారులతో నిండిపోయాయి. పండుగ సరుకులు కొనుగోలు చేయడానికి జనం పెద్ద ఎత్తున తరలివచ్చారు. పూలు, పండ్లు, పత్రి, కొబ్బరి కాయలు, ఆకు,వక్క, చెరకు, గెరిగె, ఎలక్కాయలు, సజ్జ, మామిడి ఆకులు, గొడుగులతో పాటు వినాయకునికి అత్యంత ప్రీతికరమైన వస్తువులన్నీ జనం కొనుగోలు చేశారు. గ్రామీణ వ్యాపారులు ఎక్కువ మంది వీటిని విక్రయించారు.వివిధ పరిమాణాల్లో వినాయక ప్రతిమ లను విక్రయానికి ఉంచారు. కొంతమంది దాతలు మట్టి వినాయక ప్రతిమలను ప్రజలకు ఉచితంగా అందజేశారు. ప్లాస్టర్ఆఫ్ప్యారిస్తో చేసిన ప్రతిమ లను వినియోగించడం వలన పర్యావరణం కలుషిత మవుతుందని చాలా మంది ప్రచారం నిర్వహించిన ఫలితంగా గత యేడాదితో పోల్చితే... ఈ యేడాది మట్టి వినాయక ప్రతిమలకు ఎక్కువ మంది మొగ్గు చూపారు. కాగా, పట్టణంలోని పెండ్లిమండపం, భేరి వారి మండపం, జయరామరావువీధి, ముత్యాలమ్మ గుడివీధి, కొత్తపేట, బాబుఅగ్రహారం, గాంధీవీధి, తెట్టు తదితర ప్రాంతాల్లో యువకులు పోటీలు పడి వినాయక ప్రతిమలను ఏర్పాటు చేశారు.

మట్టి ప్రతిమలతో పర్యావరణ పరిరక్షణ



మట్టి ప్రతిమలను అందజేస్తున్న కృష్ణభట్

శ్రీకాళహస్తి: పర్యావరణ పరిరక్షణ కోసం వినాయక చవితికి మట్టి ప్రతిమలనే వాడా లని పౌరసంక్షేమ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణభట్ పిలుపునిచ్చారు.ఆమేరకు పట్టణం లోని ఆర్టీసీ బస్టాండు సమీపంలో ఉన్న సంస్థ కార్యాలయంలో ఆయన గురువారం మట్టి వినాయక ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టర్ఆఫ్ప్యారిస్తో చేసిన ప్రతిమలను వాడటం వలన పర్యావర ణంలో సమతుల్యత లోపిస్తుందన్నారు. కాగా, మట్టి వినాయక ప్రతిమల పంపిణీకి కృషి చేసిన తమ సంస్థ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరరావును ఆయన అభినందిం చారు. కార్యక్రమంలో వంశీకృష్ణయాదవ్, దామోదరంగౌడ్, రాజమ్మ, గణేష్, తది తరులు పాల్గొన్నారు.

28న అమిత్ షా సభ

తొట్టంబేడు: విజయవాడలో ఈ నెల 28న జరగనున్న బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా పాల్గొననున్న సభను జయప్రదం చేయాలని పార్టీ మండలాధ్యక్షుడు రవీంద్ర నాయుడు కోరారు. మండలంలోని పార్టీ కార్యకర్తలందరూ పెద్ద సంఖ్యలో సభకు తరలి రావాలని పిలుపు నిచ్చారు.

శ్రీకాళహస్తిలో సినిమాలు...

సాయిరాం	: వివేకం
బలరాం	: అహో బ్రహ్మ
శ్రీనివాస	: ఫిదా
విజయలక్ష్మి	: నేనే రాజు నేనే మంత్రి
ఆర్.ఆర్	: వీఐపీ
రామచంద్ర	: జయ జానకీ నాయక

పాఠశాలల్లో ఘనంగా చవితి వేడుకలు





ఎంజీఎం, ది స్కూల్, ఏవీఆర్ పాఠశాలల్లో చవితి వేడుకల్లో చిన్నారులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని పలు ప్రైవేటు పాఠశాలల్లో గురువారం వినాయకచవితి వేడుకలు ఘనంగా నిర్వహిం చారు.చవితి ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు.విద్యా ర్థులచే ఉట్టి కొట్టే కార్యక్రమాలు నిర్వహించారు. ఎంజీఎం పాఠశాలలో జరిగిన వేడుకల్లో పాఠశాల డైరెక్టర్ మయూర్, హెచ్ ఎం మునిరత్నంనాయుడు, కళాశాల ప్రిన్సిపాల్ వీఎస్ రత్నం తదితరులు పాల్గొన్నారు. ది స్కూల్లో జరిగిన వేడు కల్లో కరస్పాండెంట్ శాంతారాం పవార్, హెచ్ ఎం విశాల, రవికుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. కొత్త పేటలోని ఏవీఆర్ పాఠశాలలో డీజీఎం సుబ్రహ్మణ్యంరెడ్డి, ప్రిన్సిపాల్ కుమారబాబు, మహేష్, ఉపాధ్యాయులు, విద్యా ర్థులు వినాయక చవితి వేడుకల్లో పాల్గొన్నారు.

ప్రైవేటు బడుల నిర్వాహకులకు రక్షణ కల్పించాలి



వినతిపత్రం సమర్పిస్తున్న ప్రైవేటు పాఠశాలల నిర్వాహకులు

శ్రీకాళహస్తి: ప్రైవేటు పాఠశాలల నిర్వాహకులకు రక్షణ కల్పించాలని ఆ యూనియన్ నాయకులు విజ్ఞప్తి చేశారు.ఈ మేరకు వారు గురువారం శ్రీకాళహస్తి తహసీల్దారు సుబ్ర హ్మణ్యంకు వినతిపత్రం సమర్పించారు. ప్రైవేటు పాఠశా లల యాజమాన్యాలపై కొన్ని విద్యార్థి సంఘాల నాయకులు భౌతిక దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఇటీవల కర్నూలులో ఓ ప్రైవేటు పాఠశాల యాజమాన్యంపై విద్యార్థి సంఘ నాయకులు దాడి చేశారని ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు. ఇలా చేయడం వలన తాము స్వేచ్ఛగా పాఠ శాలలు నిర్వహించుకోలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. దాడులకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం వారు స్థానిక పోలీస్‌స్టేషన్ లో కూడా ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో స్కెప్సా అధ్య క్షుడు వరప్రసాద్ రెడ్డి, ఉపాధ్యక్షుడు చిలకా రంగయ్య, శ్రీధర్, విద్యాసాగర్, తదితరులు పాల్గొన్నారు.

'బయోమెట్రిక్'తోనే ఎరువులు విక్రయించాలి



సమావేశంలో పాల్గొన్న జ్యోతిర్మయి తదితరులు

శ్రీకాళహస్తి రూరల్:బయోమెట్రిక్ పద్ధతి ద్వారానే రైతులకు ఎరువులను విక్రయించాలని ఏడీఏ జ్యోతి ర్మయి డీలర్లను ఆదేశించారు. స్థానిక వ్యవసాయ డివి జన్ కార్యాలయంలో శ్రీకాళహస్తి, ఏర్పేడు, తొట్టంబేడు, బీఎన్ కండ్రిగ, కేవీబీపురం మండలాల్లోని ఎరువుల డీలర్లతో గురువారం ఆమె సమావేశం నిర్వహించారు. ఎరువులు విక్రయించే ముందు రైతుల ఆధార్ నెంబ రుతోపాటు ఎరువుల వివరాలను ఆన్ లైన్ లో నమోదు చేయాలన్నారు. ఈ పద్ధతిని అవలంభించకుంటే ఎరు వుల కంపెనీల నుంచి డీలర్లకు వచ్చే రాయితీలు అందవని చెప్పారు. ఈ-పాస్ యంత్ర వినియోగంపై డీలర్లకు అవగాహన కల్పించారు. ఏవోలు రమేష్‌రెడ్డి, మణి, సుహరల్‌లత, సుబ్బారావు, చిట్టిబాబు, ఏఈవో లు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ రుణాలు అందజేస్తాం

శ్రీకాళహస్తి: అర్హులందరికీ కార్పొరేషన్ల రుణాలు అందజేస్తా మని పురపాలక సంఘ ఇన్ ఛార్జి కమీషనర్ రవీంద్రారెడ్డి చెప్పారు. పురపాలకసంఘ కార్యాలయంలో గురువారం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, కాపు తదితర కార్పొరేషన్ల ద్వారా రుణాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. శ్రీకాళహస్తి పట్టణ పరిధిలో కార్పొరేషన్ రుణాల కోసం 2,113 మంది దరఖాస్తు చేసుకోగా, 736 మంది ఇంటర్వ్యూలకు హాజ రయ్యారు. ఈ సందర్భంగా రవీంద్రారెడ్డి మాట్లాడుతూ అర్హు లందరికీ రుణాలు అందించేందుకు బ్యాంకర్లు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మెప్మా అధికారులు ప్రమీల, దివాకర్, పలు బ్యాంకుల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వెంకయ్యస్వామి ఆరాధనోత్సవాలు



అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

శ్రీకాళహస్తి రూరల్: మండలంలోని వేడాంలో గల వెంకయ్యస్వామి ఆలయంలో గురువారం ఆరాధన ఉత్సవాలు ఘనంగా జరిగాయి. రాష్ట్ర బీసీ యువజన సంఘం అధ్యక్షుడు వడ్లతాంగల్ బాలాజీ ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. అంతకు ముందు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో తరలి వచ్చిన భక్తులకు నిర్వాహకులు ధర్మారెడ్డి, పుల్లయ్య, కందప్పరెడ్డి, జైకృష్ణ, మోహన్ రెడ్డి, తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ల్యాంకో వర్కర్స్ యూనియన్ కార్యవర్గం ఏర్పాటు



సదాశంకర్

శ్రీకాళహస్తి రూరల్: మండలంలోని శ్రీకాళ హస్తి పైప్స్ లిమిటెడ్ (ల్యాంకో) వర్కర్స్ యూని యన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్ను కున్నట్లు ప్రధాన కార్యదర్శి సదాశంకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే బొజ్జల గోపాలకృష్ణారెడ్డి గౌరవా ధ్యక్షుడిగా ఉన్న ఈ కమిటీలో ముఖ్య సహాయ అధ్యక్షుడిగా కె.శ్రీరామమూర్తి, సలహాదారుగా మోహన్ రావు, అధ్యక్షుడిగా మురళి ఉన్నారు. మొత్తం 20 మందితో నూతన కమిటీ ఏర్పాటు చేశారు. కాగా, కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని నూతన కార్యవర్గం పేర్కొంది.

27న వైసీపీ నియోజకవర్గస్థాయి సమావేశం



సమావేశంలో పాల్గొన్న వైసీపీ నాయకులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో 27వ తేదీ ఆదివారం నిర్వహించనున్న నియోజకవర్గస్థాయి బూత్ కమిటీల సమావేశాన్ని జయప్రదం చేయాలని ఆ పార్టీ నాయకులు ఎం.హరి, జి.బాలకృష్ణయ్య విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో గురువారం జరిగిన పార్టీ పట్టణ కమిటీ సమావేశంలో వారు మాట్లాడుతూ... కార్యకర్తలను చైతన్యవంతు లను చేయడానికి నిర్వహించనున్న బూత్ కమిటీల సమావే శంలో శ్రీకాళహస్తి, తొట్టంబేడు, ఏర్పేడు, రేణిగుంట మండలాల నుంచి కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు. నాయకులు మధుశేఖర్, ప్రవీణ్, గోపి,సిరాజ్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

గుర్రంకొండ: వినాయక విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి అని ఏఎస్ఐ ప్రభాకర్‌రావు అన్నారు. వినాయక చవితి సందర్భంగా గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. నిర్వాహకులు విగ్రహాలు ఏర్పాటు చేస్తున్న వివరాలు, నిమజ్జన తేదీలను తెలియజేయాలన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి: చింతల

వాల్మీకిపురం: బ్యాంకులు ఇచ్చిన రుణాలను సద్వినియోగం చేసుకుని మహిళలు ఆర్థికంగా ఎదగాలని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం వాల్మీకిపురంలో సప్తగిరి గ్రామీణ బ్యాంకు ద్వారా మహిళా సంఘాలకు రూ.1.50కోట్లు రుణాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రుణాలు తీసుకున్న మహిళలు సక్రమంగా చెల్లించినట్లయితే మరింతమందికి రుణాలు ఇవ్వడానికి అవకాశం ఉంటుందన్నారు. బ్యాంకు మేనేజX వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ సీనియర్ గ్రూపులకు రూ.10లక్షల దాకా రుణాలు ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఎం కార్యాలయ సీనియర్ మేనేజర్లు శరX బాబు, నరేంద్ర, ఏపీఎం నరసింహులు, వైసీపీ మండల కన్వీనర్ నీళ్ల భాస్కర్, సర్పంచX చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

తంబళ్లపల్లె: మండల కేంద్రంలోని టీఎస్వీఎస్ఆర్‌ఎం ప్రభుత్వ ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యంరెడ్డి తెలిపారు. ఫిట్టర్, సివిల్ విభాగంలో ఖాళీలు ఉన్నాయని పదోతరగతి పాసైన అభ్యర్థులు రూ.10 చెల్లించి దరఖాస్తు పొందాలన్నారు. పూర్తిచేసిన దరఖాస్తులను ఈనెల 28లోపు ఐటీఐలో సమర్పించాలని అన్నారు. 30న 10గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని అన్నారు.

సబ్సిడీ రుణాలకు పోటెత్తిన అభ్యర్థులు

తంబళ్లపల్లె: నిరుద్యోగులకు స్వయం ఉపాధి కోసం వివిధ కార్పొరేషన్ల ద్వారా ప్రభుత్వం అంజేస్తున్న సబ్సిడీ రుణాల ఇంటర్వ్యూలకు నిరుద్యోగులు పెద్దఎత్తున హాజరయ్యారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీ, కాపు కార్పొరేషX రుణాలకు గురువారం తంబళ్లపల్లె ఎంపీడీవో కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. మొత్తం 143యూనిట్లకు 358మంది అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారని ఎంపీడీవో రామకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మలిగి రామచంద్రారెడ్డి, ఎంపీపీ వేణుగోపాల్‌రెడ్డి, సూపరింటెండెంట్ రమేష్‌బాబు, అన్ని బ్యాంకుల మేనేజర్లు పాల్గొన్నారు. ● బి.కొత్తకోట ఎంపీడీవో కార్యాలయంలో ఇంటర్వ్యూలకు 207యూనిట్లకు 1220మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా 415మంది హాజరయ్యారు. కమిటీ సభ్యులు, అధికారులు, బ్యాంకు మేనేజర్లు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ● ములకలచెరువు మండలంలో 1150మంది దరఖాస్తు చేసుకోగా కేవలం 337మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. ఎంపీడీవో రాజగోపాల్, జడ్పీటీసీ కువైట్ శంకర్, ప్రత్యేకాహ్వానితులు కాలేషా, కమిటీ సభ్యులు గుత్తికొండ



తంబళ్లపల్లె ఎంపీడీవో కార్యాలయం వద్ద ఇంటర్వ్యూల కోసం బారులు తీరిన అభ్యర్థులు

త్యాగరాజు, సయ్యద్‌బాషా, సర్పంచX సురేష్, బ్యాంకు మేనేజర్లు పాల్గొన్నారు. ● కురబలకోట మండలంలో 940మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరికి ఎస్‌బీఐ, ఇండియX బ్యాంకు, సప్తగిరి గ్రామీణ బ్యాంకు సిబ్బందితో పాటు ఎంపీపీ భూమిరెడ్డి, వైస్‌ఎంపీపీ రజియాసుల్తాX ఇంటర్వ్యూలు నిర్వహించారు.

మానవాళి మనుగడకు చెట్లే ఆధారం

నిమ్మనపల్లె: చెట్లు మావవాళి మనుగడకు ఆధార మని రెడ్డివారిపల్లె హెచX ఎం చిట్టిబాబు అన్నారు. గురు వారం పాఠశాల ఆవరణలో ఒక్కో ఉపాధ్యాయుడు ఐదు మొక్కలు నాటారు. ఈసందర్భంగా హెచX ఎం మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఒక్కో ఉపాధ్యాయుడు ఐదు మొక్కలను నాటామన్నారు. మొత్తం 140మొక్కలను పాఠశాల ఆవరణలో నాటినట్లు ఆయన తెలిపారు. ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

బాధితుడికి రూ.10వేల ఆర్థికసాయం



బాధితుడిని పరామర్శిస్తున్న మద్దిరెడ్డి

తంబళ్లపల్లె: మండలంలోని ఎర్రసానిపల్లె పంచాయతీ వక్కావాండ్లపల్లెలో గతనెలలో గ్యాస్ సిలిండర్ పేలుడు ఘటనలో నష్టపోయిన బాధితుడికి దాత మల్లయ్యకొండ మాజీ చైర్మX , అఖిల భారత రెడ్ల సంఘం ఉపాధ్యక్షుడు కనుగొండ మద్దిరెడ్డి రూ.10వేలు ఆర్థిక సాయంగా అందజేశారు. బాధితుడి కుమార్తెలు కళాశాలలో చేరడానికి ఆర్థిక సాయం అందజేస్తానన్నారు. అనంతరం జూనియర్ కళాశాలలోని తాగునీటి బోరును పరిశీలించారు. తాగునీటి సమస్యపై స్పందిస్తూ నీటి శుద్ధి యంత్రాన్ని అందజేసినా నిరుపయోగంగా ఉందని అధ్యాపకులు చెప్పడంతో వెంటనే బోరు మరమ్మతులకు తనవంతు సాయంగా రూ.లక్షను అందజేస్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు మాజీ కోఆప్షX మెంబర్ మహబూబ్‌బాషా, వెంకటస్వామిరెడ్డి, షరీఫ్‌బాషా, అధ్యాపకులు పాల్గొన్నారు.

నాయునిచెరువుపల్లెలో గ్రామసభ

ములకలచెరువు: మండలంలోని నాయుని చెరువుపల్లెలో గురువారం రెవెన్యూశాఖ గ్రామసభ జరిగింది. భూ సమస్యలు, పౌరసరఫరా సమస్యలపై అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ అమరేంద్రబాబు, ఆర్‌ఐ శ్రీనివాసులు, వీఆర్వో వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల విద్యార్థులకు యూనిఫాం పంపిణీ

నాగలాపురం: మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు గురువారం యూనిఫాం పంపిణీ చేశారు. 1 నుండి 8వ తరగతి విద్యార్థులకు ఆయా పాఠశాలల్లో పాఠశాల కమిటీ చైర్మX ఆధ్వర్యంలో ఈ యూనిఫాం పంపిణీ జరిగింది. నాగలాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈ యూనిఫారం పంపిణీ కార్యక్రమాన్ని ఎంపీపీ కల్పనా విజయ కుమార్ ప్రారంభించారు.



ప్రభుత్వ పనులకంటూ ఇసుక తరలింపు

ట్రాక్టర్లను అడ్డుకున్న గ్రామస్థులు - పోలీసులకు అప్పగింత

నాగలాపురం: నాగలాపురం మండలంలో ఇసుక అక్రమ రవాణా రోజురోజుకు జోరందుకుంటోంది. ఏర్పేడు ఘటనతో కొంత కాలం ఆగిన ఇసుక తరలింపు మళ్లీ విజృంభించింది. ఇసుకాసురులు ప్రభుత్వ పనుల ముసుగులో ట్రాక్టర్లతో ఇసుకను దొంగ దారుల్లో తమిళనాడుకు తరలిస్తున్నారు. అయితే ఈ అక్రమ ఇసుక రవాణాలో పోలీస్ యంత్రాంగం కఠినంగా వ్యవహరిస్తున్నా రెవెన్యూ వారు మాత్రం చూసీ చూడనట్టుగా ఉంటున్నారు. గురువారం మలిమేలు కండ్రిగ గ్రామస్థులు స్థానిక అరుణానదిలో అక్రమ ఇసుక రవాణా చేస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను అడ్డుకొని పోలీసులకు అప్పగించారు. అరుణానదిలో గత రెండు రోజులుగా సత్యవేడు, సురుటుపల్లికి చెందిన కొందరు ట్రాక్టర్లతో అక్రమ ఇసుక రవాణా చేస్తుండడాన్ని గమనించిన ఆ గ్రామస్థులు కలిసికట్టుగా ట్రాక్టర్లను అడ్డుకున్నారు. అనంతరం ఎస్ఐ మునిస్వామికి ఫోX ద్వారా ఫిర్యాదు చేసి ఘటనా స్థలానికి వెళ్లిన పోలీసులకు ఈ ఇసుక ట్రాక్టర్లను అప్పగించారు. అయితే గతంలో పోలీసులు పలుమార్లు ఇసుక ట్రాక్టర్లను పట్టుకుని తహసీల్దార్ రేణుకమ్మకు అప్పగిస్తే ఆమె ఎటువంటి అపరాధం విధించకుండా విడిచిపెట్టారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. పోలీసులతో కలిసి రెవెన్యూ యంత్రాంగం అక్రమ ఇసుక రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



మలిమేలు కండ్రిగ గ్రామంలోని అరుణానదిలో ఇసుక ట్రాక్టర్లను అడ్డుకున్న గ్రామస్థులు

వినాయకా స్వాగతం !

చవితి కొనుగోళ్లతో వాడవాడలా సందడి

నగరి: రేపటి వినాయక చవితిని పురస్కరించుకుని గురువారం నగరిలో చవితి పూజా సామగ్రి కొనుగోళ్ళతో వీధులు సందడితో కనిపించాయి. పట్టణంలోని టవర్‌క్లాక్ సెంటర్ వద్ద రోడ్లపైనే వివిధ దుకాణాలు వెలిశాయి. వినాయక విగ్రహాలను ట్రాక్టర్లపై యువకులు ఉత్సాహంతో గ్రామాలకు పోటాపోటీగా తీసుకెళ్లారు. గురువారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఓ మోస్తరుగా వర్షం కురవడంతో ఆరుబయట దుకాణాలు పెట్టుకున్న వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మధ్యాహ్నం పైబడి నుంచి వాతావరణం అనుకూలించి ఎండ రావడంతో యథావిధిగా రోడ్లపై దుకాణాలు వెలిశాయి. దీంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.





గ్రామాలకు తరలిపోతున్న వినాయకులు - టవర్‌క్లాక్ సెంటర్ వద్ద చవితి పూజా సామగ్రి కొనుగోళ్ళ సందడి

ఐటీఐలో మూడవ విడత ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

విజయపురం: మండలంలోని మాధవరంలో నెలకొన్న ప్రభుత్వ ఐటీఐలో మూడవ విడత ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ మనోహర్‌రెడ్డి తెలిపారు. కళాశాల పనివేళల్లో రూ.10 చెల్లించి దరఖాస్తులు పొందవచ్చని, పూర్తి చేసిన దరఖాస్తులను ఈ నెల 28 లోపు సమర్పించాలని తెలిపారు.

తహసీల్దార్ రేణుకపై కేసు నమోదు చట్టవిరుద్ధం

విజయపురం: ఓ వ్యక్తి ఫిర్యాదుపై నాగలాపురం తహసీల్దార్ రేణుకపై పోలీసులు కేసు నమోదు చేయడం అమానుషమని చిత్తూరు రెవెన్యూ డివిజన్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు, విజయపురం తహసీల్దార్ ధర్మయ్య ఖండించారు. గురువారం మండల కేంద్రమైన విజయపురంలో పోలీసు చర్యలకు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్‌గా విధులు నిర్వహిస్తున్న అధికారిణిపై ఎస్ఐ కేసు నమోదు చేయడం చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. తహసీల్దార్‌పై కేసును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ వెంకట్రమణ, సీఎస్ డీటీ ప్రసన్నకుమార్, ఆర్ఐ జయప్రకాష్, ఏఎస్‌వో సోమశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయం వద్ద మహిళల ధర్నా

నగరి: నగరి మున్సిపల్ కార్యాలయం వద్ద 27వ వార్డు చింతలపట్టెడకు చెందిన మహిళలు గురువారం ధర్నా చేశారు. తమ కాలనీలో సమీప డ్రైనేజీ కాల్వల ద్వారా డయ్యింగ్ రంగు నీరు, వర్షపునీటితో కలసి ఇళ్ళలోకి వచ్చేస్తున్నాయని ఆరోపించారు. ఇళ్ళలోకి, వీధుల్లోకి ఈ నీరు యథేచ్ఛగా చేరుతుండడంతో రోగాల బారిన పడాల్సి వస్తోందన్నారు. అధికారులు పట్టించుకోవాలని డిమాండ్ చేశారు. తాగునీరు సైతం కలుషితం కావడం వల్ల ఇబ్బందులు పడుతున్నామని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్, ఏఈలను కలసి తమ సమస్యలను తెలుపుకున్నారు.



నగరి మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న మహిళలు

ఇండస్ట్రీ ఎక్సలెన్X్స అవార్డు గ్రహీత నందకుమార్‌కు సన్మానం

పిచ్చాటూరు: నేటమ్స్ షుగర్స్ ప్రైవేటు లిమిటెడ్ ఛైర్మX, ఇండస్ట్రీ ఎక్సలెX్స అవార్డు గ్రహీత నందకుమార్‌ను కర్మాగార పరిధిలోని చెరకు రైతు సంఘ నాయకులు, రైతులు గురువారం ఘనంగా సన్మానించారు. సన్మానసభలో చెరకు రైతు సంఘ నాయకులు మాట్లాడుతూ భారతదేశంలో షుగర్ ఇండస్ట్రీస్ అనుబంధ సంస్థ అభివృద్ధికి, ఆయన చేసిన సేవలను గుర్తించి ది షుగర్స్ టెక్నాలజీస్ట్ అసోసియేషX ఆఫ్ ఇండియా వారు అందించిన ఈ అవార్డు నందకుమార్‌కు రావడం హర్షించదగ్గ విషయమన్నారు. అవార్డు గ్రహీత భారతదేశంలో చక్కెర కర్మాగారాలు అనుబంధ సంస్థల అభివృద్ధికి ఎనలేని కృషి చేయడం, అదే విధంగా చెరకు రైతుల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కర్మాగార పరిధిలోని చెరకు రైతుల సమస్యలను గుర్తించి రైతు శ్రేయస్సే లక్ష్యంగా పనిచేస్తే కర్మాగారం అభివృద్ధి చెందుతుందన్నారు. అనంతరం పలువురు రైతులు అవార్డు గ్రహీతను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో చెరకు రైతు సంఘ నాయకులు జి.కె.నాయుడు, ప్రభాకర్ నాయుడు, చక్రపాణిరెడ్డి, సతీష్‌నాయుడు, రైతులు మురళీనాయుడు, రవికుమార్, గుణశేఖర్‌రెడ్డి, రవినాయుడు, మనోహర్‌నాయుడు, ధనంజయలునాయుడు, కర్మాగార ఎండీ రామనాథం, సీవో శివప్రకాశం, సీడీవో పరిమిళ, రంగనాథం, హెచX ఆర్‌డీ ప్రసాద్ పాల్గొన్నారు.

టీడీపీ పాలనలోనే కుల వృత్తులకు చేయూత

పుత్తూరు: టీడీపీ ప్రభుత్వం కుల వృత్తులకు అధిక ప్రాధాన్యత ఇచ్చి చేయూతనిస్తోందని పుత్తూరు ఎంపీపీ గంజి మాధవయ్య తెలిపారు. గురువారం పుత్తూరు మున్సిపాలిటీ నేసనూరులో మేదరులకు 57 లక్షల రూపాయలు సంబంధిత కార్పొరేషX ద్వారా రుణం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా ఎన్టీఆర్ ఆదరణ పథకంతో కుల వృత్తుదారులను ప్రోత్సహించారని గుర్తు చేశారు. నేడు సీఎం చంద్రబాబు బీసీ మేదర ఫెడరేషX ద్వారా, కుల వృత్తిదారులకు రుణ సౌకర్యం కల్పించి ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. నేడు సీఎం చంద్రబాబు బీసీ మేదర ఫెడరేషX ద్వారా కుల వృత్తిదారులకు రుణ సౌకర్యం కల్పించి ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో నిర్మలాదేవి, ఈవోపీఆర్‌డీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

నగరిలో ప్రైవేటు విద్యాసంస్థల బంద్

నగరి: నగరిలో గురువారం ప్రైవేటు విద్యాసంస్థలవారు బంద్ పాటించారు. ఇటీవల నంద్యాలలో ఓ ప్రైవేటు విద్యాసంస్థల నిర్వాహకునిపై జరిగిన దాడిని నిరసిస్తూ పట్టణంలోని అన్ని విద్యాసంస్థలు బంద్ పాటించాయి. ఇలాంటి దాడులు జరపడం తగదని సూర్య డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ జయరామరాజు తెలిపారు. ప్రభుత్వం న్యాయం చేయాలని ఆయన కోరారు.



నగరిలోని శ్రీసూర్య డిగ్రీ కళాశాల వద్ద నిరసన తెలుపుతున్న కరస్పాండెంట్ జయరామరాజు, సిబ్బంది

వినాయక విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

శ్రీరంగరాజపురం: వినాయక చవితిని పురస్కరించుకుని విగ్రహాల ఏర్పాటుకు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని ఎస్ఆర్‌పురం ఎస్ఐ వాసంతి తెలిపారు. గురువారం స్థానిక పోలీస్‌స్టేషX లో ఆమె మాట్లాడుతూ ఎవరైన బలవంతంగా చందాలు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, విగ్రహాన్ని ఏర్పాటు చేయదలచిన వ్యక్తులు ముందుగా కమిటీగా ఏర్పడాలన్నారు. ఏ ప్రదేశంలో విగ్రహాన్ని ఏర్పాటు చేస్తారో పోలీసులకు తెలియజేసి అనుమతి పొందాలన్నారు. విగ్రహాల వల్ల ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలన్నారు.

రుణాల మంజూరుకు ముగిసిన ఇంటర్వ్యూలు

వడమాలపేట: ఎస్సీ, ఎస్టీ, బీసీ, కాపు రుణాల లబ్ధిదారుల ఎంపిక కోసం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. మండలంలో 143 యూనిట్లకు సంబంధించి 146 మంది ఇంటర్వ్యూకు హాజరయ్యారని ఎంపీడీవో శ్రీలక్ష్మి తెలిపారు. ఎస్సీ రుణాలకు సంబంధించి 50 యూనిట్లకు గాను 59 మంది, ఎస్టీ రుణాలకు సంబంధించి 9 యూనిట్లకు 7 మంది, బీసీ రుణాలకు సంబంధించి 50 యూనిట్లకు 61 మంది, కాపు రుణాలకు 34 యూనిట్లకు 19 మంది ఇంటర్వ్యూకు హాజరయ్యారు. మండలంలో 143 యూనిట్లకు సంబంధించి 191 మంది దరఖాస్తు చేసుకోగా 146 మంది ఇంటర్వ్యూకు హాజరయ్యారని ఎంపీడీవో తెలిపారు.

చవితి వేడుకలకు సర్వం సిద్ధం

సత్యవేడు: వినాయక చవితి పండుగకు యువకులు, పెద్దలు సర్వం సిద్ధం చేశారు. పట్టణం, గ్రామం అనే తేడాలేకుండా వీధికో వినాయకుని విగ్రహాలను ఉంచి ఘనంగా పూజలు నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లన్నింటికీ కూడా గ్రామస్థులందరూ సహకరించి ప్రోత్సహించడంతో యువకులు భారీ ఏర్పాట్లను చేశారు. హిందువులకు తెలుగు సంవత్సరంలో తొలి పండుగ కావడంతో ప్రతీ ఒక్కరూ ఆనందోత్సహాల నడుమ పండుగను నిర్వహించేందుకు ప్రాధాన్యతను ఇస్తున్నారు. సహజంగా వినాయక చవితికి వినాయక ప్రతిమలతో పాటూ రంగురంగుల గొడుగులు, చెరుకు గడలు, పూలు, పండ్లును సైతం పట్టణంలో జోరుగా విక్రయిస్తున్నారు. అదేవిధంగా మండల పరిధిలోని సీతారాంపేట ప్రాథమిక పాఠశాలలో మట్టి వినాయక ప్రతిమను ఉంచి ఘనంగా పూజలు నిర్వహించారు. గ్రామంలో విద్యార్థులు రంగులు పూసుకుంటూ వినాయక చవితిని ఒక్కరోజు ముందుగానే నిర్వహించారు.

హెల్మెట్‌తో తలకు రక్షణ

నింద్ర: రోడ్డు ప్రమాదాల బారి నుంచి రక్షణ పొందుటకు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని నింద్ర ఎస్ఐ నరేంద్ర కోరారు. వినాయక చవితి సందర్భంగా వినాయక బొమ్మతో 'తలమీదే రక్షణ మీదే ఒక తల పోతే రెండో తల పొందలేరు నాలాగా' అనే నినాదంతో ప్రజలకు అవగాహన కల్పించడానికి మండలంలోని గ్రామాల్లో, నాలుగు రోడ్ల కూడలి వద్ద బ్యానర్లు ఏర్పాటు చేశారు. ద్విచక్రవాహన దారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనాన్ని నడపాలని నరేంద్ర సూచించారు.

నేతల వినాయకచవితి శుభాకాంక్షలు

మదనపల్లెటౌన్: ప్రజలకు ప్రజాప్రతినిధులు, రాజకీయనాయకులు వినాయక చవతి శుభాకాంక్షలు తెలిపారు. విఘ్నాలు తొలగి ప్రజలంతా సుఖసంతోషాలతో గడపాలని ఆకాక్షించారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఎమ్మెల్యే దేశాయ్ తిప్పారెడ్డి, మున్సిపల్ చైర్మన్ కొడవలి శివప్రసాద్, మాజీ ఎమ్మెల్యేలు ఎం.షాజహాన్‌బాషా, దొమ్మలపాటి రమేష్, ఎమ్మెల్సీ బి.నరేష్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ భవానీప్రసాద్, మార్కెట్ కమిటీ చైర్మన్ రాటకొండ గుర్రప్పనాయుడు, కౌన్సిలర్లు వెంకటాచలపతి, షమీం అస్లాం, నాయకులు గంగారపు రాందాస్‌చౌదరి, బోడిపాటి శ్రీనివాస్, టీడీపీ పట్టణ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పులిమోహన్, మోడెం సిద్దప్ప తదితరులు ఉన్నారు.

జూనియర్ విద్యార్థులకు సీనియర్లు మార్గదర్శకంగా నిలవాలి

మదనపల్లె రూరల్: జూనియర్ విద్యార్థులకు సీనియర్లు మార్గదర్శకంగా నిలవాలని ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ రామలింగారెడ్డి అన్నారు. కళాశాలలో గురువారం ఫ్రెషర్స్‌డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ర్యాగింగ్ చట్ట విరుద్ధమని, సీనియర్లు ర్యాగింగ్ జోలికి వెళ్లకుండా జూనియర్లను స్నేహపూర్వకంగా చూడాలన్నారు. చదువులో వెనుకబడిన వారికి సలహాలు ఇస్తూ, వారి స్నేహాన్ని చూరగొనాలన్నారు. విద్యార్థులు షోషల్ మీడియాకు దూరంగా వుంటూ క్రమశిక్షణ అలవరచుకోవాలన్నారు. ఆదిత్య కళాశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సామాజిక సేవా కార్యక్రమాల్లో జూనియర్లు పాల్గొనాలని కోరారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన ఆట, పాటల, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో కళాశాల చైర్మX రామ్మోహX రెడ్డి, నాగమల్లారెడ్డి, హెచX వోడీలు, అధ్యాపకులు పాల్గొన్నారు.



88వ రోజుకు చేరిన రిలే నిరాహారదీక్ష

నింద్ర: నింద్ర మండలంలోని కొప్పేడు దళితులు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేస్తున్న రిలే నిరాహారదీక్ష గురువారంతో 88వ రోజుకు చేరింది. తమ గ్రామ సమస్యను సంబంధిత అధికారులు పరిష్కరించేంత వరకు దీక్షను కొనసాగిస్తామన్నారు. నేతమ్స్ షుగర్స్‌లో కొత్తగా నిర్మిస్తున్న పవర్‌ప్లాంటు నిర్మాణ పనులను ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు మధుబాబు, గ్రామ సర్పంచ్ అనిల్, యువకులు పాల్గొన్నారు.

చవితి కొనుగోళ్ల కోలాహలం


చవితి సందర్భంగా కొనుగోలుదారులతో మార్కెట్

పుత్తూరు: వినాయక చవితిని పురస్కరించుకుని గురువారం పుత్తూరు పట్టణంలో భక్తులతో సందడి సందడిగా కనిపించింది. పట్టణంలోని తిరుపతి రోడ్డులో వినాయక విగ్రహాలు, పత్రి, అరటి పిలకలు, ఎలక్కాయలు, మొక్కజొన్న కండెల కొనుగోలు వచ్చిన జనంతో పట్టణం కిటకిటలాడింది. పోలీసులు పట్టణంలో వాహనాల రాకపోకలను మళ్లించినా ట్రాఫిక్‌తో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు.

సీఎం సహాయ నిధి పంపిణీ


సీఎం సహాయనిధిని అందిస్తున్న ఎమ్మెల్సీ గాలి ముద్దుకృష్ణమనాయుడు

వెదురుకుప్పం: వెదురుకుప్పం మండలం యనమలమంద దళితవాడకు చెందిన సుధాకర్‌కు సీఎం సహాయనిధిని గురువారం ఎమ్మెల్సీ గాలి ముద్దుకృష్ణమనాయుడు అందించారు. సుధాకర్ రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిపాలు కావడంతో చికిత్స ఖర్చుల నిమిత్తం సాయం అందించాలని సీఎం సహాయనిధి దరఖాస్తు చేసుకున్నారు. ఈ క్రమంలో ఎమ్మెల్సీ గాలి ముద్దుకృష్ణమనాయుడు చొరవతో సుధాకర్‌కు రూ.76వేల200 వచ్చింది. ఆ సొమ్మును ముద్దుకృష్ణమనాయుడు బాధితుడు సుధాకర్‌కు అందించారు.

ఇన్ చార్జి హరికృష్ణచే చెత్తబుట్టలు పంపిణీ


ముస్లిం కాలనీలో చెత్తబుట్టలు పంపిణీ చేస్తున్న జీడీ నెల్లూరు టీడీపీ ఇన్ చార్జి హరికృష్ణ, ఎంపీపీ

కార్వేటినగరం: టీడీపీ జీడీ నెల్లూరు ఇన్ చార్జి హరికృష్ణ చేతుల మీదుగా గురువారం కార్వేటినగరం ముస్లిం కాలనీలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హరికృష్ణ మాట్లాడుతూ ఇంటిలోని చెత్తను బుట్టలో వేసి సిద్ధంగా ఉంచితే డంపింగ్‌యార్డు కార్మికులు వచ్చి తీసుకుని వెళ్తారని తెలిపారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యాలు బాగుంటాయన్నారు. అలాగే ఉప సర్పంచ్ నౌషాద్ చెత్తబుట్టలు వితరణ చేయడం అభినందనీయమన్నారు. మరో వారంలో రాజేంద్రరెడ్డి శివాలయం వీధికి బుట్టలు వితరణ చేస్తానన్నారు. చెత్త లేని గ్రామంగా తీర్చిదిద్దాలని ఎంపీపీ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజారావ్, రాధమ్మ, ఎంపీపీ జనార్ధనరాజు, డీఆర్‌పీ రవి, ఈవోఆర్‌డీ వెంకటరత్నమ్మ, ఈవో నాగరత్నమ్మ, సర్పంచ్ అమరావతి, సుబ్బరాయలు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ప్రైవేటు విద్యాసంస్థల బంద్

పుత్తూరు: ప్రైవేటు పాఠశాలల రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డిపై విద్యార్థి సంఘాలు దాడి చేయడాన్ని ఖండిస్తూ పుత్తూరు, నగరి ప్రైవేటు విద్యాసంస్థల యజమానులు గురువారం బంద్ నిర్వహించారు. పుత్తూరు డీఎస్పీ నాగభూషణరావును కలసి దాడులకు పాల్పడే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని వినతి పత్రం సమర్పించారు. . హిమజ విద్యాసంస్థల అధినేత సురేంద్రరాజు, శేషశాయి విద్యాసంస్థల అధినేత జయప్రకాష్, వివేకానంద అధిపతి సదాశివం, వేదవ్యాస అధినేత బాలసరస్వతి, సాయిజ్యోతి రమేష్, హరినాథరెడ్డి, విశ్వభారతి, శేషాచల విద్యాసంస్థల అధినేతలు పాల్గొని డీఎస్పీకి వినతి పత్రం సమర్పించారు.

సినిమా గైడ్

పుత్తూరు

శాంతి	జయ జానకి నాయక
విష్ణుమహల్	లై
శ్రీనివాస	నేనే రాజు నేనే మంత్రి

కొద్దిపాటి వానకే తెగిన ఊటచెరువు


అగ్గిచేనుపల్లె క్రాస్ రోడ్డు వద్ద కొద్దిపాటి వానకే తెగిపోయిన ఊటచెరువు

వెదురుకుప్పం: కొద్దిపాటి వానకే అగ్గిచేనుపల్లె క్రాస్ రోడ్డు వద్ద ఉన్న ఊట చెరువు కట్టడం తెగిపోయింది. ఊటచెరువులు, కుంటల అభివృద్ధికి ప్రభుత్వం కోట్లాది రూపాయలను ఖర్చుపెడుతుంటే క్షేత్రస్థాయి సిబ్బంది నిర్లక్ష్యం వల్ల నాసిరకంగా పనులు జరుగుతున్నాయి. నాణ్యత పాటించని నిర్మాణాలకూ బిల్లులు చెల్లిస్తున్నారు. క్షేత్రస్థాయి సిబ్బంది ఆడిందే ఆట..పాడిందే పాటగా పనులు జరగడం వల్ల పనులు జరిగిన కొద్దికాలానికే ట్టికొట్టుకుని పోతున్నాయనడానికి అగ్గిచేనుపల్లె క్రాస్ రోడ్డు వద్ద ఉన్న ఊట చెరువు తెగిపోవడమే నిదర్శనం. వెదురుకుప్పం మండలం జక్కిదొన పంచాయతీ అగ్గిచేనుపల్లె క్రాస్ రోడ్డు ఉన్న ఊట చెరువును అభివృద్ధి పరచడానికి ఇటీవల నిధులు ఇచ్చి వాటర్‌షెడ్ ద్వారా మట్టి పని, రాతికట్టడాలు(రివిట్‌మెంట్ పనులు) చేశారు. కానీ కొంచెం వానకే నిర్మాణం తెగిపోయి కొట్టుకునిపోయి ఉన్న నీరంతా వృధాగా పోయింది. ఉన్నతస్థాయి అధికారుల పర్యవేక్షణ కొరవడిన కారణంగా మండల స్థాయి, క్షేత్రస్థాయి వారు ఇష్టారాజ్యంగా వ్యవహరించి జిల్లా స్థాయి అధికారులకు తప్పుడు నివేదికలు ఇస్తున్నారనే ఆరోపణలు వినవస్తునాయి. నాణ్యమైన పనులు చేయించాలని మండల ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై వాటర్‌షెడ్ క్షేత్ర సహాయకుడు మురగయ్య మాట్లాడుతూ వాటర్‌షెడ్‌లో పనులు చేసిన మాట నిజమే, తెగిపోయిన మాట వాస్తవమేనన్నారు. తెగిన వాటిని తిరిగి మరమ్మతు పనులు చేయించడానికి చర్యలు తీసుకుంటామన్నారు.

పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి


పుత్తూరులో నగరి నియోజకవర్గ టీడీపీ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ముద్దుకృష్ణమనాయుడు

పుత్తూరు: దేశంలో ఏ పార్టీ కాని, ఏ రాష్ట్రం కాని, ఏ ప్రభుత్వం కాని చేపట్టని విధంగా నవ్యాంధ్రప్రదేశ్ లో సీఎం చంద్రబాబు అభివృద్ధి పనులు చేపడుతున్నారని ఎమ్మెల్సీ ముద్దుకృష్ణమనాయుడు తెలిపారు. గురువారం పుత్తూరులో నగరి నియోజకవర్గ టీడీపీ సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విభజనతో లోటు బడ్జెట్ ఉన్నప్పటికి చంద్రబాబు కృషితో అమరావతికి నూతన రాజధాని నిర్మించడమే గాక నవ్యాంధ్రప్రదేశ్ ను పారిశ్రామికంగా పర్యాటకంగా విద్య,వైద్య కేంద్రంగా అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. అభివృద్ధి కార్యక్రమాలే కాక వృద్ధాప్య, వితంతు పింఛన్లు, ఎన్టీఆర్ గృహ నిర్మాణాలు, చంద్రన్న బీమా, ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ వంటి సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు అందజేస్తున్నారని తెలిపారు. ఇవేగాక గతంలో ఏనాయకుడు చేయని విధంగా కృష్ణా, గోదావరి అనుసంధానం చేసి పట్టిసీమ ద్వారా నీరు అందిస్తున్నారని తెలిపారు. నీయోజకవర్గంలో 84 మందికి 57 లక్షల రూపాయల సీఎం సహాయ నిధిని బాధితులకు అందజేశారు. లబ్దిదారులకు ఆయన తనయుడు గాలి జగదీష్ సీఎం రిలీఫ్ ఫండ్ పంపిణీ చేశారు. వచ్చే నెల 3 నుంచి ఇంటింటా టీడీపీ కార్యక్రమం విజయవంతం చేయాలన్నారు. ఆయా గ్రామాల్లో కాని, వార్డుల్లో కాని పార్టీ చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు తెలియజేయాలని కార్యకర్తలను కోరారు. సమావేశంలో డీసీసీబీ మాజీ ఛైర్మన్ యుగంధర్, వైస్‌ఛైర్మన్ రత్నం భాస్కర్, ఎంపీపీ గంజి మాధవయ్య, మీర, వైస్ ఎంపీపీ వీరరాఘవులనాయుడు, వేణుగోపాల నాయుడు, ఎమ్మెల్సీ తనయుడు గాలి జగదీష్, టీఎన్ టీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవనాయుడు, పుత్తూరు, నగరి, నింద్ర, వడమాలపేట, విజయపురం మండల పార్టీ అధ్యక్షుడు గణేష్, కరుణ, అబ్బరాజు, దశరథవాసు, భాస్కర్, శ్రీనివాసులురెడ్డి, దశరథరామరాజు, కౌన్సిలర్లు ఆనంద్, సదాశివరెడ్డి, హరి, ఆస్పత్రి, ఆలయ కమిటీ ఛైర్మన్ లు జీవరత్నం నాయుడు, ప్రకాష్, పాండురంగయాదవ్ పాల్గొన్నారు.

బిందు సేద్యంపై రైతులకు అవగాహన కల్పించాలి - ఎంపీపీ



పుత్తూరు: ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల్లో తక్కువ నీటితో పంటలు సాగు చేసేందుకు అధికారులు బిందుసేద్యంపై రైతులు అవగాహన కల్పించి ప్రోత్సహించాలని ఎంపీపీ గంజి మాధవయ్య ఆదేశించారు. గురువారం పుత్తూరు మండల పరిషత్ కార్యాలయంలో బిందుసేద్యంపై వ్యవసాయశాఖ, ఉద్యానవనశాఖ, ఉపాధిహామీ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుత తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లో తక్కువ నీటిని వినియోగించి అధిక దిగుబడులు సాధించవచ్చునని తెలిపారు. ఈ పథకానికి పైపులు మంజూరు చేస్తామని తెలిపారు. ఈ పథకాలను రైతుల దృష్టికి తీసుకెళ్లాలని ఆయన అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో నిర్మల, మండల వ్యవసాయాధికారిణి శ్రీలక్ష్మి, ఉద్యానవనశాఖ అధికారి హరికృష్ణారెడ్డి, ఉపాధి హామీ పథకం అధికారిణి భార్గవి పాల్గొన్నారు.

నవరత్నాలను ప్రజల వద్దకు తీసుకెళ్ళండి

నారాయణవనం: వైసీపీ నేత జగన్ ప్రవేశపెట్టిన 9 అంశాలను ఇంటింటికి వెళ్లి ప్రచారం చేస్తూ ప్రజలను, కార్యకర్తలను ఉత్తేజపరుద్దామని వైసీపీ నాయకుడు ఆదిమూలం పేర్కొన్నారు. గురువారం పార్టీ కార్యకర్తలు, నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. గతంలో గడపగడపకి వైసీపీ కార్యక్రమం నిర్వహించినట్టే ఈ నవరత్నాలను కూడా ఇంటింటికి వెళ్లి ప్రచారం చేయడం కోసం బూత్ కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు.